వీక్షణం

Veekshanam Fortnightly

ఆర్థిక, సామాజిక పక్ష పత్రిక

సంపుటి :1 సంచిక : 20

సెప్టెంబర్16-అక్టోబర్15, 2004

భూ సంస్కరణల ప్రత్యేక సంచిక

పేదలకు భూమిని పంచాలి

శంకరన్

సుందరయ్య

పరమేశ్వర్

నాగేశ్వరరావు

వ్యవసాయ కూలి సంఘం సర్వే

వర్క్‌షాప్ సిఫార్సులు

వై.వి కృష్ణారావు

ప్రొ. కె.ఎస్.చలం

బొజ్జా తారకం

మాడభూషి శ్రీధర్

అలబండి ప్రసాదరావు

వామపక్ష పార్టీలు

బ్రెజిల్ భూపోరాటం

'వీక్షణం' పక్ష పత్రిక

భూసంస్కరణలంటే భూమి పంపకం మాత్రమే కాదు

ఎన్.ఆర్.శంకరన్

భూసంస్కరణలంటే కేవలం సీలింగుపైనున్న భూములను స్వాధీనం చేసుకోవటం, భూమిలేని వారికి, పేదలకు పంచి పెట్టడం మాత్రమే కాదు. భూమిని బదలాయించడమంటే అధికారాన్ని బదలాయించడమే. భూసంస్కరణలు అధికారాన్ని, ఆస్తిని, ఒక గ్రూపు నుంచి మరో గ్రూపుకు, STATUS ను బదలాయిస్తాయి. భూమిని కలిగివుండడం అంటే, అతను తలెత్తుకు తిరగవచ్చు; ఒకస్థాయిని ఇస్తుంది; తన శక్తిలో విశ్వాసం ఏర్పడుతుంది; సమభావన చోటుచేసుకుంటుంది. పేదరికం, దోపిడీ, న్యూనతాభావం, పరాధీనత, అసమానత-వీటన్నిటికీ భూమే కారణం. గ్రామీణ పేదలకు భూపంపకం చేస్తే వారిని దోపిడి నుంచి విముక్తి చేస్తుంది; లేబర్, క్రెడిట్ మార్కెట్లను బలపరుస్తుంది. భూమి వుంటే ఒ ఆదరువు ఏర్పడుతుంది, సమాజంలో ఒక స్థానాన్ని ఇస్తుంది. గ్రామీణ పేదలకు గ్రామీణ సామాజికార్థిక జీవనంలో ఒక స్థానం లభిస్తుంది. భూమికోసం గ్రామీణ పేదల తపన తెలిసిందే. ఒక వ్యాఖ్యాత అన్నట్లు-

> "సమానత్వం కోసం, భూమికోసం తపన కొత్త విషయమేమీ కాదు. తనచుట్టూ వున్న భౌతిక పరిస్థితులతో తలపడుతూండగా ఏర్పడిన పరిణామాలు తనను ఎలా భూమి నుంచి, సమానత్వం నుంచి గురించి ఆలోచింప చేశాయి. వారి ఆలోచన ప్రకారం భూమి కలిగి వుండటం సమాజంలో ఒక స్థానాన్ని కల్పిస్తుంది, సమానత్వం అంటే భూమి కలిగివుండటంలో సమానత్వం"

భూసంస్కరణ రాజ్యాంగంలో పొందుపరచిన ప్రజలందరి సమానత్వంకోసం, చేసే పోరాటంలో అంతర్భాగం. ఇది సాధించేవరకూ రాష్ట్రంలో గాని, దేశంలోగాని భూసంస్కరణల ఎజెండా సంపూర్తి కానేరదు.

వీక్షణం

veekshanam fortnightly

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 20 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | సెప్టెంబర్ 16 - అక్టోబర్ 15, 2004

లోవలి పేజీల్లో...

విడి ప్రతి: రూ॥ 12/-

వార్షిక చందా:రూ॥140/-లు

సంపాదకీయం:

ఎజెండామీదకు వచ్చిన భూసంస్కరణలు

భూసంస్కరణలు మళ్లా ఎజెండా మీదకు వచ్చాయి. ఇందుకు నక్సలైట్లను, చర్చించడానికి అంగీకరించిన ప్రభుత్వాన్ని అభినందించాలి. మొదటి ప్రణాళిక నుంచి, ఆ మాటకొస్తే, 1947కు ముందునుంచి కాంగ్రెస్ పార్టీ భూమికి, రైతుకు మధ్య ఉన్న దళారీలను తొలగించాలని విధాన ప్రకటన చేసి స్వాతంత్రపోరాటంలో రైతాంగాన్ని సమీకరించగలిగింది. కాని స్వతంత్రానంతరం పాలకులు సంస్కరణల బండి గాడి తప్పించారు. 1965లో అప్పటి రెవెన్యూ మంత్రి కళా వెంకట్రావు ఒక ప్రకటన చేసి భూసంస్కరణలు రాబోతున్నాయి జాగ్రత్తపడండి అని అర్థంవచ్చే ప్రకటన చేసి, 1973లో భూసంస్కరణల చట్టం పాస్ చేసింది.

గత మూడు దశాబ్దాల చరిత్ర చేసిన వాగ్దానాలను అలవాటు ప్రకారం బుట్టలో పారేసిన చరిత్ర . తెలుగుదేశానికి భూసంస్కరణ గొడవే పట్టలేదు. ఫలితంగా మైదాన ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో, వివిధ జిల్లాల్లో పేదలు భూపోరాటాలు నడిపారు; ఎంతో మంది నేలకొరిగారు. సీలింగ్ పైనవున్న మిగులు భూమిని గాని, ప్రభుత్వ బంజరు భూములను గాని కాగితం మీదే పంచటం జరిగింది. ఇది నక్సలైట్ ఉద్యమానికి ఆజ్యం పోసింది. పార్లమెంటరీ పార్టీలు అక్కడక్కడ, అపుడపుడు భూపోరాటాలు జరిపాయి గాని ఒక ఉద్యమ స్వరూపం తీసుకోలేదు.

ప్రస్తుతం ఈ సమస్యను నక్సలైట్లు ప్రభుత్వంతో జరిపే చర్చలో ఒక ముఖ్యమైన అంశంగా చేర్చటంతో, ఈ సమస్య పూర్వాపరాలను, సర్వేల ఫలితాలను, వివిధ సంస్థల, పార్టీల అభిప్రాయాలను ఒక చోటు ప్రోది చేసి పాఠకులకు నేపథ్య చిత్రాన్ని అందించాలనే ప్రయత్నం ఫలితమే ఈ భూసంస్కరణల ప్రత్యేక సంచిక.

వచ్చే సంచిక ఫోకస్: సమకాలీన ప్రపంచీకరణ

భూ పోరాటంలో వాస్తవాలు, వక్రీకరణలు

వరమేశ్వర్

యూరప్ సాహిత్యంలో ఫీనెక్స్ అనే అసాధారణ శక్తి గల ఒక పక్షి కనిపిస్తుంది ఆ పక్షిని కాల్చిబూడిద చేసినప్పటికీ ఆ బూడిదలో నుండి మళ్ళీ అది తిరిగి మరింత శక్తివంతంగా ప్రాణంతో లేస్తుంది. ఈ రోజు కొనసాగుతున్న భూపోరాటాలను అణచివేశాం, అణగిపోయాయి లేదా అణగిపోతాయి అనే వాదనలకు ఫీనెక్స్ పక్షిని ఉదాహరణ చెప్పదలచాను. నేడు తెలంగాణా అంతటా కొనసాగుతున్న భూపోరాటాలను పైపైన, పాక్షిక దృష్టితో చూచి వ్యాఖ్యానించేవారికి సైతం అదే ఉదాహరణ సరిపోతుంది. నేడు కొనసాగుతున్న భూపోరాటాలకు పోరాట చైతన్యం లేదని, ఎవరికైతే భూమి అవసరమో వారి పాత్ర లేదని, ప్రజలు భూస్వాముల పట్టా భూముల ఆక్రమణ స్థాయికి ఎదగలేదని, భూములు పంచితే తీసుకునే చైతన్యం మాత్రమే ప్రజల్లో ఉందని లేదా భయపెడితే భూములు వదులుకుంటారని, తుపాకులతో బెదిరించి మాత్రమే భూములు ఆక్రమిస్తున్నారనే వాదనలు భూపోరాటాలను వ్యతిరేకిస్తున్న వారు ముందుకు తెస్తున్నవి.

తాము బిగించిన చట్రంలోనే సంఘటనలు జరగాలని అలాగైతేనే వాటికి విశ్వసనీయత ఉన్నట్టుగా భావించేవారికి, వర్గ పోరాట క్రమంలో ఎదురయ్యే సజీవ సంఘటనలు చేదు గుళికలుగా మింగుడు పడవు. అలాంటి వారు నడుస్తున్న చిత్రంలోని సజీవ తత్వాన్ని ఎన్నటికి సొంతం చేసుకోరు. సమాజంలో జరుగుతున్న వర్గపోరాటం అప్పటి పొందికకు, స్థాయికి అనుకూలంగానే వివిధ రకాలైన ఘర్షణలను మన ముందు నిలుపుతుంది. వాటిని సక్రమంగా అర్థం చేసుకొని ఆ ఘటనలోని అభివృద్ధి క్రమాన్ని వేగిరపరచడమనేది నిజంగా సమాజ అభివృద్ధికి అంకితమైన వారి ఆచరణ వుండాలి. ఎన్నో ఏళ్ళుగా భూమి లాంటి ఉత్పత్తి సాధనం కొంత మంది చేతిలో ఉండి, భూమి కేంద్రంగా భూస్వామ్య వర్గాలకు, రైతాంగానికి మధ్య వర్గ పోరాటం సాగుతుంటే వివిధ రకాల వైరుధ్యాలు మన ముందుకు రాక తప్పవు. చారిత్రక క్రమంలో భూమి చేతులు మారుతూ 'భూమి' సమస్యలో చాలా సంక్లిష్టత చోటు చేసుకున్నది. ఈ సంక్లిష్టతలో పేదవారి మధ్య తగాదాలు రెచ్చగొట్టి పాలక వర్గాలు, భూస్వామ్య వర్గాలు తమ అధికార పీఠాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

వర్గ పోరాటాలు తీవ్రమవుతున్న కొద్ది పిల్లలకు తాయిలం పెట్టిన విధంగా భూసంస్కరణలు, భూదానోద్యమాలు, ప్రభుత్వ భూముల పంపిణీ, భూమి సర్టిఫికేట్‌లు తదితర సంస్కరణలు పాలకవర్గాలు ముందుకు తెస్తున్నాయి. గిరిజన-దళిత తదితర పేద ప్రజానీకంలో చైతన్యం పెరుగుతూ భూమి కోసం జీవన్మరణ పోరాటాలు కొనసాగిస్తుంటే ప్రజానీకాన్ని పక్కదారి పట్టించడానికి వీటిని ఎత్తుగడగానే పాలకవర్గాలు ప్రచారం కావిస్తున్నాయి.

ఫ్యూడల్ ప్రభువుల పలాయనం

తెలంగాణాలో 1978లో ప్రారంభమైన జగిత్యాల పోరాటమే వ్యవసాయ విప్లవంలో మలుపు. భూమి మీద హక్కు కలిగి, ఆ హక్కుతో వచ్చిన ఫ్యూడల్ అధికారానికి వ్యతిరేకంగా జగిత్యాల రైతాంగం తిరగబడింది. ఫ్యూడల్ ప్రభువులు ఊళ్ళు విడిచి పారిపోయారు.

ఈ ఉద్యమం ఆరిపోయిందని మధ్య మధ్యలో ఆశించిన వారికి అనేకసార్లు ఆశాభంగం కలిగింది. ఈ ఉద్యమం రోజు రోజు రెక్క విప్పుతూ పురోగమిస్తూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణాలో వందలాది మంది మిలిటెంట్లు, సంఘనాయకులు ఉద్యమంలో చొరవతో పాల్గొంటున్నారు. రైతు కూలీ సంఘాలు, గిరిజన రైతుకూలీ సంఘాలు, ఎంతో విలువైన అనుభవం సంపాదించి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నాయి. చైతన్యం ప్రాథమికస్థాయి నుండి మెట్టు మెట్టుగానే అభివృద్ధి అవుతుంది. అలాగే ప్రజలు ఒక పోరాటంలో అనుభవం సంపాదించిన తర్వాత మరో పోరాటానికి పెద్ద పెద్ద అంగలు వేస్తూనే పురోగమిస్తారు.

రైతు కూలీలు ఈ పుష్కర కాలంలో సాధించిన విజయాలతో ఉద్యమం పట్ల వారికి ఒక విధమైన నమ్మకం ఏర్పడింది. వీరికి నాయకత్వం వహించడానికి సిద్ధాంత బలం కలిగిన విప్లవోద్యమ నాయకత్వం కిందనే ఈ రోజు తెలంగాణాలో ప్రజలు బ్రహ్మాండమైన పోరాటాలు నిర్వహిస్తున్నారు. 1990 జనవరికి ముందు విప్లవోద్యమం వెనుక ప్రజలు లక్షలాదిగా ఉన్నారంటే చాలా మంది నమ్మలేదు. జనవరి తర్వాత లక్షలాది మంది సభలకు హాజరైతే ఎవరికి తోచిన విధంగా వారు వ్యాఖ్యానాలు చేశారు.

వరంగల్ రైతు కూలీ మహాసభలో స్పష్టంగా ఇచ్చిన, 'దున్నేవారికే భూమి' ప్రాతిపదిక మీద వ్యవసాయిక విప్లవాన్ని పురోగమింప చేయాలనే పిలుపు మీదనే తెలంగాణా అంతటా భూస్వాముల చేతిలోని మిగులు భూముల ఆక్రమణలకు తలపడ్డారు. మే నుండి ఈ పోరాటం మహాద్భుతంగా సాగి భూస్వాముల వేలాది ఎకరాల పట్టా భూములను ఆక్రమించడం జరిగింది. ఉద్యమం మరో దశకు సాగింది. వేలాది నాగళ్ళు భూస్వాముల పట్టా భూముల్లో కొంద్రలు వేశాయి. లక్షలాది మంది స్త్రీలు, పురుషులు పిల్లలు ఈ భూఆక్రమణలో పాల్గొన్నారు. భూస్వామ్య వర్గాలకు ప్రభుత్వానికి ఈ పోరాటాలు పెద్ద సవాలుగా పరిణమించాయి.

ప్రభుత్వ నిర్బంధాలు

ప్రభుత్వం హడావిడిగా పంట చేలపై 144 సెక్షన్ ప్రకటించి అణచివేత చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వం భూస్వాముల ప్రోద్భలంతో రైతాంగంపై పెద్ద ఎత్తున విరుచుకుపడింది. కొన్ని ప్రాంతాల్లో భూస్వాములు రైతాంగానికి లొంగిపోయిన చోట సైతం ప్రభుత్వమే చొరవ చేసి గ్రామాల మీద దాడులు నిర్వహించి బీభత్సాన్ని సృష్టించింది. వందలాది మంది పోలీసులు అత్యాధునిక ఆయుధాలతో గ్రామాల్లో రైతాంగాన్ని హింసించారు. అరెస్టులు, ఎన్‌కౌంటర్లు జరిపి ఉద్యమాన్ని అణచివేయాలని చూశారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో 16 మంది మిలిటెంట్లను కాల్చి చంపారు. దాదాపు 3 వేల మందిని అక్రమ కేసుల్లో ఇరికించారు. ఇంత నిర్బంధకాండ కొనసాగించినప్పటికీ భూస్వామ్యవర్గాలకు ప్రభుత్వం ధైర్యం కలిగించ లేకపోయింది. రైతాంగం ఆక్రమించిన భూములను భూస్వాములు

తిరిగి ఆక్రమించుకోడానికి సిద్ధపడలేదు. ఇప్పటికీ కొందరు భూస్వాములు తమ భూములను ప్రజల పరం చేస్తున్నామని పేపరు ప్రకటనలు ఇచ్చి రైతాంగంతో రాజీకి వస్తున్నారు.

ప్రస్తుతానికి నిర్బంధం మూలంగా ఇటు రైతాంగం భూములు సాగుచేయకపోగా, అటు రైతాంగ సంఘటిత శక్తికి తలవంచుతూ భూస్వామ్యవర్గాలు భూములు సాగుచేయకుండా, ప్రస్తుత పరిస్థితి యుద్ధరంగంలో విశ్రాంతి లాగా ఉంది. పరిస్థితి ఎటు మారుతుందో అని భూస్వామ్య వర్గాలూ, నిర్బంధంలో కాస్త సడలింపు వచ్చాక సేద్యం చేద్దామని రైతాంగమూ ఇరుపక్షాలు ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితిలో భూముల పరిస్థితి 3 రకాలుగా ఉంది. 1. మెజారిటీ భూములు బీడుగా ఉండడం 2. రైతాంగం కొన్ని భూముల్లో విత్తనాలు వేసి పంట తీసుకోవడం 3. భూములు సంఘం పేరనే ఉన్నప్పటికీ భూస్వాములు పంట తీసి సంఘంకు బటాయి ఇవ్వడం.

పైన తెలిపిన విషయం వాస్తవం కాగా, తుపాకీ బలంతోనే భూములు ఆక్రమిస్తున్నారని ప్రజల్లో పోరాట చైతన్యం లేదనే తదితర వాదనలన్నీ తప్పుడు వాదనలే! ఒక తల్లి బిడ్డను కనడానికి మంత్రసాని ఆవశ్యకత గుర్తించని వారి నుండి వచ్చే వాదనలు అవి. ప్రజలను పోరాటాల్లో తర్ఫీదు చేయుడానికి, ప్రజలను పోరాటాల్లో సమీకరించడానికి విప్లవోద్యమం నాయకత్వ పాత్ర వహించక తప్పదు. ప్రజల్లో పోరాట చైతన్యం లేదనే వాదం ఆచరణ క్రమంలో ఉన్నవారిని నిష్క్రియత్వానికి గురిచేసేది మాత్రమే. చరిత్రలో రైతాంగానికి సరియైన నాయకత్వం లభించినప్పుడు రైతాంగం బ్రహ్మాండమైన తిరుగుబాట్లు లేవనెత్తింది. స్థానిక రాజులను, విదేశస్తులను గజగజ లాడించింది. అయితే ఫ్యూడల్ భావజాలం ఉన్నంతవరకు వెనుక బడిన భావాలు ఉండడం సహజం. వాటిని పాలకవర్గాలు తమ స్వప్రయోజనాల కోసం వదులుకోవడం సహజం. అలా ఇందిరాగాంధీ లాంటి వారు ఎంతో చక్కగా ప్రజలను మోసం చేశారు. ఈ ఫ్యూడల్ భావజలాన్ని రూపు మాపకుండా వ్యవసాయ విప్లవంలోకి ప్రజలను సమీకరించలేం. వ్యవసాయ విప్లవం నిర్వహించేవారికి ఇది ప్రాథమిక కర్తవ్యం అవుతుంది. అలాగే దేశంలో తీవ్రతరమైన ఆర్థిక సంక్షోభం పెరుగుతున్నకొద్దీ పాలకవర్గాలు కూడా ప్రజలను పాత భావాలకు కట్టుబడి ఉంచలేవు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి వారి కాళ్ళ మీద వారు నిలబడి పోరాడక తప్పదు. విప్లవకారులు జగిత్యాల పోరాటకాలం నుండి ప్రజలను వివిధ పోరాటాల్లో తర్ఫీదు చేస్తూనే ఉన్నారు. ప్రజల చైతన్యం పెంచడానికి కృషి జరుగుతూనే ఉంది. వివిధ పోరాటాల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొంటున్నారు.

గత సంవత్సరం మే నుండి భూపోరాటాలు ఉవ్వెత్తున చెలరేగాయి. గిరిజనులు-దళితులు తదితర పేద ప్రజానీకం, భూ ఆక్రమణలకు సిద్ధమయ్యారు. తరతరాలుగా అణచివేతకు గురైనవారు కనుక వారి తిరుగుబాటు మనం కోరుకున్న విధంగానే ఉండదు. నిజానికి వారి భూములు గతంలో భూస్వాములు లాక్కున్నవే కాక ధనిక, మధ్య తరగతి రైతులలో వ్యక్తిగత తగాదాల్లో సైతం ఉన్నాయి. అవి అలా వ్యక్తిగత తగాదాల్లో ఉండడానికి అనేక కారణాలున్నాయి. ఇవి చరిత్రను పరిశోధిస్తే అర్థమవుతాయి. కాని వాస్తవంలో మాత్రం భూ సమస్యలు క్లిష్టతరంగానే ఉన్నాయి. అలాంటి వివాదాస్పద భూములను సైతం వ్యక్తిగతంగా ఆక్రమణలు చేశారు. కొన్ని సందర్భాల్లో సంఘనాయకులకు స్పష్టత లేకుండా కొంతమంది ధనిక రైతుల భూములు ఆక్రమణకు లోనయ్యాయి. ఏ ఉద్యమం లోనైనా అలాంటి చర్యలు జరగడం సహజమే. అలాంటి వాటిని క్రమంగా ఎడ్యుకేషన్ ద్వారా మాత్రమే సరిదిద్దడం జరుగుతోంది. అందుకు కొంత సమయం పట్టక తప్పదు. బాధ్యత లేనివారు విమర్శించడం తేలికనే గాని ఉద్యమంలో ఎంతో వైవిధ్యం వుంటుందనేది చూడరు. వివిధ రకాల భావాలను ఒకే తీరుగా మలచాలి. వివిధ స్థాయిల్లో ఉన్నవారు ఒకే భావనకు కట్టుబడేలా చేయడం అంత త్వరగా జరిగే విషయం కాదు. అందుకు నిరంతరం శ్రమ అవసరం. సమయం అవసరం. పోరాటంలో జరిగే తప్పుల నుండే వారు తిరిగి ఎడ్యుకేట్ అయి తప్పులు సరిదిద్దుకునే చైతన్యం సంతరించుకుంటారు.

ఈ పోరాటాలు మన ముందుకు అనేక ప్రశ్నలు తెచ్చాయి. రైతాంగం స్వానుభవం ద్వారానే ఎవరు తమ పీడక వర్గాల్లో తేల్చుకొని ఉంటారు. ఎవరి దగ్గర ఎంత భూమి ఉందో, అందులో ఏ కిత్తా (భాగం) ఎంత నాణ్యత గలదో కూడా వారు సరిగ్గా చెప్పకో గలుగుతారు. ఈ విషయంలో ప్రభుత్వ రికార్డులన్నీ దిగదుడుపే. రైతాంగం వెలిబుచ్చే అభిప్రాయాలకు విలువ ఇస్తూనే నాయకత్వం అక్కడ భూస్వామి ఎవరు, ధనిక రైతు ఎవరు, పేద రైతు ఎవరో తేల్చుకోవాలి. భూస్వామి అంటే భూమి పరిమాణం, భూమి నాణ్యత అందులో వచ్చే ఉత్పత్తి అతను శ్రమతో పాల్గొంటున్నాడా లేదా అనేది పరిగణనలోకి తీసుకొని ఆలోచించాలి. భూస్వాముల్లో 1. వందలు, వేల ఎకరాలు కలిగినవారు ఈ భూములతో పాటుగా వ్యాపారాలు, కాంట్రాక్టులు కలిగినవారు బడా భూస్వాములు, 2. ఫ్యూడల్ పద్ధతుల ద్వారా కూడబెట్టిన డబ్బును పెట్టుబడిగా పెట్టి కాంట్రాక్టులు చేపట్టి లక్షాధికారులుగా మారినవారు, భూమి పదుల సంఖ్యలోనే ఉండి గ్రామంలో మంచి స్థితిపరులుగా ఉన్నా వీరిని రెండవ తరగతి భూస్వాములుగా, 3. ఇక పదుల సంఖ్యలో కేవలం భూమి ఆధారం ఉన్న వారిని చిన్న భూస్వాములుగా వర్గీకరించి జనరల్ అవగాహనకు రావడం జరిగింది. అలాగే ధనిక రైతుల పట్ల, ఉద్యోగుల పట్ల చిన్ని చిన్న వ్యాపారాలు ఉన్నవారి పట్ల ఉద్యమానికి ఖచ్చితమైన అభిప్రాయముంది. వీరి భూములు ఎట్టి పరిస్థితిలోను ఆక్రమించ రాదు. పై సాధారణ అంచనా ఉద్యమానికి ఉన్నప్పటికి నిర్దిష్టంగా భూపోరాటాలను గైడ్ చేయడానికి గత ఏడాది ఒక స్పష్టమైన అవగాహనకు వచ్చింది.

ప్రస్తుతం కొనసాగుతున్న భూ ఆక్రమణ పోరాటాన్ని సరిగ్గా గైడ్ చేయడానికి గ్రామాల్లో వర్గ విశ్లేషణ చేయించి వివిధ వర్గాల మీద నిర్దిష్టమైన అంచనాకు రావాలి. ఈ భూపోరాటంలో బడా భూస్వాములను వేరు చేసి దెబ్బకొట్టే పద్ధతి అవలంబించాలి. మనం ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నామో ప్రచారం చేయాలి. భూపోరాటంలో లొంగి వచ్చే భూస్వామ్య వర్గాలను బట్టి తేడాలు చూపాలి. అక్కడి భూమి నాణ్యత ఉత్పత్తిని బట్టి సీలింగు తేడాలు విధించాలి. ప్రస్తుత స్థితిలో ధనిక రైతాంగం భూములను ఆక్రమించ రాదు. సీలింగులో ఏ పద్ధతి పెట్టినా భూస్వాములను ధనిక రైతాంగ స్థాయికి తగ్గించడం లక్ష్యంగా ఉండాలి. నిర్బంధం తీవ్రతరం అవుతున్న రీత్యా స్వాధీనపరచుకున్న భూములను వ్యవసాయ కూలీలకు, పేద రైతాంగానికి పంచాలి. భూమి రక్షించుకోవడానికి

రైతాంగానికి సాయుధం కావలసిన అవసరాన్ని గుర్తింపచేస్తూ సాయుధులు చేసే కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. భూ పంపిణీ చేపట్టడానికి ఉద్యమం ఈ కింది మార్గదర్శక సూత్రాలు రూపొందించుకుంది. ఆచరణలో ఎదురైన కొన్ని సమస్యలకు కూడా ఇందులో మార్గదర్శనం ఉంది.

భూ పంపిణీ నియమాలు

1. వచ్చే సంవత్సరం ఆక్రమిత భూములన్నింటిని సాగులోకి తేవడానికి గాను ఆ భూములన్నింటిని వ్యవసాయ కూలీ, పేద రైతులకు పంపిణీ చేయాలి. అందుకుగాను భూ ఆక్రమణలు జరిగిన గ్రామాలన్నింటిలో వర్గ విశ్లేషణకు సంబంధించిన డేటా సేకరించాలి. వ్యవసాయ కూలీ, పేద రైతులకు మాత్రమే భూమి పంచాలి. వ్యవసాయ కూలీలకు మొదట ప్రాధాన్యం ఇచ్చి కనీసం రెండెకరాలు వచ్చేలా చూడాలి. ఆపై పేద రైతులకు వారికున్న భూమి పరిమాణాన్ని బట్టి పంపిణీ చేయాలి.
2. పేద రైతులు అనగా కొన్ని ప్రాంతాల్లో 5 ఎకరాల లోపు వాళ్ళను, కొన్ని ప్రాంతాల్లో 3 ఎకరాల లోపు వాళ్ళను అక్కడి భూమి నాణ్యతను బట్టి పరిగణించాలి.
3. భూ ఆక్రమణలు జరిగిన గ్రామాల జనం నిర్బంధం రీత్యా భూములు చేసుకోవడానికి సిద్ధపడకపోతే పొరుగున ఉన్న గ్రామాలవారు దున్నడానికి సిద్ధపడితే వారికి పంపిణీ చేసి దున్నించాలి. అయితే ముందు ముందు సదరు భూమి ఉన్న గ్రామం వారిలో చైతన్యం పెరిగి భూములు చేసుకోవడానికి ముందుకు రావచ్చుననే దృష్టితో ముందు ముందు వారికి కొంత వాటా ఇవ్వాల్సి ఉంటుందని ప్రస్తుతం భూములు దున్నడానికి సిద్ధపడినవారికి చెప్పాలి. అలా భవిష్యత్తులో జనం మధ్య సమస్యలు తలెత్తకుండా సామరస్యంగా భూములు చేసుకోవడానికి అవగాహన కలిగిస్తూ ఎడ్యుకేట్ చేసుకోవాలి.
4. ఆక్రమిత భూముల్లో వ్యక్తులుగా రైతులకు చెందిన భూములు ఏవైనా భూస్వాములకు పోగొట్టుకున్నవి ఉంటే అలాంటివారికి (మధ్య తరగతి రైతు వరకు మాత్రమే) పంపిణీ వాటా ఇవ్వాలి కాని భూస్వామికి పోగొట్టుకున్న మొత్తం భూమి ఇవ్వరాదు. అతను కోరితే పంపకంలో వచ్చే వాటా అతను పోగొట్టుకున్న భూమిలో ఇవ్వవచ్చు.
5. భూమిని ఆక్రమించిన గ్రామాలలో పేద గిరిజన-గిరిజనేతరులుంటే గిరిజనుల్లోని వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకవేళ వీరు దున్నడానికి సిద్ధపడకపోతే గిరిజనేతర వ్యవసాయ కూలీ-పేద రైతాంగానికి పంపిణీ చేయాలి. ఇందులో కూడా పేద గిరిజన-గిరిజనేతరుల మధ్య ఐక్యత చెడిపోకుండా కాపాడాలి. అభివృద్ధి చేయాలి.
6. మన పోరాటంలో చురుకుగా పాల్గొన్న సంఘ నాయకత్వం ధనిక రైతులు, మధ్యతరగతి రైతులైనప్పుడు భూమిలో వాటా కోరకుండా వారిని ఎడ్యుకేట్ చేసుకోవాలి.
7. భూమి పంపిణీ చేసేటప్పుడు గిరిజనులైన-గిరిజనేతరులైన వ్యవసాయ కూలీ పేద రైతాంగానికి భూమి పంపిణీ చేయాలి. ఒకవేళ వీరు సిద్ధపడకపోతే భూమి బీడుగా ఉన్నా ఫర్వాలేదు. కాని మధ్యతరగతి రైతాంగానికి ధనిక రైతాంగానికి పంపిణీ చేయరాదు.
8. భూ ఆక్రమణలోనూ, భూమిని సేద్యం చేయడంలోనూ మధ్య తరగతి, ధనిక రైతాంగం సహాయాన్ని (ఎడ్లు, నాగళ్లు వగైరా) పొందడానికి ప్రయత్నం చేయాలి.
9. ధనిక రైతాంగం భూములను ఆక్రమించడం జరగదని భూస్వామ్యవర్గాల్లో తేడాను బట్టి వర్గ పోరాటంలో వారి వైఖరి బట్టి తేడాలు చూడడం జరుగుతుందని స్పష్టం చేస్తూ ప్రచారం చేయాలి.
10. ఏ గ్రామానికి ఆ గ్రామంలో భూమి పంపిణీ కమిటీలను ఏర్పాటు చేయాలి. అవి ఈ కింది వారితో కూడుకుని ఉండాలి.

ఎ. వ్యవసాయకూలీలు-2	బి. పేదరైతాంగం-2
సి. మధ్యతరగతి -1	డి. ధనికరైతాంగం-1
ఇ. సంఘ నాయకులు-1 మొత్తం ఏడుగురు	

రెడీమేడ్ పరిష్కారాలు ఉండవు

విప్లవాల కాలంలో ప్రతి విషయం రెడీమెడ్‌గా పరిష్కారం కాదు. ఎందుకంటే విప్లవకాలంలో ఘటనాక్రమం చాలా వేగంగా ఉండడమే అందుకు కారణం. వ్యక్తులుగా పాల్గొనే పోరాటాల్లో, కార్యక్రమాల్లో క్రమం తప్పని సూత్రాలను మొదటి నుండి అమలు చేయగలం. సామూహిక ఉద్యమాల్లో వివిధ వర్గాల ప్రజలు వేలాదిగా, లక్షలాదిగా కదిలే ఉద్యమాల్లో అందరినీ ఒకే తీరులో ఆలోచింపజేసే భావ సమైక్యత తీసుకురావడానికి అవసరమయ్యే క్రమం ఒకటి ఉంటుందని గుర్తించాలి. విప్లవోద్యమం తర్ఫీదు, అశేష జనసామాన్య తర్ఫీదు-ఏక కాలంలో జరగాల్సినవే. అయినా వాటి చైతన్యాలలోని తేడాను గుర్తించాలి.

విప్లవ శక్తులు ప్రజలను నడిపించేందుకు వేసే పథకాలు నిర్బంధ రాజ్యమవలంబించే ఎత్తుగడలపైన, జాతీయ పరిస్థితి పైన ఆధారపడి ఉంటాయి. ఉద్యమంలో ఎదురయ్యే ఎగుడు దిగుడులు కూడా గమనంలో ఉండాలి. ఈ నేపథ్యంలో భూముల ఆక్రమణ స్వాధీన కార్యక్రమాలను పరిశీలించాలి. నిరాయుధులైన రైతాంగం సాయుధం కాకుండా భూములను నిలబెట్టుకోలేరని చరిత్ర రుజువులతో సహా నిలిచి ఉంది. రైతాంగానికి తనదంటూ సైన్యం ఏర్పడకుండా బడాభూస్వామ్య బడాబూర్జువా ప్రభుత్వ సేనలను ఎదిరించలేదు. ఇటు తెలంగాణాలోనూ, దండకారణ్యంలో రూపొందిన మార్గదర్శక సూత్రానుసారం జరగబోయే పోరాటాలను రెండవదశగా పేర్కొంటూ, పారా మిలటరీ స్థానే ఏ బలగాలు దిగుతాయో ఊహించాలి. అందుకు మానసికంగా రైతాంగాన్ని, ఉద్యమాన్ని సంసిద్ధం చేయాలి. మనం నూతన పోరాటాలు ఆవిష్కృతమయ్యే దశలో ఉన్నాం. నూతన ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవాలి. నూతనత్వాన్ని ఆహ్వానించే వారందరికి ఇది పరీక్షా సమయం. ఈ పరీక్షను రక్తాక్షరాలతో లిఖిస్తూ ముందుకు సాగుతారని ఆశిద్దాం. (మార్చి 1990)

భూ సమస్యపై సరియైన అవగాహన

స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య

(భూ సంస్కరణల గురించి 1970 సంవత్సరం ఆఖరులో సుందరయ్య రాసిన వ్యాసాన్ని సంక్షిప్తీకరించి ఆ దిగువన ఇస్తున్నాం- సం)

ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సుమారు అయిదారు కోట్లు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు నాలుగు కోట్ల మంది వ్యవసాయం, దాని ఉప వృత్తుల మీద జీవిస్తున్నారు. వ్యవసాయం మీద జీవించే ఈ కోట్లాది ప్రజల జీవిత సమస్య పరిష్కారంగానిదే, వారికి సంవత్సరం పొడవునా పని, వారి కుటుంబ పోషణకు కావాల్సిన కనీస జీవిత భృతి అయినా గ్యారంటీ చేయనంతకాలం దేశంలో పురోభివృద్ధి ఏ రంగంలోనూ చెప్పుకోదగినంతగా జరగదు.

అయితే వ్యవసాయం మీద జీవించేవారంతా, భూమి మీద కష్టపడి పనిచేసి జీవించడం లేదు. కొంతమంది భూమి మీద కాయకష్టం చేయకుండానే భూమిని కౌలుకిచ్చి సాగుచేయించుకొని, వచ్చిన కౌలు ఫలితాన్ని అనుభవిస్తూ జీవిస్తున్నారు. లేదా భూముల మీద అన్ని ముఖ్య వ్యవసాయ పనులలో కూడా సంవత్సరం పొడవునా కాయకష్టం చేయని కుటుంబాలను, కేవలం భూములను కౌలుకిచ్చి ఫలసాయాన్ని అనుభవించే వారిని, లేదా అజమాయిషీ చేస్తున్న, ముఖ్య వ్యవసాయ పనులన్నింటినీ పాలేర్ల చేత, రోజు కూలీల చేత చేయించికొని ఫలసాయాన్ని అనుభవించే వారందరినీ భూస్వాములుగా మనం పరిగణించవలసి వుంది. భూమి మీద అన్ని ముఖ్య వ్యవసాయ పనులలోను సంవత్సరం పొడవునా సొంతంగా కాయకష్టం చేసుకొని వచ్చిన ఫలసాయాన్ని అనుభవించే వారినందరినీ మనం రైతులుగా పరిగణిస్తాం.

ధనికరైతు:

కొంతమంది తమ సొంత భూములు లేదా కౌలుకు తీసుకున్న భూములు, మొత్తం తాము సాగుచేస్తున్న భూముల మీద తాము అన్ని ముఖ్య పనులలోను కాయకష్టం చేయడంతో పాటు, పాలేర్లను పెట్టుకుంటారు. పని ముమ్మరంగా ఉన్న రోజులలో ముఖ్యంగా నాటు వేతలు, కలుపుతీతలు, కోతలు, నూర్పిళ్ళలో పాలేర్లనే గాక, రోజు కూలీలను కూడా పెట్టుకుంటారు. తమ కుటుంబంలో నున్నవారు సంవత్సరం పొడవునా వ్యవసాయంలో పనిచేసే రోజులకన్నా, ఈ కూలీలచేత, పాలేర్ల చేత పని చేయించుకొనే రోజులు ఎక్కువగా ఉంటాయి. అంటే వీరు తమ సొంత ఆర్జితాన్నే గాకుండా, కూలీల, పాలేర్ల పని ఫలితాన్నుండి అదనపు విలువను కూడా భుక్తం చేసుకొంటున్నారు. ఇలాంటి కుటుంబాలను మనం ధనిక రైతులుగా పరిగణించాలి.

మధ్య తరగతి రైతు:

తమ సొంతం లేదా కౌలు భూమి మీద మొత్తం తాము సాగుచేస్తున్న భూమి మీద, తమ కుటుంబం సంవత్సరం పొడవూ అన్ని ముఖ్య పనులలో కాయకష్టం చేసి పంటలు పండిస్తారు. వీరిలో చాలామంది చిన్న పాలేర్లను ఇంటి పనులకోసం, వ్యవసాయ పనులు, గేదెలు తదితర పశువుల కాపరి పనిచేయడానికి పెట్టుకుంటారు. ముమ్మర పని తరుణాలలో నాటువేతలు, కోతలలో రోజు కూలీలను పెట్టుకుంటారు. వీరి కుటుంబశ్రమ రోజులు, ఈ కూలీ పని రోజుల కన్న అత్యధికంగా ఉంటాయి. కుటుంబార్జితం కన్న పరార్జితం తమ మొత్తం ఆదాయంలో చాలా తక్కువగా వుంటుంది. వీరికి వ్యవసాయం మీద వచ్చే నికరాదాయం వారి మామూలు కుటుంబ పోషణకు బొటాబొటిగా సరిపోతుంది. చాలా మందికి లోటు కూడా వస్తుంది. పంటలు బాగా పండి అన్నీ సవ్యంగా కలిసివచ్చిన సంవత్సరంలోనే పెట్టుబడిగా వినియోగించగలిగిన మోతాదులో మిగలవచ్చు. ఇట్టి కుటుంబాలను మధ్యతరగతి కుటుంబాలుగా పరిగణిస్తాం.

ధనిక రైతుకు , మధ్యతరగతి రైతుకు మధ్య గీటురాయి:

మధ్యతరగతి రైతు కుటుంబంలో శ్రమశక్తి రోజులు, కూలీ పాలేర్ల పనిరోజుల కన్న ఎప్పుడూ ఎక్కువగా ఉంటాయి. రెండవ గీటురాయి: ధనిక రైతు కుటుంబానికి సామాన్యంగా ఏటేటా పెట్టుబడిగా పెట్టుకోగల్గిన మేరకు ఆదాయం మిగులుతుంది. మధ్యతరగతి రైతుకు ఈ విధంగా సామాన్యంగా మిగలదు. చాలామందికి లోటుకూడా వస్తుంది. అపురూపంగా మాత్రమే మంచి సంవత్సరాలలోనే మిగులుతుంది.

పేద రైతు:

పేద రైతు కుటుంబానికి, తమ వ్యవసాయం మీద వచ్చే నికరాదాయం, తమ నికృష్ట మామూలు కుటుంబ పోషణ కూడా చాలదు. ఎప్పుడూ లోటుగానే వుంటుంది. అందుచేత, ఇతరుల క్రింద కూలిపనికి గాని, లేక తన ప్రధాన వ్యవసాయాదాయానికి సహాయంగా మరేదైనా తాత్కాలిక ఉపవృత్తులు చూచుకుంటూ జీవితం గడుపుతూ ఉంటాడు. పేదరైతు ఇతరులను కూలికి పెట్టుకొని ఆ కూలీ శ్రమశక్తిని దోచుకోడు. ఎప్పుడయినా వ్యవసాయ పరిస్థితిని బట్టి కూలీలను పెట్టుకున్నా తాను కూడా బదులుగా గాని లేక ఇతరుల క్రింద కూలికి గాని పోతుంటాడు.

వ్యవసాయ కార్మికులు:

వ్యవసాయ కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకొని కూలిపని మీద ప్రధానంగా జీవిస్తాడు. వీరిలో కొంతమంది కొద్దిపాటి భూమి, ఎకరం, అర ఎకరం వున్నా ప్రధాన కుటంబ ఆదాయం భూమిమీద గాక, వ్యవసాయ కూలి పనుల నుండి గాని లేక తదితర వ్యవసాయ

ఉపవృత్తులలో కూలి చేసుకోవడం వల్ల గాని వస్తుంది. ఇట్టి కుటుంబాలన్నింటినీ మనం వ్యవసాయ కార్మికులుగా పరిగణిస్తాం.

మనం ఒక సమస్యను తీసుకొని సాధించుకోవడానికి పోరాడబూనుకున్నప్పుడు మనం ఎదుర్కోవలసిన శక్తులు నూటికి పదికి మించకుండా ఉండేట్లు చూసుకోవాలి. మిగిలిన 90 మందిని కలుపుకురావడానికి గట్టిగా ప్రయత్నించాలి. ఎందుకంటే, ఏ సమయంలోనైనా, ఏ సందర్భంలోనైనా మన ప్రత్యర్థి బలం, సంఖ్య ఎంత కొద్దిగా వుంటే, మన బలం, మన మిత్రబృందాల బలం ఎంత ఎక్కువగా వుంటే అంత తేలికగా మనం మన కోర్కెలను విజయవంతంగా సాధించుకోగలం. ఒక విజయం సాధించితే, దాని అనుభవంతో, ఫలితంతో, మరింత విశ్వాసంతోను, చొరవతోను, మరింత అదనంగా కష్టజీవులు కదలి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు వస్తారు. మరింత పెద్ద కోర్కెలను ఒక దాని తరువాత మరొకటి సాధించుకొంటూ ముందుకు పోగలుగుతారు. మన గ్రామసీమలలో ప్రతి కుటుంబాన్ని పై కొలబద్దతో, పై అవగాహనతో పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

సెంటు, కుంట కూడా భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాలు పూర్తిగా తమ శ్రమశక్తిని అమ్ముకొని రోజు కూలీలుగానో, నెలసరి లేదా సాలుసరి జీతగాళ్ళగానో జీవించేవారు; ఎకరం మాగాణి భూమి, రెండు మూడు ఎకరాలు మెట్టకులోపు భూమి ఉండికూడ ప్రధానంగా కూలిచేసుకొని జీవించే కుటుంబాలు; గ్రామసీమలలో వ్యవసాయ ఉత్పత్తులలో కూలిమీద ప్రధానంగా జీవిస్తున్న కుటుంబాలు-వీరు మొత్తం ఆంధ్రప్రదేశ్ జనాభాలో నూటికి 50 మందికి తగ్గకుండా ఉన్నారు. సుమారు 50 లక్షల కుటుంబాలు, వ్యవసాయ కార్మిక కుటుంబాలుగా ఉంటున్నాయి; వీరి చేతులలో వున్న భూమి 10 లక్షల ఎకరాలకు మించదు.

మరోవైపు పది ఎకరాలకు మించి మాగాణి భూమిగాని లేదా 20 ఎకరాలకు మించిన మంచి మెట్టభూమి గాని కలిగిన కుటుంబాలు, భూమిమీద కుటుంబాలలోని ఏ ఒక్కరూ ముఖ్యమైన వ్యవసాయ పనులలో సంవత్సరం పొడవూ కాయకష్టం చేయకుండా అజమాయిషీ చేస్తూ పాలేర్లతో, రోజు కూలీలతో సాగుచేయించుకునే కుటుంబాలు లేదా తమ భూములను కౌలుకిచ్చి వచ్చిన పరార్జిత ఆదాయంతో జీవించే కుటుంబాలు-ఇలాంటి భూస్వామ్య కుటుంబాలు మొత్తం జనాభాలో నూటికి నాలుగుపాళ్ళకు మించకుండా వున్నాయి. వీరి సంఖ్య సుమారు మూడులక్షల మధ్య ఉంటుంది. అయితే మొత్తం సాగు అయ్యే భూమిలో నూటికి 40 పాళ్ళకు పైగా వీరిచేతిలో వుంది. వీరి స్వాధీనం వున్న భూములు సుమారు కోటి ఎకరాలు.

ఒక ఎకరం నండి రెండు ఎకరాలవరకు మాగాణిగాని లేదా రెండు ఎకరాలు మొదలు ఐదు ఎకరాలవరకు మెట్టభూమిగాని కలిగి సాగుచేసుకొంటున్న కుటుంబాలు కుటుంబమంతా కష్టపడి కాయకష్టం చేసినా వీరికి ఆ భూకమతాల నుండి వచ్చే నికరాదాయం తమ కుటుంబ పోషణకు చాలక నిరంతరం అప్పులపాలౌతూ ఇతరుల క్రింద కూలికి గానీ లేదా ఇతర వృత్తులలో కొద్దిగా సంపాదించుకొంటూ ఏదోవిధంగా తమ జీవితాన్ని నికృష్టంగా గడుపుకొనే పేదరైతు కుటుంబాలు నూటికి 15 వరకు వున్నాయి. ఇలాంటి పేదరైతు కుటుంబాల సంఖ్య సుమారు 15 లక్షలు వుంటాయి. వీరి స్వాధీనంలో భూములు సుమారు 40 లక్షల ఎకరాలు. మొత్తం వ్యవసాయ కార్మికుల, పేదరైతుల చేతులలో వున్న భూములు 20 శాతం కన్నమించవు.

రెండు ఎకరాలనుండి ఐదు ఎకరాలవరకు మాగాణి భూమిగాని, ఐదు ఎకరాలనుండి పది పంద్రెండు ఎకరాలవరకు మెట్టభూమి గలిగి తమ కుటుంబమంతా దానిపై కాయకష్టం చేసుకుంటూ కుటుంబపోషణకు సరిపడ ఫలసాయం పొందుతూ వుండే కుటుంబాలు, చిన్న పశువుల కాపరులను, పని ఒత్తిడి రోజులలో కొద్దిగా రోజు కూలీలను పెట్టుకున్నా, తమ కుటుంబ శ్రమమీదనే ప్రధానంగా ఆధారపడే కుటుంబాలు-మధ్యతరగతి కుటుంబాలు నూటికి 10 వరకు వున్నాయి. ఇలాంటి కుటుంబాల సంఖ్య సుమారు 10 లక్షలు ఉన్నాయి. వీరి స్వాధీనంలోవున్న భూములు 40 లక్షల ఎకరాలు, మొత్తం భూమిలో 20 శాతం.

ఐదు, పది ఎకరాల మధ్య మాగాణి భూమిగాని లేదా పది, ఇరవై ఎకరాల మధ్య మెట్టభూమిగాని కలిగి కుటుంబంలోనివారు ముఖ్య వ్యవసాయ పనులలో కాయకష్టం చేసుకొంటూనే పాలేర్లను, రోజు కూలీలను అదనంగా పెట్టుకుంటారు. వచ్చే ఆదాయం కుటుంబం పోషణకుపోను, ఏటేటా మిగులుతూ పెట్టుబడిగా వినియోగించుకోవడానికి ఉపయోగపడేటంతగా లభ్యమవుతుంది. ఇలాంటి కుటుంబాలు ధనికరైతు కుటుంబాలు నూటికి 5 పాళ్ళు వుంటాయి. వీరి సంఖ్య 5 లక్షలు వుంటుంది. వీరి చేతులలో వుండే భూమి సుమారు 50 లక్షల ఎకరాలు. భూస్వాములు, ధనిక రైతుల చేతులలోవున్న భూమి 60 శాతం వరకు వుంటుంది. (ఇవి స్థూలమైన అంచనాలు)

అత్యధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారు. అందుచేత ఎక్కువ కౌలురేట్లకు భూమిని కౌలుకివ్వడం లేదా తక్కువ కూలిరేట్లకు వచ్చే కూలీలతో వ్యవసాయం చేయించుకోవడం లాభసాటిగా వుంది కాబట్టి కాయకష్టం చేసి సొంతంగా వ్యవసాయం చేయకుండా, ఈ పరార్జిత ఫలసాయం అనుభవించడం జరుగుతూ ఉంది. కాని వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల చైతన్యం, సంఘటన పెరిగి తమ న్యాయమైన హక్కుల కోసం చేసే పోరాటాలు పెరిగేకొద్దీ వీరిలో చాలామంది సొంతంగా కాయకష్టం చేసి సాగుచేసుకోవడానికి ముందుకు వస్తారు.

ఇలాంటి చిన్న భూకామందులు, మరొక తరహాకు చెందినవారు. వీరు అత్యధిక సంఖ్యాకులు, వీరు తమ భూములలోనుండి వచ్చే

ఆదాయం చాలక, దానిని కౌలుకిచ్చి, తాము ఇతర వృత్తులలోకి, ఫ్యాక్టరీలలో పనిచేయడానికి, ప్రభుత్వ ఉద్యోగాలలోకి, గుమాస్తాలుగా, ఉపాధ్యాయులుగా, లేక చిన్న పరిశ్రమలను, వ్యాపారాలను చేసుకుంటూ జీవించే వారున్నారు. వీరికి వ్యవసాయం మీద నుండి వచ్చే ఆదాయం పరార్జితమైనా తమ జీవితానికి సహాయంగా వుంటూ వుంది. ఇట్టివారు తమ ప్రధాన జీవన వృత్తులు వదలుకొని సొంతసాగు చేసుకోవడానికి తిరిగిరావడం చాలా అరుదు. అందువలన ఇట్టి చిన్న భూకామందులకు పూర్తి మార్కెట్టు ధర ఇచ్చి ప్రభుత్వం ఆ భూములను వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు ఉచితంగా పంచి పెట్టవలసి వుంటుంది.

ఈ వృత్తులలో భూస్వాములకు వచ్చే ఆదాయాలకన్న తగ్గకుండా ఎక్కువ ఆదాయాలు వస్తున్న వారిని భూస్వాములుగానే పరిగణించి వీరి విషయం, చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

భూపోరాటం:

పైన వివరించిన విధంగా 50 లక్షల మంది వ్యవసాయ కార్మిక కుటుంబాలలో చేతులలో 10 లక్షల ఎకరాలకు మించిలేదు. కుటుంబానికి 20 సెంట్లకన్నా భూమిలేదు. 15 లక్షల పేదరైతుల చేతులలో 40 లక్షల ఎకరాలు వుంది. వీరికి ఒక్కొక్క కుటుంబానికి సగటున రెండుమూడు ఎకరాలలోపునే భూమి వుంది. ఈ కొద్దిపాటి భూమి ఆ కుటుంబాలు పనిచేసుకోవడానికి ఏమాత్రం చాలదు. సంవత్సరంలో 200 రోజుల వరకు పనిలేని స్థితిలోనే వ్యవసాయ కార్మికులు ఉంటున్నారు. వీరికి సంవత్సరంలో 300 రోజులకు పని కల్పించాలంటే అందుకు కావలసిన పరిశ్రమలు తదితర వృత్తులు కల్పించడానికి వేలకొలది కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టవల్సి ఉంటుంది. ధనం మాత్రమే గాక అలాంటి పరిశ్రమలు నిర్మించడానికి దశాబ్దాలు పట్టుతాయి. ఈ లోపల ఈ కోట్ల కొలది వ్యవసాయ కార్మికులు, పేదరైతులు నిరుద్యోగంతో, పస్తులతో జీవిస్తూ వుండాలనడం సమంజసం కాదు. అలా అనడం సహించరాని విషయం. అందుచే ముందు సాధించవలసిన పని, ఈ కోట్లకొలది వ్యవసాయ కార్మికులకు పేదరైతులకు మరింత అదనంగా పని కల్పించి వారి ఆదాయాన్ని వారి కనీస పోషణకు కావలసిన మోతాదులోనయినా పెంపొందించవలసి వుంటుంది.

దీనికి వెనువెంటనే సాధ్యమయ్యేది, చేయవల్సిన పని, నేడు స్వయంగా కాయకష్టం చేయకుండా పరాన్నభుక్కులుగా జీవిస్తున్న భూస్వాముల వద్దనున్న అదనపు భూములన్నిటిని స్వాధీనం చేసుకొని వ్యవసాయ కార్మికులకు ఎక్కువభాగం, పేదరైతులకు కొంతభాగం పంచి పెట్టడం ఒక్కటే మార్గం. ఈ భూస్వాములు తమ పాత సోమరి జీవితాన్ని వదలి స్వయంగా కాయకష్టంతో భూములను సాగుచేసి జీవించడానికి ముందుకు వస్తే వారికి కూడా వారి కుటుంబం పనిచేసుకోగల్గిన మేరకు కావల్సిన భూమిని ధనిక రైతు కుటుంబస్థాయి జీవితాన్ని అనుభవించడానికి కావాల్సిన భూమిని వదలిపెట్టవలసి ఉంటుంది. అలా స్వయంగా కాయకష్టం చేసి సాగు చేసుకోవడానికి తయారు కాని వారికి లేదా ఇతర వృత్తులు, ఉద్యోగాలు ఉండి నెలకు రు. 500లకు మించి ఆదాయం వస్తూ కుటుంబపోషణకు ఇబ్బందిలేని వారికి భూములు వదలవలసిన పనిలేదు.

పది ఎకరాల మాగాణి భూమి లేక 30 ఎకరాల మెట్టభూమికి మించిన కుటుంబాల వారందరూ స్వయంగా కాయకష్టం చేయని కుటుంబాలుగా వున్నారు. కాబట్టి వారిని భూస్వాములుగా పరిగణించవచ్చునని పైన చూశాం.

అందువల్ల వీరివద్దనున్న భూములన్నింటిని మన స్వాధీనం చేసుకుంటే వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు పంచి పెట్టడానికి సుమారు 80 లక్షల ఎకరాలు సాగుభూమి లభ్యమవుతుంది. వ్యవసాయ కార్మిక కుటుంబాల చేతులలోను, పేదరైతు కుటుంబాల చేతులలోను వున్న 50 లక్షల ఎకరాల భూమిని కూడా కలుపుకొని పంచితే ప్రతి వ్యవసాయ కార్మిక, పేదరైతు కుటుంబానికి సుమారు రెండు ఎకరాల వంతున భూకమతాలు ఏర్పడుతాయి.

ఆంధ్రప్రదేశ్ భూస్వాముల వద్దనున్న ఈ అదనపు భూములే గాక, సాగుకు లాయకు అయిన బంజర్లు, పచ్చిక భూములు అడవి పేరుతో నమోదు చేసిన చెట్లులేని సాగుకు పనికి వచ్చే అడవి బంజర్లు, పడావులు మరో రెండు కోట్ల ఎకరాలున్నవి. వీనిని కూడ కొన్ని సంవత్సరాలలో క్రమంగా సాగులోకి తెచ్చే కొద్దీ వ్యవసాయ కార్మిక, పేదరైతు కుటుంబాలకు సగటున ప్రతి కుటుంబానికి మరో రెండు మూడు ఎకరాల భూమిని అదనంగా పంచిపెట్టడం సాధ్యమవుతుంది.

వ్యవసాయ కార్మిక కుటుంబాలన్నింటిని కలిపి పోరాటంలో తీసుకురావాలన్నా, వారి సమస్యను ఒక మోతాదులోనైనా పరిష్కరించాలన్నా, ప్రతి గ్రామంలోను భూస్వాముల వద్దనున్న అదనపు భూములను (వారు సొంత కాయకష్టంతో సాగు చేసుకోని భూములన్నింటినీ) స్వాధీనం చేసుకొని పంచుకొనే కార్యక్రమాన్ని ప్రచార ఆందోళనతో పోరాడిసాధించుకోవటమే ప్రధాన సమస్య అవుతుంది. బంజరు పోరాట సమస్య, కూలిరేట్లు, అప్పులు తదితర సమస్యలన్నీ ఈ సమస్యకు అనుబంధించిన ఉప సమస్యలు మాత్రమే. అది వ్యవసాయ కార్మిక, పేదరైతు కుటుంబాలకు అనుకూలంగా, భూస్వాములు పెత్తనాన్ని వారి గుత్తాధికారాన్ని బద్దలు కొట్టడానికి వారి వద్దనున్న అదనపు భూములన్నిటిని పంచుకునే ఉద్యమం జయప్రదం కానంతవరకు ఈ పాక్షిక విజయాలు సాధిస్తూ వచ్చినా వాటిని తిరిగి తిరిగి ఈ భూస్వాములు తమ బలాన్ని పుంజుకొని దెబ్బగొట్టడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. అందుచేతనే భూస్వామ్య విధానాన్ని రద్దు చేయనంతకాలం "దున్నే వారికే భూమి" అనే నినాదాన్ని అమలు జరపనంతకాలం ఈ సమస్యలు ఏవీ పరిష్కారం కావు.

1946-51 మధ్య జరిగిన తెలంగాణా పోరాట ఫలితంగా ఆనాటి ప్రభుత్వం తెలంగాణాలో కౌలుదార్లకు రక్షిత కౌలుదార్లని, వారి స్వాధీనంలోనున్న భూములను తక్కువ ధరకు కొనుక్కోడానికి

అవకాశమిస్తూ, తక్కువ కౌలురేట్లు నిర్ణయించి జిరాయితీ హక్కు కొంతవరకు ఇచ్చింది. కాని అదికూడ అమలులోకి వచ్చేటప్పటికి సగానికన్నా ఎక్కువమందిని భూమినుండి తొలగించారు.

నేడు ఆంధ్రప్రదేశ్‌లో కౌలురేటు పండిన పంటలో సగం నుండి మూడుపాళ్ళ వరకు ఉంటుంది.

పది పన్నెండు ఎకరాలలోపు సొంతగా కాయకష్టం సాగుచేసుకొంటున్న కౌలుదార్ల నుండి కౌలు భూములను ఏ పరిస్థితిలోను స్వాధీనం చేసుకోరాదని మనం వెనువెంటనే ఉద్యమాన్ని ప్రారంభించాలి.

కౌలు రేటు నాల్గవవంతుకు తగ్గాలని మనంచేసే ఆందోళన ఆచరణలో అమలులోకి రావాలంటే కౌలు రైతును భూమినుండి తొలగించకుండా గ్యారంటీ వుండాలని, ఆ భూమి మీద కౌలు రైతుకు జిరాయితీ హక్కు కల్గించాలనీ పోరాడాలి. ఆ తదుపరి పట్టాహక్కు వచ్చినప్పుడే పూర్తిగా భూస్వామ్యదోపిడీ అంతమవుతుందనీ, కౌలురైతు నిశ్చింతగా కనీస జీవిత భృతి సాధించుకొని జీవించడానికి సాధ్యమవుతుందనే చైతన్యం కూడా మనం కలిగించాలి. కౌలు రైతు పండించిన పంటలో భాగం యజమాని అనే పేరుతో పరార్జితం అనుభవించడానికి ఎవ్వరికీ హక్కులేదు. 'దున్నేవానిదే భూమి' అనే సత్యాన్ని ప్రజలలో అవగాహనకు తేవాలి.

వ్యవసాయ కార్మికుల కూలిరేట్లు:

వారిని దోచుకొనే వివిధ పద్ధతులు

వ్యవసాయ కార్మికులకు భూమి ఏమీ లేకపోవడంవల్ల, భూస్వాములు, ధనిక రైతులవద్ద రోజు కూలికి గాని, పాలేర్ల (జీతగాండ్ర) గా గాని పనిచేస్తున్నారు. వారి రోజు శ్రమ ఫలితంగా వచ్చే వస్తూత్పత్తిలో చాల కొద్దిభాగం మాత్రం వారికిచ్చి చాలా ఎక్కువ భాగాన్ని భూ యజమాని కాజేస్తున్నాడు.

కూలిరేట్లను నిర్ణయించడానికి సరైన పద్ధతి ఈ క్రింద వివరించడమైనది.

ఆయా వ్యవసాయ పంటలు పండే ప్రాంతాలలో, ఒక కుటుంబం (భార్యాభర్త, చిన్నబిడ్డలుగల కుటుంబం) ఒక నాగలి, జత ఎడ్లతో ఎన్ని ఎకరాలు సంవత్సరం పొడవూ తమ సొంత కాయకష్టంతోను ఒత్తిడి పని తరుణాలలో రోజు కూలీలను పెట్టుకుని సాగుచేయగలదో, దానిని ఒక యూనిటుగా, ఆర్థికంగా గిట్టుబాటయ్యే ఒక వ్యవసాయ క్షేత్రంగా (భూకమతంగా) గమనంలోకి తీసుకోవాలి. ఈ వ్యవసాయ కమతంలో, ఎన్ని రకాల పంటలు సంవత్సరంలో పండించేది. ప్రతి ఒక్క పంటకు, భూమిని దున్ని పైరు వేయడానికి తయారు చేయడం లేదా నాటువేయడం, కలుపుతీతలు, నీటిపారుదల, కోత, మార్పిడికి మొత్తం ఎన్ని పనిరోజులు పట్టేది లెక్కవేయాలి. మొత్తం అన్ని పంటలకు కలిపి సంవత్సరంలో ఎన్ని పనిరోజులు పట్టేది లెక్కవేయాలి. వివిధ పంటలలో వచ్చే ఫలసాయం, దాని ధర రైతులకు లభ్యమయ్యే ధరలతో, (గేదెలు, ఆవుల పాలమీద వచ్చే ఆదాయం, కూరగాయలు, వ్యవసాయానికి అనుబంధ వృత్తులలో వచ్చే తదితర ఆదాయాలు కూడా లెక్కలోకి తీసుకోవాలి)

బండి, నాగలి, తదితర పనిముట్లు, ఎద్దులు ఇవి ఎన్ని ఏండ్లు, పని చేస్తాయోచూచి, ఆ దామాషాన సంవత్సరానికి ఖర్చు (అరుగుదల ఖర్చుగా) తీసుకోవాలి. విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చులు మొత్తం ఎంత అయ్యేది లెక్కవేయాలి. కుటుంబం పనిరోజులుగాని, పాలేర్లు, రోజుకూలీల పనిరోజులుగాని, వారికిచ్చే జీతాలు ఇందులో కలపకూడదు. మొత్తం ఫలసాయం ఖరీదునుండి ఈ స్థిరఖర్చులు పోను మిగిలిన మొత్తం, పనిరోజుల ఫలితంగా తయారయిన నూతన విలువగా మనం పరిగణించాలి. ఒక పని రోజుకు ఎంత నూతనోత్పత్తి విలువను అది సృష్టిస్తుందో, దీనినిబట్టి మనం గుణించవచ్చు. న్యాయంగా భూమిమీద సాగుకు అందరికీ హక్కు ఉంటే ప్రతి ఒక్కరికీ తన శ్రమఫలితం పూర్తిగా దక్కేది. ఆ రీతిగా వ్యవసాయ కార్మికునికి అతనికి న్యాయంగా రావాల్సిన శ్రమఫలాన్ని, కూలిరేటుగా ఇవ్వడం లేదు. అందులో కొద్దిభాగం మాత్రమే భూయజమాని అతనికి ఇస్తున్నాడు. మిగిలినది తాను మిగుల్చుకుంటున్నాడు. ఈ వ్యవసాయ కార్మికునికి శ్రమ ఫలితం నుండే కూలిజీతం ఇవ్వగా మిగిలిన అదనపు విలువలోనుండే ప్రభుత్వానికి శిస్తు కట్టడంగాని, వ్యవసాయానికని తాను తెచ్చిన పెట్టుబడి అప్పులకు చెల్లించే వడ్డీనిగాని కట్టుతున్నాడు. ప్రభుత్వానికి కట్టవలసిన శిస్తు, పెట్టుబడిగా తెచ్చిన మొత్తానికి కట్టవలసిన వడ్డీని కూడా, మనం వ్యవసాయ ఖర్చుల క్రింద మినహాయించి రోజు శ్రమ ఫలితం చూచినా, నేడు ఇస్తున్న రోజుకూలి, పాలేర్ల జీతాలు చాలా తక్కువగా వున్నాయని, ఎక్కువభాగం భూయజమాని మిగిల్చుకొంటున్నాడనేది స్పష్టమవుతుంది.

విపరీతమైన వడ్డీరేట్లు, నాము జట్టీ తదితర దోపిడీ పద్ధతులు

అందుచేత వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు ఇచ్చిన అప్పులు, రొక్కరూపంలో గాని ధాన్యరూపంలోగాని, యే రూపంలో ఇచ్చినా నూటికి నెలకు ఒక శాతం కన్నా వడ్డీరేటుగాని, నామురేటు గాని ఉండరాదని ఆ మేరకు ఆ గ్రామంలోని భూస్వామే అప్పుపెట్టాలని లేదా ప్రభుత్వం అలా అప్పులను ఇచ్చే యేర్పాట్లు చేయాలని, ఈ అప్పును తిరిగి ధాన్యరూపంలోగాని, రొక్కరూపంలో గాని, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు తమకు వీలైన రూపంలో చెల్లించడానికి హక్కు వుండాలని, ఇది మన విధానంగా పెట్టుకొని ఆందోళన ఉద్యమం సాగించి ఈ హక్కులు సాధించుకోవాలి. పేరుకు పోయిన పాత అప్పులు, భూస్వాములకు, పెద్దవడ్డీ వ్యాపారస్తులకు ఇవ్వవలసిన వానిని రద్దుచేయాలి. చిన్నరైతులు, పేద మధ్య తరగతి రైతుల నుండి తెచ్చుకుని ఉన్న అప్పులను పై వడ్డీరేటు ప్రకారం లెక్కించి చెల్లించవలసి ఉంటే చెల్లించాలి.

భూపోరాటానికి ఐక్య సంఘటన

వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, తమ జీవిత సౌకర్యాలను శాశ్వతంగా పెంపొందించుకోవాలంటే భూస్వామ్య విధానాన్ని రద్దుగావించి భూమిని సాధించుకోడానికి అనేక పాక్షిక సమస్యలమీద కలిసి పోరాడుతూ, తమ చైతన్యాన్ని, సంఘటనను

పెంపొందించుకొంటూ విస్తృత దేశవ్యాప్త పోరాటం చేసి జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నప్పుడే సాధ్యమవుతుంది.

ఈ పాక్షిక పోరాటాలలోను అంతిమ భూపోరాటంలోను విజయం సాధించాలంటే నిరంతరం మధ్య తరగతి రైతులను తమలో సన్నిహితంగా దృఢంగా కలుపుకొని రావడానికి నిరంతరం పనిచేస్తూ ఐక్యసంఘటనలోకి తీసుకురావాలి. ధనిక రైతులను కూడా కలుపుకొని రావడానికి, భూస్వామ్యవర్గంతో వారు పూర్తిగా కలువకుండా కనీసం తటస్థంగా ఉండేట్లు మనకృషి ఉండాలి. పట్టణాలలోని కార్మిక వర్గంతో అవినాభావ సంబంధాలు ఏర్పరచుకోవాలి.

అంతిమ భూపోరాటానికి మెట్లుమెట్లుగా నేడు గ్రామాలలో జరుగుతున్న వివిధ రకాల దోపిడీకి వ్యతిరేకంగా పాక్షిక పోరాటాలు నడపాలి. కూలిరేట్లు పెంపుదల కోసం, కౌలురేట్లు, వడ్డీరేట్లు తగ్గింపు కోసం, ఇండ్లస్థలాల కోసం, కౌలుభూముల మీద జిరాయితీ తదితర పట్టా హక్కులకోసం; వివిధ రకాలైన బంజర్ల పంపకం, వాటికి పట్టాలకోసం; భూసీలింగు పరిమితులను తగ్గించి భూపంపకం కోసం; సాంఘిక తదితర పాతకాలపు జమిందారీ దోపిడీ పద్ధతులను రూపుమాపేందుకు, ఏ సమస్యను తీసుకున్నా, ఏ నినాదాన్ని రూపొందించినా, ఏ పోరాట రూపాన్ని అవలంబించినా అవి ఆయా ప్రాంతాలలోని వ్యవసాయ కార్మిక, పేదరైతుల చైతన్యస్థాయినిబట్టి సంఘటన బలాన్ని బట్టి నిర్ణయించవలసి వుంటుంది. ప్రతి సమస్యలోను మధ్యతరగతి రైతును ఖచ్చితంగా, సాధ్యమైనంత వరకు ధనిక రైతును కలుపుకొని రావడానికి సాధనంగా సమస్యలను తీసుకొనేటప్పుడు గ్రామాలలో విపరీతంగా దోచుకొనే పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా మొదట కేంద్రీకరించి పనిచేయాలి. అందువల్లనే కామ్రేడ్ లెనిన్ వ్యవసాయ కార్మికులను పేద రైతులను ఎప్పుడూ ఒకే సంఘంగా సంఘటిత పర్చాలని, వారిలో చీలికలకు దారితీసే ఏ చర్యా తీసుకోకూడదని గట్టిగా చెప్పాడు "గ్రామ పేదలు" అనే పేరుతో వారి సమస్యలను గూర్చి తరచూ చర్చించి వివరించాడు.

మధ్యతరగతి రైతులలో ఒక గణనీయమైన సంఖ్య రోజుకూలీలను, చిన్న పాలేర్లను చిల్లర వ్యవసాయపనులకు పశువులను కాయడానికి, ఇండ్లలో అనేక పనులు చేయడానికి పెట్టుకుంటారని పైన చూశాం. అదే విధంగా వీరిలో కొంతమంది కొద్ది మొత్తంలో అప్పులు, ఎక్కువ వడ్డీలకు, నాము రేట్లకు, తమకన్నా పేదలుగా వున్నవారికి పెట్టుతూ వుంటారని కూడా చూశాం ఈ విషయాలలో కొంతవరకు వీరు వ్యవసాయ కార్మికులతోను, పేద రైతులతోను ఘర్షణ పడతారు. కానివీరు కూడా ప్రధానంగా భూస్వాములు, వడ్డీ వ్యాపారస్థులు, బడా పెట్టుబడి దారుల క్రింద భూస్వామ్య బడాబూర్జువా ప్రభుత్వ విధానాల, చట్టాల క్రింద అనేక బాధలకు దోపిడీలకు గురవుతున్నారు. కౌలుదోపిడి, అప్పుల దోపిడి పన్నుల బాధను గురవుతున్నారు. తమ వ్యవసాయానికి కావాల్సిన నీటి సౌకర్యాలు లేవు. ఎరువులు, పనిముట్లు మేలురకమయిన విత్తనాలు తేలికగా లభ్యం కావడం లేదు. దొంగ మార్కెట్టులో కొనుక్కోవలసి వస్తూ ఉంది. ఇవన్నీ ప్రధానంగా భూస్వాములు చేతుల్లోకి ఈ తర్వాత ధనిక రైతుల చేతుల్లోకి పోతున్నాయి.

అందుచేత ఈ సమస్యలన్నిటిమీద వీరి ఆందోళన పోరాటాలకు వ్యవసాయ కార్మిక, పేద రైతుల సహకారం, బలం అత్యవసరం. ఈ సమస్యలన్నిటి మీద వ్యవసాయ కార్మికులు, పేద రైతులు వారి సంఘాల చొరవ తీసుకొని మధ్యతరగతి రైతులను బలపర్చడానికి ముందుకు రావాలి. దానివలన వీరిని కూడా భూస్వామ్య దోపిడీకి, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా తమతో కలుపుకొని రావడం తేలిక అవుతుంది.

వ్యవసాయ కార్మికులు పేదరైతులు ఆంధ్రదేశంలో మొత్తం జనాభాలో 70 శాతం వున్నారు. తమ జీవిత సమస్యలను పరిష్కరించుకోవాలంటే సోషలిస్టు సమాజ నిర్మాణానికి ప్రాతిపదికగా ప్రస్తుతమున్న భూస్వామ్య గుత్త పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని కూలద్రోసి జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవడం తప్ప వారికి మరో మార్గమేమీలేదు. అలా జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పరచనిదే "దున్నేవానికే భూమి" నినాదాన్ని అమలులోకి తేవడం అసంభవం. ఇష్టంలేని ప్రభుత్వాన్నీ భూస్వాములను మెడలు వంచి కొంతవరకైనా బంజరు భూములను పంచి ఇచ్చేలాగా చేయడం. బలమైన శక్తివంతమైన సుశిక్షితమయిన వ్యవసాయ కార్మికులకు పేదరైతాంగానికి నేటి సమాజంలో కూడా సాధ్యమే. శక్తివంతమైన ప్రజాపోరాటాల ద్వారా కూలిరేట్లు పెంచుకోవటం, కౌలురేట్లు, వడ్డీ నామురేట్లు తగ్గించుకోవడం, తాము సాగుచేసుకొనే భూముల నుండి కౌలుదార్లు బేదఖలు కానీయకుండా చేయడం, గ్రామీణ పేదలకు ఉచితంగా ఇండ్లస్థలాలు సంపాదించడం కొన్ని పరిమితులలో సాధ్యమే, ఈ విధంగా పెట్టుబడిదారీ, జమిందారీ, భూస్వాములు దోపిళ్ళకు వ్యతిరేకంగాను, బేదఖళ్ళకు వ్యతిరేకంగాను, బంజరు భూములు పంపిణీ కోసం సాగే పోరాటాలు ఆ తర్వాత దశలో విప్లవాత్మకంగా భూమిని పునర్విభజింపచేయడానికి వీలుగా వ్యవసాయ విప్లవ విజయానికి దారితీస్తాయి.

ఈ వ్యవసాయ విప్లవాన్ని, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయవలసిన అవసరం దానికి కావాల్సిన శక్తి, ఆ కర్తవ్యం వ్యవసాయ కార్మికుల, పేదరైతుల మీద ప్రధానంగా ఉంది. వానికోసం మధ్య తరగతి రైతులను ఖచ్చితంగా మొత్తంగా కలుపుకు రావాల్సిన బాధ్యత, ధనికరైతు వర్గాన్ని కూడా సాధ్యమైనంత వరకు కలుపుకురావాల్సిన బాధ్యత ప్రధానంగా వ్యవసాయ కార్మికుల పేదరైతుల మీద ఉంది. వారి సంఘాలమీద ఉంది. వారి నాయకత్వం మీద ఉంది.

భూసంస్కరణల అమలు సమీక్ష-సిఫార్సులు

(1973లో భూసంస్కరణల చట్టం ప్యానయిన తర్వాత 1983 వరకూ కాంగ్రెస్ పాలనలో, ఆతర్వాత తెలుగుదేశం పాలనలో సంస్కరణలు ఎలా, ఎంత వరకూ అమలు జరిగాయో, ఈ వ్యాసం వివరిస్తుంది- సం.)

ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల అమలుపై చర్చించేందుకు 1992లో ఒక వర్క్‌షాప్ జరిగింది. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ పిలుపుపై రాష్ట్రాల వారీగా జరిగిన వర్క్‌షాప్‌లలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. జనార్ధన్‌రెడ్డి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి జి.వెంకటస్వామి హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖ విద్యావేత్తలు, ప్రభుత్వాధికారులు, కార్యకర్తలు-30 విశేష పత్రాలను సమర్పించారు. భూసంస్కరణల అమలులో అనేక లక్ష్యాలు అసంపూర్తిగా మిగిలిపోవడం వల్ల రాష్ట్ర రాజకీయ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధీ తిరోగమనం పట్టిందని ఈ వర్క్‌షాప్ అభిప్రాయ పడింది. రాష్ట్రంలో భూసంస్కరణల అమలులో ఎదురవుతున్న అనేక సమస్యల్ని చర్చించి ఈ వర్క్‌షాప్ సిఫారసులు చేసింది.

సాధారణ సమస్యలపై సిఫారసులు:

వ్యవసాయ ఉత్పాదకతలో, దారిద్ర నిర్మూలనలో, జీవన ప్రమాణాల మెరుగుదలలో అభివృద్ధి సాధించాలంటే భూసంస్కరణలను తీవ్రంగా అమలు పరచక తప్పదు. అనేక సంవత్సరాలుగా అమలు జరుపుతున్న అనేక భూసంస్కరణల చట్టాలు, ప్రతికూల ఫలితాలనే ఇచ్చాయి. అప్పటిదాక మంచి స్థితిలో ఉన్న లబ్ధిదారులనే నష్టపరిచాయి. ఈ ధోరణిని తక్షణం నిలుపు చేయడమేకాక, రాష్ట్రంలో సరైన భూసంస్కరణలను రూపొందించే దాకా ఇలాంటి చర్యల్ని నిలుపు చెయ్యాలి. వర్క్‌షాప్ సిఫారసు చేసింది. ఈ వర్క్‌షాప్ జరిగేసమయానికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, అప్పటికి ఒక దశాబ్దకాలంగా భూగరిష్ట పరిమితి చట్టాలను, కౌలుదారుల రక్షణ చట్టాలను, గిరిజన భూముల పరిరక్షక చట్టాలను సమర్ధవంతంగా అమలు చెయ్యలేదని స్పష్టమయింది.

ఈ చట్టాలను సమర్ధవంతంగా అమలు పరచకపోవడానికి ఒక కారణం, ఈ చట్టాలను అమలు పరచవలసిన అధికారుల ప్రతికూల ధోరణి, భూసంస్కరణల అమలులో బెదిరింపులు, హెచ్చరికలు, దొంగకేసుల్లో ఇరికించి అరెస్టులు చేయించడం వంటి అనేక సంఘటనలు జరిగాయి. అందువల్ల, ఇలాంటి జోక్యాలను నివారించడానికి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను జారీ చెయ్యవలసిన అవసరం ఉంది.

రెవెన్యూశాఖ, భూసంస్కరణ ట్రిబ్యునళ్ళు అన్ని ప్రభుత్వశాఖలను పిలిచి, వారికి సంబంధించిన సమస్యలను చర్చించి భూసంస్కరణల లక్ష్యాలను, చట్టాలను గౌరవించాలని, ఆ చట్టాల స్ఫూర్తిని గ్రహించి వీటిని అమలు పరచవలసినదిగా స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలి.

అనవసరమైన చట్టపర వివాదాలవల్లే భూసంస్కరణల చట్టాల అమలులో తీవ్ర జాప్యం జరుగుతుందని వర్క్‌షాప్ గుర్తించింది. అనేక సందర్భాలలో సమస్యల పరిష్కారాన్ని-కోర్టులకే వదిలిపెట్టడం (అది వారి అధికారపరిధిలో లేనప్పటికి) జరుగుతోంది.

వివిధ భూసంస్కరణల చట్టాలకు గల విలువను సుప్రీంకోర్టు నిర్ణయాలు అనేకం బలపరచాయి. అయినా అనేక కింది న్యాయస్థానాలు సుప్రీం నిర్ణయాలను విస్మరించి, తమ అధికార పరిధిలో లేని పిటిషన్లను కూడా చేపట్టిన సందర్భాలున్నాయి. అందువల్ల, సుప్రీంకోర్టు నిర్ణయాలన్నింటితో ఒక డైజెస్ట్‌ను తయారు చేసి, హైకోర్టులద్వారా కింది కోర్టులకు, ఇతర సంబంధిత శాఖలన్నింటికీ అందచేయాలి. ఇలాంటి డైజెస్ట్‌లను అర్ధ సంవత్సరానికి ఒకసారిగాని, సంవత్సరానికి ఒకసారిగాని ప్రచురిస్తూ ఉండాలి.

ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల చట్టాలకు అత్యవసరమైన సవరణలను చేపట్టడంలో జరుగుతున్న జాప్యం పట్ల వర్క్‌షాప్ ఆందోళన వ్యక్తం చేసింది. చట్టాలు కాలదోషం పట్టేలోపే సవరణలు, జరపాలని సుప్రీంకోర్టుకూడా కోరింది. భూసంస్కరణల ట్రిబ్యునళ్ళ బాధ్యతలను చేపట్టే అధికారుల ఎంపికలో జాగ్రత్త వహించాల్సిన అవసరాన్ని కూడా వర్క్‌షాప్ గుర్తించింది.

అదేవిధంగా, సంబంధిత ప్రభుత్వ న్యాయవాదులు కూడా భూసంస్కరణల కేసులను తగిన విధంగా ముందుకు తీసుకు వెళ్ళేలా చూడవలసిన అవసరం ఉంది.

సంబంధిత కేసుల సత్వర పరిష్కారానికి సహాయ పడేందుకు, సామాజిక ఒప్పందాలు, యూనియన్లు, స్వచ్ఛందసంస్థలు. న్యాయ సహాయకులు (ఎమికస్ క్యూరీలు) గా హాజరయ్యేందుకు అనుమతించాలి.

భూ సంస్కరణల ప్రమాణాలను అమలు పరచడంలో అధికార చర్యలకు తోడుగా షేదలు, లబ్ధిదారుల ప్రమేయాన్ని కల్పించే సంస్థాగత యంత్రాంగం లోపించింది.

అందువల్ల పరిశోధనలకు, విచారణలకు, నిజ నిర్ధారణలకు గ్రామస్థాయిలో లబ్ధిదారులతో కూడిన కమిటీలను ఏర్పాటుచేసి, సంబంధిత సంస్థలు అవసరాన్ని బట్టి వారితో సంప్రదించే ఏర్పాటు చేయాలి.

సమర్ధవంతంగా భూమిని వినియోగంలోకి తేవడానికి భూసంస్కరణలు ఎంతో ప్రభావం చూపుతాయి. శ్రామికశక్తి అధికంగా

గల ఆంధ్రప్రదేశ్‌లో, భూసంస్కరణల లబ్ధిదారులైన చిన్న రైతులే భూస్వాములకంటే మరింత ఉత్పాదకతతో, మరింత సమర్థవంతంగా వ్యవహరించగలుగుతారు.

ప్రస్తుత చట్టాల ప్రకారం గ్రామాలకు చెందిన భూమి రికార్డు-ఆసక్తిగల సర్వే నెంబర్ల మేరకే వ్యక్తులకు అందుబాటులో ఉంటున్నాయి. భూసంస్కరణల నుంచి తప్పుకు పోయేవారి గురించిన సమాచారాన్ని పరిశోధించడంలో, ప్రభుత్వానికి సాయపడుటలో స్వచ్ఛంద, సామాజిక కార్యకర్తలకు అవకాశం లభించడం లేదు. అందువల్ల బిఎస్ఒ 170 తదితర సంబంధిత పత్రాలన్నీ పబ్లిక్ డాక్యుమెంట్లుగా అందరికీ అందుబాటులో ఉంచాలి.

ప్రధానమైన భూమి రికార్డులను జిల్లాస్థాయిలో కంప్యూటరీకరించాలి. అందువల్ల సమాచారం అందరికీ అందుబాటులో ఉంటుంది.

కౌలుదారు సంస్కరణలపై సిఫారసులు

కౌలుదారుల ప్రయోజనాలకు, లబ్ధికి చేసిన చట్టాలు వారి వినాశనానికే దారితీశాయని వర్క్‌షాప్ అభిప్రాయ పడింది. దిగువ సూచనల ప్రకారం ప్రస్తుత చట్టాలకు సవరణలు చేపట్టాలని సిఫారసు చేసింది. 1. తెలంగాణాలో కౌలుదారుల ఏర్పాటుపై నిషేధాన్ని తొలగించాలి. 'వ్యక్తిగత సాగు' అంటే అర్థాన్ని భారతప్రభుత్వ మార్గ దర్శక సూత్రాల ప్రకారం పునర్నిర్వచించాలి. రాత పూర్వక లీజ్ ఒప్పందాలను రిజిస్టర్ చేసినా-చేయకపోయినా-తప్పనిసరి చేసే చట్టంలోని సెక్షన్లకు సవరణలు చేయాలి. మౌఖిక, లాంఛన, తరుణ, వార్షిక మొదలైన అన్నిరకాల కౌలు ఒప్పందాలను వాటి వివిధ రూపాలతో సహా-అంటే పంటలో వాటా, స్థిరవాటా, స్థిర నగదు అద్దె మొదలైన ఏర్పాట్లను నమోదు చేసి రికార్డుల్లో ఉంచాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణాలో ప్రత్యేక కౌలు రికార్డులను నిర్వహించడం పట్ల అడంగల్ /పాణిపత్రాలలో కౌలుదారు/ వ్యవసాయదారు అనే వివరాలు నమోదు చేయడానికి కాలమ్‌లను ఏర్పాట్లు చేయడం పట్ల వర్క్‌షాప్ విచారం వ్యక్తం చేసింది. ఆంధ్ర, తెలంగాణా రెండు ప్రాంతాలలో కూడా కౌలుదారులను నమోదు చేయడానికి ప్రత్యేక రిజిస్టర్లను నిర్వహించాలని వర్క్‌షాప్ సిఫారసు చేసింది. కౌలుదారులను విడిగా నమోదు చేయడానికి, అడంగల్ / పాణిపత్రాలలోని కాలమ్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని వర్క్‌షాప్ కోరింది.

పశ్చిమబెంగాల్‌లో "ఆపరేషన్ బర్గా" తరహాలోనే ఇక్కడ కూడా కౌలుదారులను నమోదు చేసే ఉద్యమాన్ని చేపట్టాలని వర్క్‌షాప్ కోరింది. కౌలుదారులు మొత్తం వ్యవసాయ భూమిలో 30 శాతంగా ఉన్నందున, వారిని లెక్కల్లోకి తెచ్చేందుకు గాను ఈ ఉద్యమాన్ని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయగలని వర్క్‌షాప్ కోరింది.

పైన పేర్కొన్న విధంగా కౌలుదారులను నమోదు చేయడంలో ప్రభుత్వానికి సహాయపడేందుకు గాను వివిధ అసోసియేషన్లు, ఏజన్సీలు, యూనియన్లతో కూడిన గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలి. స్థానికంగా నివాసం ఉంటున్న భూస్వాముల, నివాసం ఉండని భూస్వాములకు చెందిన కౌలుదారుల మధ్య విభజన ఉండవలసిన అవసరం వుంది. నివాసం వుండని భూస్వాములకు చెందిన కౌలుదార్లే చివరికి ఆ భూమి యజమానులు అవుతారు. కాని నివాసం ఉంటున్న భూస్వాముల విషయంలో అలా కాదు, అందువల్ల భూస్వామి నివాసప్రాంతం, చిరునామా, కాలం నమోదు చేసేందుకు తగిన ఏర్పాటు ఉంచాలి. చిన్న, పేద కౌలుదార్ల ముఖ్యంగా బలహీనవర్గాలకు చెందిన వారి ప్రయోజనాల పరిరక్షణకు తగిన ఏర్పాట్లు ఉండాలి. మత, సేవా సంస్థలకు చెందిన భూములను కేవలం భూమి లేని పేదలు, పేద, చిన్నరైతులకు మాత్రమే కౌలుకు ఇవ్వాలి.

1.7.1980 నుంచి అమలు కావలసిన కౌలుదారు చట్టాలను అమలు చేయడం నుంచి ఆంధ్రప్రాంత రెవెన్యూ శాఖను మినహాయించారు. వాటిని ఖచ్చితంగా అమలు చేసే అధికారాన్ని రెవెన్యూ శాఖకు ఇవ్వాలి. రాష్ట్రం మొత్తానికి ఒక్కటే కౌలుదారు చట్టం ఉండాలి.

రక్షిత కౌలుదారులను కూడా తొలగిస్తున్న ఉదంతాలను, తెలంగాణా చట్ట విరుద్ధంగా కౌలుదార్లను తొలగిస్తున్న సమాచారాన్ని వర్క్‌షాప్‌లు సభ్యులు గుర్తించారు. ఇలాంటి తొలగింపులను నిలుపుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే తొలగింపు జరిగిన వారికి భూమి అప్పగించాలి.

పరిమితి చట్టాలు అమలుపై సిఫారసులు

ప్రస్తుతం అమలులో ఉన్న పరిమితి చట్టాలను రానున్న రెండేళ్ళలో ఖచ్చితంగా అమలు పరచాలి. కనీస వేతనాల చట్టాన్ని కూడా ఇందులో భాగంగా అమలు పరచాలి. మిగులు భూమిగా గుర్తించిన భూమిలో 50 శాతాన్ని కోర్టు వివాదాలలో పోగొట్టు కోవడం జరిగింది. అందువల్ల భూమి పోయిన అన్ని కేసులను సమగ్రంగా సమీక్షించి, సరైన కారణాలు లేని కేసుల్లో, భూమిని తిరిగి పొందేందుకు చర్యలు చేపట్టాలి.

ఇలాంటి లిటిగేషన్లలో దాదాపు 2 లక్షల ఎకరాలదాకా భూమి చిక్కుకుపోయింది. వీటికోసం తగినన్ని ట్రిబ్యునళ్ళు, అప్పిలేట్ ట్రిబ్యునళ్ళను ఏర్పాటు చేయడంతో బాటు, రాజ్యాంగంలోని 323 ఆర్టికల్ ప్రకారం ప్రత్యేక కోర్టును నెలకొల్పాలి. అప్షపుద్దీన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు ప్రభావం కల్పించేలా 1973, ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల (సిఒఎహెచ్) చట్టానికి సవరణ తేవాలి.

హైకోర్టు తీర్పు ముసుగులో భూస్వాములు విపరీత ప్రయోజనాలు పొందిన సందర్భంలో భూమి యాజమాన్యం గురించి

(మిగతాది 19వ పేజీల్లో)

భూమి సర్వే విశ్లేషణ నివేదిక

ఆంధ్రప్రదేశ్‌వ్యవసాయ కార్మికసంఘం

రాష్ట్రంలో సాగుభూములు, సాగుకు ఉపయోగపడే భూములు, ఇళ్ళ స్థలాలు, కౌలు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్త సర్వే నిర్వహించింది. 670 దళాలు, 2680 మంది సభ్యులు 10 రోజులపాటు ఈ సర్వేలో పాల్గొన్నారు. సర్వేపత్రం ఆధారంగా ప్రతి యింటికి తిరిగి సమాచారాన్ని సేకరించారు.

200 మండలాల్లో 255 గ్రామాల్లో జరిగిన సర్వే విశ్లేషణలు అనేక ఆసక్తికరమైన అంశాలను వెలుగులోకి తెచ్చాయి. 57 సం॥ల స్వాతంత్ర్యానంతరం సొంతభూమి లేని గ్రామీణపేదలు 60%వున్నారు. 1990 నుండి ప్రత్యేకించి ప్రపంచబ్యాంకు విధానాలు ముందుకొచ్చినప్పటి నుండి భూసమస్యను పూర్తిగా పాలకులు పక్కనపెట్టారు. చంద్రబాబు నాయుడు వ్యవసాయ కార్మికులను గాలికి వదిలారు. ఆర్థిక వనరులు పేదలకు సమకూర్చకుండా ఆర్భాటాలకు నిధులు వెచ్చించారు. ఫలితంగా పేదరికం పెరిగింది. పనులు లేవు. వలసలు అధికమయ్యాయి. అధికారులు తీవ్రనిర్లక్ష్యం వహించారు. నూతన ప్రభుత్వం భూసమస్యలపై ఇస్తున్న హామీలు, చేస్తున్న ప్రకటనలు పేదల్లో ఆశలు పెంచుతున్నాయి.

సర్వే సమాచారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి , సంబంధిత మంత్రులకు, అధికారులకు , రాజకీయ పార్టీల నాయకులకు అందజేస్తాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భూ సమస్యను పరిష్కరించాలి. అందుకు తగిన సమయం ఇస్తాం. ప్రభుత్వ వైఖరినిబట్టి కార్యాచరణ చేపట్టేందుకు కూడా పేదలను సంసిద్ధం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయించింది.

సాగుభూమి :

84,430 కుటుంబాలను సర్వేచేయగా ఇందులో 38,069 కుటుంబాలకు అంటే 45% కుటుంబాలకు సాగుభూమి ఉంది. 46362 కుటుంబాలకు 55%వారికి సొంతభూమి లేదు. సాగుభూమి కలిగినవారిలో 8,208 కుటుంబాలకు 21.5% మందికి పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వడంలో గతప్రభుత్వాలు ఎంతటి బాధ్యతారహితంగా వ్యవహరించాయో విదితమవుతుంది. ఒకే భూమికి 1325 కుటుంబాలకు ప్రభుత్వం పట్టాలిచ్చి, భూమి ఎవరికి స్వాధీనపర్చకుండా పేదలమధ్య ఘర్షణలను సృష్టిస్తున్నారు.

పంపిణీ చేయడానికి భూమి ఇంక్కెక్కడుందనే వాదన బలంగావుంది. కానీ మాసర్వేలో పేద ప్రజలకు పంచడానికి కావాల్సినంత భూమి అందుబాటులో వుందని తేలింది. 38 రకాలభూములు, 29,068 ఎకరాలు పేదలకు ఇవ్వడానికి అనుకూలంగా వున్నాయని గుర్తించడ్డాయి. కాబట్టి భూమి కావాల్సినవారికి ఇవ్వడానికి కావాల్సినంత భూమి అందుబాటులో వుంది. కావాల్సిందల్లా ఆ భూములు పేదలకు ఇవ్వాలన్న చిత్తశుద్ధి.

ఇళ్లస్థలాలు:

84,430 కుటుంబాలను ఇళ్ళ స్థలాలపై సర్వేలు చేయగా 51,720 కుటుంబాలకు 61.26 శాతం వారికి ఇళ్ళస్థలాలున్నాయి. 32,710 కుటుంబాలకు 38.74శాతం వారికి ఇంటి స్థలాలు లేవు. ఇంటిస్థలాలు వున్నవారిలో 12,749 కుటుంబాలకు (24.65%) పట్టాలులేవు. పట్టాలిచ్చి 2,079 కుటుంబాలకు స్థలాలు చూపించలేదు. ఇళ్ళస్థలాల పంపిణీ ఇంతకాలం కాగితాలమీదనే జరిగింది.

కౌలు :

6,512 కుటుంబాలు కౌలుకు భూములు సాగుచేస్తున్నారు. 3,626 కుటుంబాలు భూములు కౌలుకు యిస్తున్నారు. ఒక పంటకు పది బస్తాల నుండి ఇరవై బస్తాలవరకు కౌలువుంది. డబ్బురూపంలో అయితే రూ.3,000/- నుండి రూ.7,000/ వరకు అమలవుతుంది. కౌలుదారులకు బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదు. భూయజమానులు బ్యాంకునుండి రుణాలు తెచ్చి కౌలుదారులకు రూ.2/- నుండి రూ.4/-ల వరకు వడ్డీకి యిస్తున్నారు. పంటనష్టాలకు ప్రభుత్వం యిచ్చే పరిహారంకూడా కౌలుదారులకు చెందడంలేదు.

వ్యవసాయ కార్మిక సంఘం చేసిన సర్వే ఆధారంగా ప్రభుత్వం ఈ క్రింది భూసమస్యలను పరిష్కరించాలి.

1. ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వాలి.
2. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న ధనవంతులను తొలగించి పేదలకు ఇవ్వాలి.
3. అన్నిరకాల ప్రభుత్వభూములు, దేవాలయ భూములు పేదలకే పంపిణీచేయాలి.
4. పట్టాలిచ్చి పొజిషన్ చూపించని వారికి వెంటనే భూములు చూపాలి. అందరికీ ఆర్.ఓ.ఆర్.లు ఇవ్వాలి.
5. వెలుగు నిధులతో భూములు కొనివ్వాలి. నీటిసౌకర్యం లాంటి భూ అభివృద్ధి చర్యలను ప్రభుత్వం చేపట్టాలి.
6. డిఫారం పట్టా భూములను పేదలు కొంటే వారిపేరుతో పట్టామార్చాలి. ధనవంతులు కొనుగోలు చేస్తే వాటిని రద్దుచేసి పేదలకు ఇవ్వాలి.
7. ప్రభుత్వం, ప్రైవేటు స్థలాల్లో ఇళ్ళేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి. పట్టాలిచ్చిన వారికి స్థలం చూపాలి. అత్యవసర భూసేకరణ ద్వారా ఇళ్లస్థలాలకు భూసేకరణ చేయాలి. ప్రభుత్వమే స్థలాలను చదును చేయాలి.
8. అర్హులైన పేదలకు పక్కాగృహం ఇవ్వాలి. నిర్మాణ వ్యయం రూ.36వేలకు పెంచి రూ. 30వేలు సబ్సిడీ ఇవ్వాలి.
9. భూములు రీ- క్లాసిఫికేషన్ చేయాలి. భూ సీలింగ్ పరిమితి తగ్గించాలి. కోర్టుల్లో ఉన్న భూ కేసులను సత్వరం పరిష్కరించాలి. భూ సమస్యలపై హైకోర్టు ప్రత్యేక బెంచ్ ఏర్పాటుచేయాలి.
10. తెల్లకాగితాలపై అమ్మకాలు, కొనుగోళ్ళు చెల్లవని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుజరిపి తిరిగి సర్వేచేయాలి.
12. ఫారెస్టు యాక్ట్ సెక్షన్ 4 ప్రకారం సేద్యం చేసుకునే పేదలకు పట్టాలివ్వాలి. డిఫారెస్టు ల్యాండు పేదలకు ఇవ్వాలి.
13. కౌలుదారులకు గుర్తింపుకార్డులు, ఋణసౌకర్యం కల్పించాలి.
14. కాలువగట్టుపై వున్న కొబ్బరిచెట్టు పేదలకే లీజుకు ఇవ్వాలి. గట్లపై గుడిసెలు వేసుకున్న పేదలను తొలగించవద్దు.
15. ఎస్సీ కార్పోరేషన్ కొనుగోలు చేసిన భూములు పేదలకు స్వాధీనం చేయాలి. ప్రభుత్వమే పూర్తి డబ్బులు చెల్లించాలి.
16. చెరువులు, రిజర్వాయర్లు లోతట్టు (శికం) భూముల్లో పంటలు వేసుకునే అవకాశం పేదలకే ఇవ్వాలి.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం - గ్రామ సర్వే విశ్లేషణ:

సాగు భూమి సర్వే వివరాలు

	సర్వేచేసిన		భూమి		భూమివుండి పట్టాలేని వివరాలు					పేదలకు ఇవ్వడానికి గుర్తించిన భూములు	
జిల్లా	గ్రామాలు	కుటుంబాలు	ఉన్నవారు	లేనివారు	కుటుంబాలు	స్వభావం	ఎకరాలు	మొత్తం	ఒకేభూమికి ఇరువురికి పట్టాలు	స్వభావం	ఎకరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)
కర్నూలు	65	16826	7796	9030	805	ప్రభుత్వబంజరు				సీలింగుభూములు	600
					140	శివాయిజమ	750			ఫారమ్‌భూములు	1000
					45	కెసికెనాల్	304			స్వాతంత్ర్య సమర	100
					130	పోరంబోకు	260			దేవాలయ భూములు	2100
						ఎల్ఎల్‌సి, కొండ				చెరువు లోతట్టు	546
										ఫారెస్టు	2500
										ఇనాం భూములు	1000
										కెనాల్	400
										మేదరి పోడు	18
					135	పోరంబోకు	230				
					500	తంగడంచఫారం	550				
					600	కుంటలు, చెరువు	854				
					100	శ్రోత్రియం, జాగీర్	225	3023	61	దేవాలయ	1050
ఖమ్మం	43	11737	5851	5886	1917	పోరంబోకు	250		2	సీలింగు	
	30										
						సీలింగు	60			ప్రభుత్వం	457
						గ్రామసముదాయం	170			సాగర్ భూమి	129
						ఫారెస్టు ఎక్స్‌ప్లెన్	72				
										ఘాట్‌నెంబరు	3,374
						ఇనాం	60		209	ఫారెస్టు	190
						ప్రభుత్వభూమి	518	1130		భారస్‌ఖాతా	188
										గ్రామకంఠం	360
										సమిష్టిభూమి	13
									27	ఇనాము	6
గుంటూరు	12	8504	3477	5027	128	పోరంబోకు	59		1		
						చెరువు	70	129		బంజరువాగు	100
										పడావు	100
									10	దేవునిమాన్యం	32
శ్రీకాకుళం	6	1,358	925	433	240	లీజు	225				
						పోరంబోకు	455	917	141		4
						సీలింగు	210			భూ.లీజుభూమి	50
						మొ.కా.స.భూమి	27			పోరంబోకు	100
										బంజరు	125
										గ్రామకంఠం	6
										అనర్హుల	15
										సముద్రతీర	150
										ప్రభుత్వభూ	250
అనంతపురం	14	2,090	1,466	624	456				9	దేవాలయ	1803
										అ.బంజరు	1117
										పీర్లమాన్యం	6
										గుట్టపోరం	55

(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)
										తోపుపోరం	38
										వక్ఫ్‌భూమి	11
										జైలుభూమి	1000
										ఇనాం, మఠం	31
										చెరువుభూమి	75
మెదక్	7	1,651	1,050	601	58	పోరంబోకు	3	3	43	సికం	28
										దేవాలయం	12
										ప్రభుత్వ, గైరాన్	683
ప్రకాశం	16	4,711	2,182	2,529	243					ఏటి,తొట్టిపోరం	73
										రాజాభూమి	109
										దేవాదాయ	31
										వాగుబంజరు	72
										అసైన్‌మంట్	200
										ఫారం, విత్తనాభి	540
										గ్రామకంఠ,ఎస్సీ.కా	30
చిత్తూరు	7	1,742	910	832	84					అనా,పోరం	1007
										ప్రభుత్వ	500
										సొసైటీ	300
										అటవీబంజరు	1000
ప॥గో	11	6517	1451	5066	7	బంజరు	10			బం.పోరం.పుంత	26
ఆదిలాబాద్	7	1,237	476	761	205	ఫారెస్టు	800	800	18	ఫారెస్టు	100
										లావునిపట్టా	377
										సీలింగు	100
										సిఫాయి,ఇనాం	121
										సికం	46
కరీంనగర్	2	792	504	288							
మ॥నగర్	14	3702	2203	1499	120	భూదాన,పోరంబోకు	116+4	120		సీలింగ్300,భూదాన300	
										దేవాలయ 554	1154
విజయనగరం	2	714	288	426	136	దేవా,ప్రభు,సేవా, పో	500+325	825			
తూ॥గో	3	1618	293	1325	80	భూదాన,ప్ర.భూమి	34	34		దేవాదాయ,లీజు	123
రంగారెడ్డి	3	1,101	654	447	124	జాగిర్దారి	308			ఫారెస్టు	900
						పోరంబోకు	80	388			
నల్గొండ	10	3921	1513	2408	443	ప్రభుత్వభూమి	120	120		చెరువుసికం	92
కడప	1	761	283	478	72	భూకోనుగోలు	108	108		ఎస్సీ,కార్పొ	800
										సికం	46
										గ్రామకంఠం	6
										అనర్హుల	15
										సముద్రతీర	150
										ప్రభుత్వభూ	250
విశాఖపట్నం	14	4798	1319	3479	530	ఫారెస్టు	166				
						జంజరు	568	734	400	ప్రభుత్వబంజరు	1000
వరంగల్	10	6,445	2,946	3499	350		20	20		సీలింగ్+ప్రభుత్వ	732
కృష్ణా	8	4,206	2,482	1724	939	ప్రభుత్వలంక					939
మొత్తం	**255**	**84431**	**38069**	**46362**	**8208**		**8781**	**9231**	**1325**		**29068**

రాష్ట్రంలో పేదలకు భూపంపకం-హరితాంధ్రప్రదేశ్ నిర్మాణం

- కొల్లి నాగేశ్వరరావు
కన్వీనర్, భూసమస్య పరిష్కారానికి
నిర్దిష్ట చర్యలపై కమిటీ
సి.పి.ఐ., ఆంధ్రప్రదేశ్ సమితి.

2001 జనాభా లెక్కలననుసరించి ఆంధ్రప్రదేశ్ జనాభా 761.11 లక్షలు. వీరిలో గ్రామీణ జనాభా 552.97 లక్షలు. మొత్తం జనాభాలో 72.65 శాతం. వీరిలో భూమిలేని వ్యవసాయ కార్మికులు 217.22 లక్షలు. గ్రామీణ జనాభాలో 39.28 శాతం. వీరిలో 87 లక్షలు ఎస్.సి.లు మరియు 38 లక్షలు ఎస్.టిలు వున్నారు. 1.13 లక్షలకు గృహ వసతి లేదు. 25 శాతానికి ఎండవానల నుండి రక్షణ ఇచ్చు ఇళ్ళు లేవు. 2001 ప్రారంభంలో రాష్ట్రంలో 31.45 లక్షలు రిజిష్టర్డు నిరుద్యోగులు వుంటే, 14681 ఉద్యోగ ఖాళీలు వున్నవి. సంవత్సరం ఆఖరుకు నిరుద్యోగుల సంఖ్య తగ్గకపోగా కొత్త వారితో కలిపి 31.58 లక్షలకు పెరిగింది. అనగా 0.4 శాతం మాత్రమే ఉద్యోగవసతి కలిగింది. 250 నిరుద్యోగులకు ఒక ఉద్యోగం లభించింది. కంప్యూటర్ యుగంలో ఉద్యోగ సౌలభ్యం ఇంత అధ్వాన్నంగా ఉన్న పరిస్థితులలో గ్రామీణ పేదలకు ఉపాధి వ్యవసాయంలోనే సాధ్యం. వ్యవసాయానికి మౌలిక అవసరం భూమి, నీరు. ఈ మధ్య పేదలకు భూవసతి కలుగచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే రాష్ట్ర సమగ్ర ఇరిగేషన్ అభివృద్ధికి అవసరమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించడానికి కూడా పథకం ప్రకటించింది. పేద ప్రజలకు భూమి, సాగునీరు లభిస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం. ఉపాధి పెరుగుతుంది. గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరుగుతాయి. పట్టణాలలో వ్యాపారాలు, పరిశ్రమలు పెరుగుతాయి. గ్రామీణ ప్రజలకు భూవసతి పెరిగితే ప్రత్యక్షంగా గ్రామీణ ఉపాధి సమస్య చాలా భాగం పరిష్కరించబడుతుంది. పరోక్షంగా పట్టణ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూడా తోడ్పడుతుంది. అంతేకాక పేద వ్యవసాయ కార్మికులలో విద్యావిజ్ఞానాలు పెరుగుతాయి. సామాజిక గౌరవం పెరుగుతుంది. వ్యత్యాసాలు తగ్గుతాయి. సామాజిక న్యాయం సాధ్యపడుతుంది.

భూసంస్కరణల చట్టం

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మౌలికమైన పేదలకు భూపంపకం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర వామపక్ష ప్రజాతంత్ర శక్తులు నిర్వహించిన పోరాటాల ఫలితంగా 1973లో భూసంస్కరణల చట్టం చెయ్యబడింది. ఈ చట్టాన్ననుసరించి భూస్వాములవద్ద 16.63 లక్షల ఎకరాలు మిగులు భూమి వున్నదని ప్రభుత్వం గుర్తించింది. దీనిలో ప్రభుత్వం 8.47 లక్షల ఎకరాలు స్వాధీనం చేసుకొని 5.71 లక్షల ఎకరాలు, 5.11 లక్షల లబ్ధిదారులకు పంచింది. ఈ పంపకం నాటికి కోర్టు లిటిగేషన్‌లో వున్న 8.62 ఎకరాలలో 31-3-2002 నాటికి 44.52 వేల భూస్వాములవద్ద 7.96 లక్షల మిగులు భూమి వున్నట్లు సమీక్షించి 6.45 లక్షల ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. అయినా 1.31 లక్షల ఎకరాలు కోర్టు లిటిగేషన్లలో వున్నది.

భూసంస్కరణల చట్టం ద్వారా తేలిన మిగులు భూములతోపాటు బంజరుభూములు వగైరా 1-11-69 నుండి 31-3-2001 వరకు ప్రభుత్వం 29.2 లక్షలమంది లబ్ధిదారులకు 42.45 లక్షల ఎకరాలు పంచినట్లు ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం రూరల్ డిపార్టుమెంటు ప్రకటించింది.

క్రింద చార్టులో ప్రకటించినవేకాక ప్రభుత్వం వివిధ రూపాలలో మొత్తం 66.68 లక్షల ఎకరాలు 33.99 లక్షల లబ్ధిదార్లకు పంచినట్లు ప్రకటించింది. పంపకాలు 5.71 లక్షలు యస్.సి.లబ్ధిదారులకు 9.79 లక్షల ఎకరాలు, 6.67 లక్షలు యస్.టి.లకు 11.83 లక్షల ఎకరాలు, బి.సి.లు 5.18 లక్షలకు 10.92 లక్షల ఎకరాలు, ఇతరులు 7.12 లక్షలకు 12.02 లక్షల ఎకరాలు పంచినట్లు ప్రకటించారు.

ఇలా పంచిన భూములలో భూసంస్కరణల చట్టాన్ననుసరించి 5.77 లక్షల ఎకరాలు మిగులు భూములతోపాటు భూదాన భూములు 1.12 లక్షల ఎకరాలు కూడా వున్నవి. అలాగే 1956 ఐ.ఎ. యాక్టు కింద కోస్తాంధ్ర, రాయలసీమ 13 జిల్లాల్లో పంచిన 3.16 లక్షల ఎకరాలు, 1955 టి.ఎ. యాక్టు ప్రకారం తెలంగాణా జిల్లాలలో పంచిన 3.51 లక్షల ఎకరాలు, ఈనాం రద్దు చట్టాన్ననుసరించి తెలంగాణా జిల్లాలలో పంచిన 2.37 లక్షల ఎకరాలు, భూమి కొనుగోలు పథకం క్రింద 1982.83 నుండి 2001-02 వరకు పంచిన 50 వేల ఎకరాలు, టెనెన్సీ యాక్టు కింద తెలంగాణా జిల్లాలలో పంచిన 6.98 లక్షల ఎకరాలు వున్నవి.

రాష్ట్రంలో భూ పంపకం -మిగులు భూముల పరిస్థితి

	1-11-69 నుండి3 1-3-2001వరకు ప్రభుత్వం పంచిన అన్నరకాల భూములు		అనంతరం 31-3-2002 వరకు మిగులు భూముల పరిస్థితి			
జిల్లాపేరు	లబ్ధిదారులు	పంచిన భూములు	మిగులుభూములు ప్రకటించిన భూస్వాములసంఖ్య	ప్రకటించిన మిగులు భూములు	ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నవి	కోర్టు పరిశీలలో ఉన్నవి
శ్రీకాలకుళం	84041	69124.72	9136	9910.68	8307.98	1602.70
విజయనగరం	81050	98600.83	7155	11239.66	8268.03	2971.63
విశాఖపట్నం	105679	151297.56	6801	12309.58	11095.38	1107.10
తూర్పుగోదావరి	67267	54968.17	21536	34347.69	15499.82	18847.87
పశ్చిమగోదావరి	63026	81953.23	23931	13821.00	8547.00	4770.00
కృష్ణా	84397	86967.11	24229	22379.90	16393.64	5986.26
గుంటూరు	92524	70813.65	23879	9418.78	7791.04	878.87
ప్రకాశం	198560	309147.56	19279	17957.06	16309.66	1647.40
నెల్లూరు	253616	408131.06	16044	64988.89	63385.97	1602.92
చిత్తూరు	280787	387693.96	10467	16265.28	11193.53	4455.37
కడప	120430	221367.66	10355	11612.11	10169.37	1442.74
అనంతపూర్	237144	607593.25	29745	64049.00	61768.95	1975.73
కర్నూలు	74934	109447.52	32847	65619.47	60411.03	5129.07
ఆదిలాబాదు	84869	213075.68	17661	61290.80	53918.28	7372.52
ఖమ్మం	126153	265633.27	15148	55744.54	31507.35	23963.92
వరంగల్	173313	173186.5	20577	57468.40	44665.41	3868.38
కరీంనగర్	144861	106780.19	18290	39218.94	34718.19	2497.21
మహబూబ్‌నగర్	126110	209009.99	43002	51247.03	41128.45	4769.08
మెదక్	157369	239361.23	21368	62108.21	46404.02	13274.30
నిజాంబాద్	145273	163163.79	11915	14595.20	14334.16	251.04
నల్లగొండ	149129	148687.94	40481	42776.74	34422.34	5804.29
రంగారెడ్డి	734	69642.13	21161	58178.99	40358.69	17382.54
మొత్తం	29,23,953	42,45,607	4,45,237	7,96,547,95	6,45,608.29	1,31,600.94

సోర్సు: రాష్ట్రప్రభుత్వ గ్రామీణాభివృద్ధిశాఖ నోట్ నుండి

భూ సమస్యలు

కొన్ని భూములకు పేదలకు పట్టాలు ఇచ్చినా భూస్వాముల అధీనంలోవున్నవి. ఆ భూములనుండి వారిని తొలగించి పేదలకు అప్పగించాలి. కొన్ని భూములు అనేక సంవత్సరాలుగా పేదలు చేసుకొంటున్నారు. వాటికి పట్టాలివ్వాలి. కొందరికి పట్టాలిచ్చి, భూములు అప్పగించినప్పటికీ రెవిన్యూ రికార్డులలో వారిపేర్లు నమోదు చెయ్యబడలేదు. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వబడటం లేదు. ఈ సమస్యలు పరిష్కరించాలి.

పంచవలసిన భూములు

మిగులు భూములు పంపకం తరువాత నిర్మించిన ఇరిగేషన్ ప్రాజెక్టుల క్రింద తిరిగి వర్గీకరిస్తే మరికొంత మిగులు భూమి తేలుతుంది. సుమారు మొత్తం 10 లక్షల ఎకరాల మిగులు భూములు పంచే అవకాశం వున్నది. రాష్ట్ర ప్రభుత్వ గణాంక పత్రాన్నునసరించి 17.30 లక్షల ఎకరాలు సాగుకు యోగ్యమైన బంజరు భూములు వున్నవి. అలాగే చెట్లు లేని అడవులు 20 లక్షల ఎకరాలు వున్నవి. వీటిలో ఇప్పటికే గిరిజనుల అధీనంలో వున్న 8 లక్షల ఎకరాలు 1980 చట్టాన్ననుసరించి రెగ్యులరైజ్ చెయ్యాలి. మిగిలిన 12 లక్షల ఎకరాలు గిరిజనులకు, పేద ప్రజలకు పంచాలి. తీరప్రాంత బంజర్లు సుమారు 9 లక్షల ఎకరాలు వున్నవి. వీటిలో అత్యధికభాగం ధనిక వర్గాల అధీనంలో ఆక్వా కల్చరు సాగులో వున్నవి. ఈ భూముల నుండి ధనిక వర్గాలను తొలగించి పల్లెకారులకు, పేదవర్గాలకు పంచాలి. ఇంకా సుమారు 9 లక్షల ఎకరాలు తెలంగాణాలో ఈనాం భూములు వున్నవి. దేవాదాయ ధర్మాదాయ భూములు 3.76 లక్షల ఎకరాలు వున్నవి. ఈ భూములలో పేద కౌలుదార్లను రక్షించేందుకు చట్టాన్ని సవరించాలి. పేదవారు కౌలుకు చేసే భూములు కొన్ని భూస్వాముల పేర లీజు కాంట్రాక్టులు వున్నవి. భూస్వాముల అధీనంలో వున్న కౌలు రద్దు చేసి వాస్తవ పేద కౌలుదార్లకప్పగించాలి.

ఇంకా 2 లక్షల ఎకరాల ఫారం భూములు వున్నవి. చెరువు లోతట్టు మెరక భూములు వున్నవి. ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రాజెక్టులకు, పరిశ్రమలకు సేకరించి వినయోగించని భూములు వున్నవి.

వన సంరక్షణ సమితుల నిర్వహణ బాధ్యత పేద ప్రజలకప్పగించి నిధులు మంజూరు చెయ్యాలి. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం బయోడీజిల్ ఉత్పత్తికి జట్రోపా పెంచే పథకం ప్రకటించింది. ఇది పెంచే బాధ్యత కూడా పేదప్రజలకప్పగించి అవసరమైన నిధులు సమకూర్చాలి. ఇంకా మొత్తం సుమారు 60 లక్షల ఎకరాలు పేద ప్రజలకు వివిధ రూపాలలో సాగుకు అప్పగించే అవకాశం వున్నది. ఈ భూములన్నీ పేదలకు పంచాలి. సాగు బాధ్యత అప్పగించాలి, ఉపాధి కల్పించాలి. అలాగే ఇళ్ళులేని వారికి వెంటనే ఇళ్ళ స్థలాలివ్వాలి. ఇళ్ళు కట్టించి ఇవ్వాలి.

వెలుగు పథకం

వెలుగు పథకంలో ప్రధానోద్దేశ్యం గ్రామీణ పేదలకు రావలసిన భూములు, భూస్వాముల అధీనంలో వున్న వాటిలో వారిని తొలగించి పేదలకప్పగించాలి. పేదలకు పంచటానికి, అవకాశం వున్నవి పంచాలి. సాగు బాధ్యత అప్పచెప్పటానికి అవకాశం వున్నవి అలా అప్పగించాలి. భూముల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు సమకూర్చాలి. వ్యవసాయ నిర్వహణకు తోడ్పడాలి. గ్రామీణ పేదల స్వావలంబనకు అవసరమైన సహాయం చెయ్యాలి. ఈ పథకం లక్ష్యాలు గొప్పవైనా ఆచరణలో అరకొరగా వున్నది. ఈ పథకానికి అవసరమైన నిధులను సమకూర్చి సక్రమంగా అమలుపర్చాలి.

భూములు అమ్మకుండా నిలబెట్టాలి

లక్షల ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం పంచినప్పటికీ ఈ భూముల అభివృద్ధికి వ్యవసాయానికి పెట్టుబడులు లేక అప్పులపాలై అనేకులు భూములు తిరిగి భూస్వాములకు అమ్ముకొంటున్నారు. కొందరు ఆత్మహత్యలకు బలి అవుతున్నారు. అందువల్ల పేద వ్యవసాయ కార్మికులకు భూములు పంచటంతో పాటు ఆ భూములలో పంటలు పండించుకొని స్వావలంబనతో జీవించటానికి అవసరమైన పెట్టుబడులు సమకూర్చాలి. భూముల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు సబ్సిడీగా ఇవ్వాలి. పంటరుణాలు వడ్డీ రాయితీతో ఇవ్వాలి. ఇరిగేషన్ సదుపాయం కలుగచెయ్యాలి. ప్రాజెక్టులు లేని ప్రాంతాలలో బోర్లు, పంపుసెట్ల కవసరమైన పెట్టుబడులు 90 శాతం సబ్సిడీపై ఇవ్వాలి. వీరి వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వ సంస్థలే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చెయ్యాలి. పేద వర్గాలను వ్యవసాయంలో నిలబెట్టాలి. హరితాంధ్రప్రదేశ్ నిర్మాణానికి పేదలకు భూపంపకంతో పాటు, వారిని భూములలో నిలబెట్టే పథకాలు అమలుపర్చటం అత్యంత అవసరం. ✤

(13వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. మేజర్ కుమారులకు వాటా కల్పించరాదని వర్క్‌షాప్ భావించింది. మేజర్ కుమారులకు వాటా కల్పించిన అన్ని కేసులను - అందులో న్యాయాన్ని పరిశీలన నిమిత్తం ప్రభుత్వం సమీక్షించాలి. అలాగే మేజర్ కుమారులకు వాటా కల్పించే వెసులుబాటును రద్దుచేస్తూ సవరణ తేవాలి. చట్టాన్ని ఆసరా చేసుకొని భూస్వాములు విగులు భూములను భుక్తం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఒక భూయజమాని అప్పీలు చేసుకునే దశలోనే తన కేసును కోల్పోతే, రివిజన్ చేపట్టడానికి ముందు తన భూమిని ప్రభుత్వానికి అప్పగించాలి. ప్రస్తుతం సుప్రీంకోర్టు హైకోర్టుల ముందున్న వాజ్యాలకు కూడా ఈ పద్ధతిని అనులు చేయాలి. ఈ మేరకు చట్ట సవరణను వెంటనే చేపట్టాలి. ఒకవేళ భూమి యజమానులు కేసు గెలుచుకుంటే, ఆ భూమిని భూసేకరణ చట్ట ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటే, భూయజమానికి పరిహారం కోరుకొనే అవకాశం కల్పించాలి.

మిగులు భూముల డిక్లరేషన్లను, మిగులు భూముల వివరాలతో సహా గ్రామాలలో ప్రకటించాలి. అవి స్వచ్ఛందసంస్థల పరిశీలనకు అందుబాటులో ఉంచాలి. పరిమితి హద్దులను తగ్గించాలనే ఒక బలమైన కేసు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నదని వర్క్‌షాప్ భావించింది. ఈ సందర్భంలో ఆ భూయజమానులు తమ జీవనోపాధి కోసం ఆ భూమిపైనే ఆధారపడ్డారా, వారు స్థానికులా, కాదా అనే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. చట్టం అమలులోకి వచ్చాక తగినంత భూమి ప్రజల సాగులోకి వచ్చింది. అందువల్ల వెంటనే పునర్ కంప్యూటరీకరణ చేపట్టాలి. భూపరిమితి కేసుల్లో సివిల్‌కోర్టుల జోక్యాన్ని నివారించే సవరణ తీసుకురావాలి. భారీ ఎత్తున వ్యవసాయంలో భూముల్ని పరిశ్రమలకోసం కొనుగోలు చేయడాన్ని నివారించాలి.

బలహీన వర్గాల వారికి ప్రభుత్వ భూములను కేటాయించాలి. వారికి సమిష్టి ఆస్థి వనరులు అందుబాటులోకి వచ్చేలా చూడాలి.

గిరిజన, అటవీ భూముల విషయంలో, వాటిని సాగుచేసుకొంటున్న గిరిజనులకు తగిన చట్టపరమైన అధికారాలు కల్పించాలి. టైటిల్ డీడ్స్ ద్వారా ఆ హక్కుల్ని ధృవీకరించాలి.

సహజవనరులైన భూమి, నీరు, గనులు, అడవులపై గిరిజనులకు సంప్రదాయంగా కొనసాగుతున్న హక్కులను గుర్తించాలి. ఈ విషయంలో కోర్టులను ఆశ్రయించేందుకు అవసరమైతే గిరిజనులకు ధనసహాయం కూడా అందించాలని వర్క్‌షాప్ సిఫారసు చేసింది. నీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం గిరిజన భూముల్ని ప్రభుత్వం సేకరిస్తే, వాటికి పరిహారంగా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో భూమిని కేటాయించాలి.

భూసంస్కరణల అమలులో గ్రామీణ పేదలకు చెందిన స్వచ్ఛంద, ప్రభుత్వేతర సంస్థల పాత్రను ధృవీకరించాలి. వివిధ శాసన కమిటీలలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని ఆ సంస్థలకు కల్పించాలి.

✤

సాచివేతకు దారి వెతుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రంలో భూమి పంపక సమస్య మరోసారి ముందుకు వచ్చింది. దీని పూర్వాపరాలను లోతుగా పరిశీలించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగంపట్ల అనుసరిస్తూ వస్తున్న విధానాల ఫలితంగా రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ఆత్మహత్యలు తప్ప దిక్కులేని దుస్థితిలో పడింది. వ్యవసాయాభివృద్ధికి ముఖ్యమైన నీటిపారుదల రంగంపట్ల నిర్లక్ష్యం, రైతాంగానికి కొనబోతే కొరివి అమ్మబోతే అడవి వంటి పరిస్థితి కల్పించటం ఈ సంక్షోభానికి కారణమన్న విషయాన్ని ప్రజలు గుర్తించారు. 70 శాతం జనాభాకు వ్యవసాయం తప్ప మరో ఉపాధిలేని పరిస్థితి, మరో సింగపూర్ చేస్తామన్న స్వర్ణాంధ్ర మాటలే తప్ప పారిశ్రామికరంగంలో ఒక్క ఉద్యోగాన్ని కూడా కల్పించని స్థితిని కూడా ప్రజలు గుర్తించారు. సాంప్రదాయక చేతివృత్తులు నాశనమౌతున్నాయి. గ్రామ సీమలలో సంక్షోభాన్ని నివారించాలంటే ప్రభుత్వ విధానాల మార్పుతోపాటు, రైతాంగానికీ, వ్యవసాయ కూలీలకూ, గ్రామీణ పేదలకు తక్షణమే ఉపాధిని అందించగల భూమి పంపకం జరగాలన్న వాంఛ కూడా బలంగా వ్యక్తమౌతున్నది. దీనితో పాలకవర్గాలకు ఈ సమస్యను చేపట్టక తప్పలేదు.

దీనితో ముఖ్యమంత్రి సిపిఐ, సిపిఎంలతో భూమి సమస్యపై చర్చలు సాగించాడు. మిగిలిన రాజకీయ పార్టీలతో కూడా చర్చలు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు.

మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ సమావేశం వివరాలను పత్రికలకు తెలిపాడు. రాష్ట్రంలో భూమి సమస్యను సమగ్రంగా అధ్యయనం చేసి తగిన సూచనలు చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించాడు. గరిష్టస్థాయిలో భూమిని నిరుపేదలకు పంచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పాడు.

చిత్తశుద్ధిలేని శివపూజలేలయా అన్నట్లు, గతంలో ఈ కాంగ్రెసు ప్రభుత్వాలు చేసిన చట్టాలే కాగితాల మీద మిగిలిపోయాయి. ఈ చట్టాలపై కోర్టులో వివాదాలన్నీ పరిష్కారమయ్యాయి. సుప్రీంకోర్టు కూడా అంతిమ తీర్పునిచ్చింది. భూగరిష్ట పరిమితిని మించిన మిగులు భూములను స్వాధీనం చేసుకుని పంచేందుకు ఏ ఆటంకాలు లేవు. కావలసినది కృతనిశ్చయంతో కూడిన ఆచరణే. దీనికి బదులుగా భూమిసమస్యను సమగ్రంగా అధ్యయనం చేసి తగిన సూచనలిచ్చేందుకు మరొక కమిటీ నియామకం అంటే కాలహరణంతో సమస్యను మురగబెట్టడానికి పూనుకోవటమే.

ఈ సందర్భంగా మంత్రి చెప్పిన వివరాలను పరిశీలించినా చిత్తశుద్ధిలేదనీ, మాటల గారడీనే మిగిలిందనీ తేలుతుంది. నిరుపేదలకు పంపిణీ చేయగల భూమి నాలుగు లక్షల ఎకరాల వరకూ వుండవచ్చని చెప్పారు. అయితే ఎంత భూమిని పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందో చెప్పటానికి మంత్రి నిరాకరించారు. (వార్త 3.8.04) అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి 14.185 ఎకరాలుండగా, సీలింగులోని మిగులు భూమి 2.135 ఎకరాలు, భూదాన భూములు 8.875 ఎకరాలు, ఈనాం భూములు 73,941 ఎకరాలు వున్నాయని వివరించారు. ఇవన్నీ కలిపినా లక్ష ఎకరాలు దాటటంలేదు.

1992 చివరినాటికి ప్రభుత్వ అధీనంలోని భూములు 37.29 లక్షల ఎకరాలనీ, దీనిలో 19.13 లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ జరిగిందనీ ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. మిగిలిన 18.16 లక్షల ఎకరాలు ఏమైనట్లు? 14,185 ఎకరాలు మాత్రమే ఎలా అయింది?

ఇక మిగులు భూములు మరింత ప్రహసనమైంది. మొదటివిడత భూపరిమితి చట్టాల వల్ల 30 లక్షల ఎకరాలు మిగులు భూమి అని అంచనా వేశారు. ఏనుగులు దూరే కంతలున్న చట్టంలో చేతికి వచ్చిన మిగులుభూమి 7,400 ఎకరాలే. 1973 చట్టం తర్వాత 20 లక్షల మిగులు భూమిగా అంచనా వేయగా, వాస్తవంగా తేలింది 8 లక్షల ఎకరాలు. దీనిలో 5 లక్షల ఎకరాలు పంచామని చెప్పారు. మిగిలిన 3 లక్షల ఎకరాలు ఏమైనట్లు? 2,135 ఎకరాలెలాగైంది?

ఇలాగే భూదాన ఉద్యమ భూములు లక్ష ఎకరాలున్నాయని అధికారిక అంచనాయే. దీన్ని పంపకం చేసిన గణాంకాలు లేవు. కాని మంత్రిగారు వీటిని 8,875 ఎకరాలకు కుదించారు.

రాష్ట్రంలో అతిపెద్ద భూస్వామి దేవుడే. దేవుడిమాన్యంగా మూడు లక్షల ఎకరాలు వరకు ఉందని అంచనా. చట్టాల ప్రకారమే ఈ భూమిని పేదలకు కౌలుకివ్వాల్సి ఉంది. కాగా కౌలు పేరుతో భూస్వాములే అనుభవిస్తూ దేవుడి దీపారాధనకు కూడా గతిలేకుండా చేస్తున్నారు. ఈ వంకతో ఈ భూములను మార్కెట్టురేటుకు అమ్మివేయాలని గత ప్రభుత్వాలు ప్రయత్నాలు చేశాయి. కొన్ని భూములను అమ్మకానికి పెట్టాయి. ఆ పేరిట పేద కౌలుదారులను ఎండోమెంటు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వమే వీటిని కొని పేదలకు పంచవచ్చుగదా అని ప్రశ్నించగా మంత్రి సమాధానం చెప్పకుండా వూరుకున్నారు.

మొత్తంగా చూసినప్పుడు ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేవాలయ భూములు (3లక్షలు), బంజరు భూములు (18లక్షలు) చట్ట ప్రకారం మిగులు భూములు (3లక్షలు) కలిపి 24 లక్షల ఎకరాలు పంపకం చేయటానికి ఏ ఆటంకాలు లేకుండా వున్నది. అయినాసరే మంత్రిగారు మార్క్సిస్టులు కోరుతున్నట్లు భూమిపంపకం చేయాలంటే చట్టాలను సవరించాలనీ, కొన్ని విధానపర నిర్ణయాలు తీసుకోవాలనీ అంటున్నారు. ఇది సమస్యను దాటవేసేందుకు చేసే వాదనే తప్ప మరేమీ కాదు.

భూసంస్కరణ చట్టాలలోని లొసుగులను తొలగించి, చట్టాన్ని ఖచ్చితంగా అమలు జరిపితే, కనీసంగా మరో 50 లక్షల ఎకరాలు

(మిగతాది 22వ పేజీలో)

భూసంస్కరణలకు ఇది మా ఎజెండా

భూమి సమస్యపైన, భూమి పునర్‌పంపిణీపైన మేధావుల మధ్య, ఆలోచనాపరుల మధ్య, రాజకీయ పక్షాల్లోను మరోసారి పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి.

మన రాష్ట్రంలో 50లలోను, 60లలోను, 70లలోను, 80లలోను భూసమస్యపైన, భూస్వాముల దోపిడీ, దౌష్ట్యాలపైన పెద్దఎత్తున ఆందోళనలు, పోరాటాలు నడిచాయి. భూపరాయికరణకు వ్యతిరేకంగానూ ప్రభుత్వమే ప్రకటించిన 1/70 అమలు చేయటం కొరకు గిరిజనులు, ఆదివాసీలు పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు సాగిస్తున్న సంగతి మనందరకు తెలిసినదే.

గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యాన్ని తగ్గించాలన్నా, నిర్మూలించాలన్నా నిరుద్యోగాన్ని నివారించి, పేదరికాన్ని, అసమానతలను తగ్గించి, సర్వతోముఖాభివృద్ధిని సాధించాలంటే భూమి పంపిణీ అత్యంత ఆవశ్యకమైనది. దళిత, పేద, బలహీన, భూమి హీన వర్గాలకు భూమిని అందించి, దున్నుకొని ఫలసాయం అనుభవించటానికి అవకాశం కల్పించినప్పుడు మాత్రమే గ్రామీణ ప్రజలకు ఆదాయాలు-కొనుగోలు శక్తి లభిస్తాయి. గ్రామీణ ప్రజలకు లభించే ఆదాయాలు, కొనుగోలు శక్తియే పారిశ్రామికోత్పత్తులకు కావలసిన పెట్టుబడులను సమకూర్చగలుగుతాయి.

కనుక భూమి పంపిణీ కొరకు, దున్నేవానికి భూమిని అందించడం కొరకు ప్రభుత్వం తక్షణమే ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

భూసంస్కరణలు, భూమి పంపిణీల విషయమై 1987లో ఆనాటి ప్రధానమంత్రి, కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన శ్రీ రాజీవ్‌గాంధీ రాష్ట్రాల ముఖ్యమంత్రులందరకూ ఒకలేఖ వ్రాసి భూపంపిణీ ప్రాధాన్యతను వారి దృష్టికి తెచ్చిన విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో వుంచుకోవాలి.

1. లోపభూయిష్టంగా ఉన్నదైనప్పటికీ 1972 భూసంస్కరణల చట్టం ప్రకారం మిగులు భూములను నిగ్గుతేల్చి తక్షణం పంపిణీ ప్రారంభించాలి. (నోట్: ఈ చట్టం పరిధి నుండి తప్పుకొనుటకుగాను చేసిన ల్యాండ్ ట్రాన్స్‌ఫర్లు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చియున్నది.)
2. ప్రతీ వ్యావసయకూలీ, పేదరైతు, వృత్తి పనివాళ్ల కుటుంబం భూమిని పొందకలిగే విధంగా భూసంస్కరణలను అమలుపరచాలి.
3. రెవెన్యూ బంజరు భూములను, ఈనాం భూములను, శ్రోతీయం భూములను, భూదాన భూములను తేల్చి పేద సాగుదారులకు, భూమి హీన పేదలకు పంపకం చేయాలి.
4. పడావుగా పెట్టిన భూస్వాముల స్వంత భూఖండాలనే వాటన్నింటినీ ప్రభుత్వం వెంటనే నిరుపేద రైతులకు, పేద సాగుదారులకు, వ్యవసాయ కూలీలకు పంపకం చేయాలి.
5. దేవాలయాలు, ధర్మశాలల క్రింద ఉన్న భూములను నమోదు చేసి పేద సాగుదారులకు అందచేయాలి. పేద సాగుదారులను నమోదు చేసి నిర్ణీత కౌలు మాత్రమే వారి నుండి వసూలు చేయాలి.
6. 1/78 చట్టాన్ని అమలుపరుచుతూ, అసైన్‌మెంట్ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించాలి. పేదలకు మాత్రమే వాటిని సాగు కొరకు పంపకం చేయాలి.
7. బినామీ కౌల్దారీ పద్ధతిని, మూజువాణి కౌల్దారి పద్ధతిని అరికట్టి, కౌల్దారులను నమోదు చేసి రక్షిత కౌల్దారి చట్టాన్ని అమలు చేయాలి. అన్ని రకాల భూముల కౌల్దారులకు ఋణసౌకర్యం కల్పించాలి.
8. తీరప్రాంత వ్యవసాయోగ్యం కాని భూములను చిన్న, పేద సాగుదారులకు పంచి అక్వా, ఉప్పు సాగుకు అవకాశాలు కల్పించాలి. భద్రత చేకూర్చాలి.
9. వ్యవసాయ దిగుబడులకు, ఆహార పంటలకు ఉపయుక్తమైన భూములను వ్యవసాయేతర, వాణిజ్యపరమైన చెట్ల పెంపకానికి మరల్చకుండా నిరోధించాలి. ఆహారపంటల వ్యవస్థను కాపాడే చర్యలు చేపట్టాలి.
10. కౌల్దారులతో సహా రైతులందరకు పంటల భీమా పథకాన్ని వర్తింపచేయాలి. రైతును, వ్యవసాయదారుడ్ని ఒంటరొంటరిగా ఒక యూనిట్‌గా పరిగణించి, భీమా పథకాన్ని అమలు పరచాలి. తక్షణమే మండలాన్ని కాక గ్రామాన్ని యూనిట్‌గా పరిగణించాలి.
11. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 1/70 రెగ్యులేషన్‌ను అమలు పరచాలి. అన్యాక్రాంతమైన భూమి సుమారు 9 లక్షల ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ఆదివాసీలకు, గిరిజనులకు పంపకం చేయాలి.
12. షెడ్యూల్డ్ ఏరియాల్లో భూస్వాములు, పెత్తందార్ల చేతులలో ఉన్న ఎసైన్డ్ వేస్ట్ ల్యాండ్ క్రిందకు వచ్చే భూములన్నింటినీ ఆదివాసీలకు, ఆ ప్రాంత పేదలకు పంపకం చేయాలి.
13. గిరిజనులు, ఆదివాసీలు ఉత్పత్తి చేసే పంటలకు సేకరించిన

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు రేట్లు చెల్లించి జి.సి.సి. కొనుగోలు చేయాలి. ఉత్పత్తులకు కావలసిన అన్ని ఉపకరణాలను జి.సి.సి ద్వారా అందించాలి.

14. 40/96 చట్టాన్ని అమలు చేయాలి.
15. గిరిజనులను, ఆదివాసీలను అడవి నుండి దూరం చేసే అన్ని చర్యలను నిలిపివేయాలి. అడవిపైన, అటవీ ఉత్పత్తులపైన గిరిజన సమాజం యొక్క హక్కును గుర్తించాలి.
16. ఆదిలాబాద్ నుండి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న ఆదివాసీ, గిరిజన ప్రాంతాలను ఒకే పాలనా జోన్ క్రిందకు తీసుకొని రావాలి.
17. 1936 నాటి భూమి సర్వే ప్రకారం, 1951 జనాభా లెక్కల ప్రకారం 40 శాతం వరకు గిరిజనులు, ఆదివాసీలు నివసిస్తున్న గ్రామాలన్నింటినీ షెడ్యూల్డ్ ప్రాంతముగా ప్రకటించాలి. తక్షణమే షెడ్యూల్డ్ ఏరియా చట్టాలన్నింటినీ ఆ గ్రామాల్లో అమలుపరచాలి.
18. రైతులు పండించే పంటలకు, వ్యవసాయోత్పత్తులకు తగినంతగా మార్కెటింగ్ సదుపాయాలను, గిట్టుబాటు రేట్లను సమకూర్చటం ప్రభుత్వం తన బాధ్యతగా ఎంచి నిర్వహించాలి.
19. వ్యవసాయ భూములన్నింటికీ ముఖ్యంగా పేద, సన్నకారు రైతులు సాగుచేసే భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలి. అందుకు తగిన విధంగా సత్వరమే నీటిపారుదల ప్రాజెక్టు లన్నింటినీ పూర్తిచేయటానికి పథకాలు రూపొందించి అమలు చేయాలి.
20. గత నాలుగు సంవత్సరాలలో వరుసగా రెండు సంవత్సరాలపాటు కరువువాత పడిన అన్ని ప్రాంతాల్లో రైతుల రుణాలను, వృత్తి, చేతి పనివారలకు ఇచ్చిన అన్ని రకాల దుకాణాలను రద్దు చేయాలి. మిగిలిన ప్రాంతాల్లో రుణాలపై వడ్డీలను రద్దు చేయాలి.

ఎం. ఓంకార్,
ఎక్స్ ఎం.ఎల్.ఏ
కార్యదర్శి, రాష్ట్ర కమిటీ, ఎం.సి.పి.ఐ.

కె.కోటయ్య,
రాష్ట్ర నాయకులు, సి.పి.ఐ.(ఎం.ఎల్)

శ్రీధర్, కార్యదర్శి,
రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ,
ఎస్. యు.సి.ఐ.

భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఎక్స్ ఎం.పి.
రాష్ట్ర నాయకులు, ఎం.సి.పి.ఐ

గుర్రం విజయ్ కుమార్,
రాష్ట్ర నాయకులు, సి.పి.ఐ. (ఎం.ఎల్)

కొల్లివర వెంకటేశ్వరరావు,
కార్యదర్శి, ఎం.ఎల్.కమిటీ

(20వ పేజీ తరువాయి)

పంపకానికి అందుబాటులోకి వస్తాయి. ఈ దిశగా చర్యలు తీసుకునే బదులు, భూమి సమస్యను "సమగ్రంగా అధ్యయనం చేసి సూచనలు చేసేందుకు" మరో కమిటీని నియమించటమంటే సమస్యను తాత్సారం చేసి పరిష్కరించకుండా తప్పించుకుపోయే ఎత్తుగడే అవుతుంది.

భారతదేశంలో భూపరిమితి చట్టాల అమలును "అరకొర విధానం, అసమగ్ర శాసన నిర్మాణం, అసమర్థ అమలు"కు ఉదాహరణ. ఇతర దేశాలతో పోల్చితే, చైనాలో 43 శాతం, తైవాన్‌లో 37 శాతం, దక్షిణ కొరియాలో 32 శాతం, జపాన్‌లో 32 శాతం భూమి పునఃపంపకం జరగగా, భారత్‌లో పంపకం జరిగింది 1.25 శాతం మాత్రమే- ఈ మాటలు చెప్పింది రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్.

రాజకీయ సంకల్పం లోపించటం, శాసన నిర్మాణ ప్రక్రియలో విపరీతమైన సాచివేత ధోరణి, అయిష్టంగా, అసమర్థంగా జరిగిన అమలు, పాలనా యంత్రాంగంలో జీర్ణించుకున్న లోపాలు, విచక్షణ లోపించిన న్యాయస్థానాల జోక్యం- ఈ వైఫల్యానికి ప్రధాన కారణాలని కూడా ఆయన పేర్కొన్నారు.

ఈ ప్రధాన కారణాలన్నీ దోపిడీ వర్గాల అధీనంలోని రాజ్యపు వివిధ అంగాలకు చెందినవే. శాసనసభ, రాజకీయ నాయకత్వం, అమలు జరపవలసిన కార్యనిర్వాహక వర్గం, న్యాయస్థానాలూ-ఇవన్నీ దోపిడీ వర్గ రాజ్యంలో అంగాలే.

శంకర్‌గారు పేర్కొన్న మరో కారణం క్రింది నుండి వత్తిడి లేకపోవటం. అంటే ప్రజలు కదలి చట్టాన్ని అమలు చేయించుకునే కార్యాచరణలేదని అర్థం. భారతదేశంలో భూపరిమితి చట్టాల చరిత్రను గమనించిన వారందరికీ ప్రజలు ఉద్యమించి భూములను పంపకం చేసుకునే సమిష్టి కార్యచరణకు దిగిన సందర్భంలో మాత్రమే (తెలంగాణా, శ్రీకాకుళం పోరాటాలు) పాలకవర్గాలు ప్రజల కార్యాచరణను పాశవికంగా అణచివేసి, రక్తపుటేరులు పారించాయి. ఆ తర్వాతే తామే భూమి పంపకం సాగిస్తామంటూ ఈ అరకొర చట్టాలతో ప్రజలను మోసం చేశాయి. ప్రజా ఉద్యమం వెనుకపట్టు పట్టినప్పుడు చట్టాలను అమలు జరపకుండా అటకెక్కించాయి. ఈ మోసం తెలుసుకున్న ప్రజలు మళ్ళీ కార్యచరణ పూనుకున్నప్పుడు తిరిగి ఇదే విధానం అనుసరించారు. తాము చేసిన చట్టాలకు తామే సవరణలు చేసింది శంకర్‌గారి మాటల్లో చెప్పాలంటే "క్రింది నుండి ఈ వత్తిడి" వచ్చిన తర్వాతనే!

కనుకనే కా॥ టి.ఎన్. చెప్పినట్లు తమ వర్గ ప్రయోజనాల కొరకు దోపిడీ వర్గాలు విప్లవకరంగా భూసంస్కరణలను అమలు జరపవు. ప్రజల న్యాయమైన ఆగ్రహంపై నీళ్ళు జల్లేందుకే అరకొర చట్టాలను తెస్తాయి. ఈ సంస్కరణలపై భ్రమలు వదలుకొని, ప్రజలు సమిష్టి కార్యాచరణతో విప్లవకర భూసంస్కరణల అమలుకు పూనుకున్నప్పుడే భూస్వామ్య విధానం రద్దు అవుతుంది. అలాంటి రైతాంగపు విప్లవకర పోరాటానికి సకల మద్దతూ తెలపటం ప్రజాస్వామికవాదుల కర్తవ్యం. వాటికి నాయకత్వం మందిచటమే విప్లవకారుల ముందున్న కర్తవ్యం.

భూసంస్కరణలు, ప్రజాస్వామ్యం, అభివృద్ధి

-వై.వి. కృష్ణారావు
డైరెక్టర్, నీలం రాజశేఖరరెడ్డి పరిశోధనా కేంద్రం

భూ సంస్కరణలంటే భూస్వాముల నుంచి భూములు లాక్కొని భూమిలేని వారికి పంచిపెట్టడమే అనే పొరపాటు అభిప్రాయం చాలా మందిలో వుంది. ఇదెంత తప్పుడు అభిప్రాయమో మనదేశంలో చాలాకాలం అమెరికా రాయబారిగా పనిచేసిన గాల్‌బ్రియత్ చెప్పిన మాటలు వింటే అర్థమవుతుంది.

"నిజానికి భూసంస్కరణలు విప్లవాత్మకమైన చర్య.
ఆ చర్య చేపడితే అధికారం, ఆస్తి, హోదా అన్నీ
సమాజంలో ఒకవర్గం నుంచి మరో వర్గానికి
సంక్రమిస్తాయి ఏదేశంలోనైనా ప్రభుత్వాధికారం
భూస్వామ్యవర్గాల చేతుల్లో వుంటే, ఆ వర్గం తన
ప్రయోజనాలను కోల్పోయేపరిస్థితి ఏర్పడేపక్షంలో,
ఆదేశంలో భూసంస్కరణలు వారు దయదలిస్తే
వచ్చేవేమీ కావు.ప్రపంచంలో అనేక వర్గాల ప్రజలు
న్నారు. కాని ఈ భూస్వామ్య వర్గాలున్నాయే,
అవి చైనా, పెర్షియా, మిసిసిపి, క్విబెక్ ఏదేశమైనా
వెళ్లండి, వారంతా ఒకటే"

గ్రామాల్లో ఎవరిచేతుల్లో భూములున్నాయో, వారే గ్రామాల్లో రాజ్యమేలుతున్నారు; గ్రామస్థాయిలో అధికార అనధికార పెత్తనాన్ని చెలాయిస్తున్న పరిస్థితి నేడుంది. భూమి బదలాయింపు జరిగితే, ఆ అధికారం కూడా బదలాయించ బడుతుంది. అందువల్లనే భూమి చేతుల్లో వున్నవారు భూసంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ అధికారాన్ని నిలుపుకో టానికి ఎంత దూరం వెళ్లడానికైనా వెనుదీయటం లేదు. ఉదాహరణకు హిందు సమాజంలో భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రంగా భావించబడుతుంది. అలాంటి బంధాన్ని కూడా చట్టం దృష్టిలో తెంచుకోవడానికి వెనుదీయలేదు.

భూమిమీద గుత్తాధికారం ఏర్పడడం అంటే నీటి వనరుల మీద, ఇతర వ్యవసాయ సంబంధమైన ఆస్తుల మీద గుత్తాధిపత్యం కూడా ఏర్పడుతుంది. ఈ గుత్తాధిపత్యం గ్రామాభివృద్ధికీ, నిరుద్యోగం, పేదరికం, వెనుకబాటుతనం పోగొట్టడానికి ఆటంకంగా నిలుస్తుంది; ఆ అభివృద్ధిని నిరోధిస్తుంది.

గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకోవాలంటే, వర్ధిల్లాలంటే వ్యవసాయ సంస్కరణలు చేపట్టాలి. ఈ సంస్కరణకు కీలకం విప్లవకరమైన భూసంస్కరణలు. భూసంస్కరణలు భూమిని పంచటమేకాక, భూమితోపాటు ఆర్థిక అధికారాన్ని కూడా పంచుతుంది; ఆస్తులకు సంబంధించిన విషయాల్లో మార్పు తెస్తాయి; అలాగే వర్గ సంబంధాలను మార్చి గ్రామాల్లో అధికార వ్యవస్థనే మారుస్తాయి. పేదరికాన్ని తగ్గించటంలో భూసంస్కరణలు కీలకపాత్ర వహిస్తాయి. ప్రభుత్వ గణాంకాలను విశ్లేషించగా గమనించినదేమంటే భూమి యాజమాన్యంలో మార్పును భూసంస్కరణలు తీసుకొని వచ్చిన ప్రాంతాల్లో పేదరికాన్ని అదుపులో వుంచటం సాధ్యమైంది.

వ్యవసాయాభివృద్ధి, ఉత్పాదకత పెంపుదల, సామర్థ్యం పెరగాలంటే, ఆర్థిక సంస్కరణలు అవసరమని కొందరు అంటున్నారు. వ్యవసాయంలో ఉత్పత్తి శక్తులను విడుదల చేసి సమర్థవంతమైన వ్యవసాయోత్పత్తిని సాధించటమే ఇటు భూసంస్కరణలు, అటు సంస్కరణల లక్ష్యమని చెప్పటం జరుగుతుంది. కాని ఈ రెండింటి దారులే వేరు. భూసంస్కరణల లక్ష్యాలు వ్యవసాయాభివృద్ధి, సమానత్వం అయితే, ఆర్థిక సంస్కరణలు సమానత్వం గురించి మాట్లాడవు. రెండు. భూసంస్కరణలు ఇటు వ్యవసాయం, అటు పరిశ్రమలను అభివృద్ధి చేయటం, దేశంలోనే మార్కెట్ పెంపొందించటం, స్థానిక ఔత్సాహికులను ప్రోత్సహించడం, గ్రామీణ సమాజాన్ని ప్రజాస్వామీకరణ చేయటం భూసంస్కరణల లక్ష్యమైతే, ప్రస్తుత ఆర్థిక సంస్కరణలు ప్రపంచ ఔత్సాహికవేత్తలు, బహుళజాతి సంస్థల మీద ఆధారపడాలని, ఎగుమతుల ఆధారిత అభివృద్ధి సాధించాలని అంటుంది. ప్రశ్న ఏమంటే ఎటువంటి సామాజిక వ్యవస్థలో, ఎటువంటి వ్యవస్థాగత విధానంలో మార్కెట్లు ఎక్కువ సమర్థతతో పనిచేస్తాయి? ప్రస్తుత అసమాన వ్యవసాయ విధానంలో నేటి గ్రామీణ మార్కెట్ పరిస్థితుల్లో, ఆర్థిక సంస్కరణలు వ్యాపారస్తులు, బహుళజాతి సంస్థలు, మోతుబరి రైతులకే లాభం చేకూరుస్తాయి; చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలకు హాని కలిగిస్తాయి; భూమిలేని వారు మరింత నిస్సహాయులై, కాంట్రాక్టర్ల మీద, పెద్ద రైతుల మీద ఆధారపడేలా చేయటంతో దేశ ప్రజాస్వామిక వ్యవస్థలో పేదలు, సమానత్వంతో పాల్గొనే అవకాశం లేకుండా పోతుంది. (టి.హక్,)

కాగా సంస్కరణలను అమలు పరచటం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో డిమాండు పరిమితులను తొలగించటంలో వెనుకబడిపోయాయి. 1995 నుంచి ఆర్థిక పరిస్థితి మందగించిందంటే దానికి ప్రభుత్వ పెట్టుబడులు తగ్గటం, ఆహార ధాన్యాల ధర పెరగటం రెండూ కారణం. ఈ రెండూ కేంద్ర ప్రభుత్వ బాధ్యతలే. ఇటు ప్రభుత్వరంగంలో, అటు ప్రయివేటు రంగంలో పెట్టుబడులు తగ్గాయి, 1991 తర్వాత ప్రయివేటు పెట్టుబడులు పెరగనేలేదు. ప్రభుత్వ రంగంలో అయితే 1980వ దశకంలో కన్నా 1991 తర్వాత పెట్టుబడులు సగటున తగ్గాయి. ప్రభుత్వ పెట్టుబడులు పెరగటం వల్ల డిమాండు పెరుగుతుంది; లోకల్ ఉత్పత్తుల కొనుగోలు పెరుగుతుంది. సప్లయి మీద పరిమితులు కూడా తొలగి, మౌలిక సౌకర్యాలు బలీయం కావడానికి తోడ్పడుతుంది. మనం నేడు దేశంలో చూస్తున్నది మన ఆర్థిక పరిస్థితిని తగ్గుతున్న డిమాండు నులిమివేస్తూంది. ఈ పరిస్థితిని రెండవ విడత సంస్కరణలు ఎలా సంస్కరిస్తాయో ఊహకందటం లేదు.

అమెరికాలో ఆర్థిక పరిస్థితిలో మాంధ్యం ఏర్పడింది కాబట్టి మనదేశంలో కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందని అనటం సరికాదు; అమెరికా కన్నా మనదేశంలోనే ఆర్థిక మాంధ్యం ముందే ప్రారంభమైంది. అందుచేత అమెరికా ఆర్థిక పరిస్థితి పుంజుకొంటే మనస్థితి కూడా మెరుగుపడుతుందని అనుకోవటం భ్రమ, మనం పుంజుకోవాలంటే; దేశంలో డిమాండు పెరగాలి. దానికి భూసంస్కరణలు సహకరిస్తాయి. వ్యవసాయంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడడానికి కారణాలను నిపుణులు చాలాకాలం నుంచి ఎత్తి చూపుతూనే వచ్చారు. నీటిపారుదల సౌకర్యాల కొరత, భూసంస్కరణల నమలుపరచకపోవటం, తగుస్థాయిలో లేని మార్కెటింగ్ వ్యవస్థ, మౌలిక సౌకర్యాల కొరత, బడ్జెట్ కేటాయింపుల్లో కోత- ఇవన్నీ కారణాలే. ఈ నేపథ్యంలో భూసంస్కరణల అమలు, బంజరు భూములను సాగులోకి తీసుకొని రావటం, ప్రభుత్వ భూముల పంపకం జరగటం అత్యవసరం. ఎపుడో 10 సంవత్సరాల క్రితమే 1993 మానవాభివృద్ధి నివేదిక ప్రజానుకూల మార్కెట్లు ఏర్పడాలంటే, సమానమైన ఆస్తుల పంపకం, ముఖ్యంగా పేద వ్యవసాయ సమాజాల్లో భూమి పంపకం అవసరమని నొక్కి చెప్పింది. తూర్పు ఆసియాదేశాల్లో జిడిపి పెరుగుదల రేట్లు హెచ్చుగా వుండటానికి భూసంస్కరణ అమలుపరచడమే కారణమని ఆ నివేదిక నొక్కి చెప్పింది.

భూసంస్కరణలవేవి కేవలం రాజకీయ నినాదం మాత్రమే కాదు. భూమి పంపకం, గ్రామాల్లో సామాజిక సేవల మీద ఖర్చు, ఈ రెండూ వికేంద్రీకృత పరిపాలనా వ్యవస్థలో జరిగినపుడు దేశంలో మార్కెట్ పెరగటానికి, వ్యవసాయ ఉత్పత్తి పెరగడానికి, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుచేత భూసంస్కరణలు అమలుతో పాటు వ్యవసాయ రంగంలో, అంటే నీటిపారుదల, ఇతర గ్రామీణ మౌలిక సౌకర్యాల కల్పన కూడా జరిగితే, పారిశ్రామికాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది. ఎందుచేతనంటే, వ్యవసాయాధారిత సమాజంలో వ్యవసాయాభివృద్ధి రేట్లు పెరిగి, తలసరి ఆదాయం పెరిగినపుడు, ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, పరిశ్రమలు, సేవారంగం, ఆవిధంగా మొత్తం ఆర్థిక పరిస్థితే మెరుగుపడుతుంది; పేదరికం నుంచి ప్రజలు బయట పడతారు; వారు పారిశ్రామిక ఉత్పత్తులను కొనుగోలు చేయగలుగుతారు; మొత్తం ఆర్థిక పరిస్థితే ఉన్నత స్థాయికి చేరుతుంది.

భూసంస్కరణల చట్టాన్ని అమలు పరచటంలో పరిపాలనా యంత్రాంగం పాత్ర కూడా కీలక పాత్ర వహిస్తుంది. బుర్రాక్రట్ల వర్గ స్వభావం, సామాజిక నేపథ్యం కూడా భూసంస్కరణల అమలు ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాల, భూఖామందుల అనుకూల విధానాలు అందరికీ తెలిసిన విషయమే. బుర్రాక్రట్లు కూడా అత్యధికంగా ఉన్నత వర్గాల నుంచి వచ్చిన వారేనన్న విషయం కూడా గమనంలో వుంచుకొంటే, అలాగే గ్రామస్థాయిలో పరిపాలనా వ్యవస్థ కూడా గ్రామీణ "పెద్దల" కనుసన్నల్లో నడుస్తుందనే విషయాన్ని కూడా గుర్తుంచుకొంటే చట్టాన్ని అమలు పరచటంలో, అన్వయించటంలో భూమిలేని నిరుపేదలకు భూమి దక్కడం ఎంతకష్టతరమో వూహించు కోవచ్చు. అలాగే భూసంస్కరణల సంబంధమైన కేసులు కోర్టుల ముందుకు వచ్చినపుడు అదే ధోరణి వ్యక్తమైంది.

భూసంస్కరణల మీద ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ తన నివేదికలో "గ్రామాల్లో వున్న నేటి సామాజికార్థిక పరిస్థితుల్లో, రాజకీయ సంకల్పం లేనిదే భూసంస్కరణల అమలు ముందుకు సాగలేదు. నేటి రాజకీయ పరిస్థితిలో అటువంటిది సాధ్యం కాదు.... సివిల్, క్రిమినల్ చట్టాలు, న్యాయస్థానం తీర్పులు, గత చరిత్ర, పరిపాలనా సాంప్రదాయాలు వాటి అమలు, అన్నీ ప్రస్తుత సామాజిక వ్యవస్థ పక్షాన పనిచేస్తున్నాయి. ప్రయివేటు ఆస్తులు అతి పవిత్రమైనవి, వాటిని ముట్టుకోవడానికి వీలు లేదు. అలాంటి నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ పరిస్థితులను మార్చే అవకాశం సుమారుగా శూన్యం"

గత 45 సంవత్సరాల్లో మనదేశంలో భూసంస్కరణలు అమలు జరుగుతున్న తీరు తెన్నులపై అభిప్రాయానికి అర్థం పడతాయి స్వతంత్రానంతరం దేశంలో ప్రారంభించిన భూసంస్కరణలు అలా ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో కాదు, రైతాంగం ఫ్యూడల్ శక్తుల, బానిస

(మిగతాది 27వ పేజీలో)

బ్రెజిల్ ప్రజల భూపోరాటం

"భూమి మాకు ప్రాణం వంటిది. భూమి మా ఊపిరి. అది లేకపోతే మేం బ్రతకలేం. భూమి లేనిదే మాకు జీవితం లేదు. మా పిల్లల్ని పెంచుకోలేము. వారికి విద్యా బుద్ధులు నేర్పలేము. వారికి సరైన జీవితాన్ని ఇవ్వలేము. అందుకనే భూమికోసం మేము పోరాటం చేస్తున్నాము" ఇవి భూమికోసం పోరాటం చేస్తున్న స్త్రీలు మాతో అన్న మాటలు. మేం బ్రెజిల్ దేశంలో తిరిగిన అయిదు రోజులూ, కలిసిన ప్రతి వ్యక్తీ, మాట్లాడిన ప్రతి మనిషీ ఇంచుమించు ఇవే మాటలు అన్నారు. ఇదే ఉద్దేశం, అభిప్రాయం ప్రతిధ్వనిస్తూనే ఉండేది. బ్రెజిల్‌లో భూమి అపారంగా ఉన్నది. ఆ భూమికోసం ప్రజలు చేస్తున్న పోరాటమూ అంతే అపారంగా ఉన్నది. ఎన్ని అడ్డంకులనైనా అవధులనయినా అధిగమించి ముందుకు సాగిపోతూ ఉన్నది. ఈ భూపోరాటం మూడు దశల్లో మేము చూచాం.

ఒకటి: పోరాటంతో పూర్తి విజయం సాధించి, భూమిని ఆక్రమించుకొని, పంచుకొని సాగు చేసుకుంటూ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న దశ.

రెండు: ఇప్పుడే విజయం సాధించి భూమిని సాగుకు సిద్ధం చేసుకుంటూ ఇళ్ళు కట్టుకుంటూ ఉన్న దశ.

మూడు: విజయం పొందలేక భూమికి దూరంగా రోడ్డు వారన గుడిసెలలో కాపురం ఉంటూ పోరాటం కొనసాగిస్తున్న దశ.

భూమిలేని వారు భూమికోసం మొదటి నుంచీ పోరాటం చేస్తున్నారు. బ్రెజిల్ వలస పాలన నుంచి విముక్తి అయిననాటి నుంచీ భూమిలేని వారు ఏదో ఒక రూపంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ పోరాటాన్ని సమీకృతం చేయటానికి అనేక ఉద్యమాలు బయలు దేరాయి. అనేక సంస్థలు వచ్చాయి. వీటి ఆధ్వర్యంలో భూపోరాటం సాగుతూ ఉన్నది. ఈ ఉద్యమాల అనుభవాలను ప్రోది చేసుకొని ఒక కొత్త ఉద్యమరూపంలో ఆవిర్భవించిందే ఎం.ఎస్.టి. భూమిలేని వారి ఉద్యమంగా బయలుదేరి భూమిలేని గ్రామీణ కార్మికుల ఉద్యమంగా రూపొందింది. దీని ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలే ఈవేళ బ్రెజిల్ నిండా కనిపిస్తాయి. భూస్వాముల దగ్గర ఉన్న వేలాది ఎకరాల భూమితో పాటు మనదేశంలో మాదిరిగా ప్రభుత్వ భూమి కూడా కొన్ని లక్షల హెక్టార్లు ఉన్నాయి. ప్రభుత్వం కూడా తనవద్ద ఉన్న భూమిని భూమిలేని వారికి పంచి పెట్టటానికి సిద్ధంగా లేదు. ఎం.ఎస్.టి. అటు ప్రైవేటు వ్యక్తులపైన, ఇటు ప్రభుత్వంపైన భూమికోసం పోరు సాగిస్తూనే ఉన్నది. ఎక్కడ మీకు ఎక్కువ విజయాలు లభించాయని అడిగితే ప్రైవేటు వ్యక్తుల భూములలోనే మాకు ఎక్కువ విజయాలు లభించాయని పోరాట బాధ్యులు చెప్పారు.

ఎం.ఎస్.టి. వ్యూహం ఎలా పన్నిందంటే, వరసగా అయిదు సంవత్సరాల నుంచి సామాజిక వ్యవసాయం చేయని క్షేత్రాలను గుర్తించింది. చట్ట ప్రకారంగా ఆ భూమిని స్వాధీనం చేసుకోవాల్సిందిగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. మన దేశం లాగానే అక్కడ కూడా ప్రభుత్వం కదిలేది కాదు. ఎందుకంటే అక్కడ కూడా ప్రభుత్వం అగ్రవర్గాలదే. సంపన్నులదే. భూస్వాములదే. ఏ ప్రభుత్వం తనవర్గ ప్రజల భూమిని స్వాధీనం చేసుకొని పేద వర్గాలకు పంచి పెడుతుంది? బ్రెజిల్‌లో ప్రభుత్వం అగ్రవర్గాలదే. ఇండియాలో ప్రభుత్వం అగ్రవర్ణాలదే. అక్కడ భూమికోసం పోరాటం చేస్తున్నది పేద ప్రజలు. ఇక్కడ కూడా భూమికోసం పోరాటం చేస్తున్నది పేద ప్రజలే. అయితే ఈ పేద ప్రజలలో ఎక్కువ శాతం అంటరాని కులాల వారు, మరీ వెనకబడిన కులాల వారు. అంతే తేడా. బ్రెజిల్ ప్రజలలో కులాలు లేవు. కాని, పేదరికం వారి మధ్య తేడాను కనబడేటట్టు చేసింది. వాడిపోయిన, రంగు తగ్గిన, మొరటు బారిన ముఖం చూసినా మొద్దుబారిన లేదా కాయలు కాచిన చేతులు చూసినా తేడా మనకు తెలిసిపోతుంది.

1985లో భూపోరాటం ప్రారంభమైంది. బ్రెజిల్‌లోని 32 పట్టణాల నుంచి భూమిలేని కుటుంబాలు మేము వెళ్ళిన ఫజీనంనోని గ్రామం చేరాయి. ఆ గ్రామంలో ఉన్న 9000 హెక్టార్ల భూస్వామి ఆ గ్రామంలో ఉండేవాడు కాదు. వ్యవసాయమూ సాగటం లేదు. ఒకరోజు రాత్రికి రాత్రి మొత్తం కుటుంబాలను ఎం.ఎస్.టి. అక్కడకు చేరవేసింది. ఒక మట్టి రోడ్డు పక్కన ఉండిపోయారు. ఉదయం లేచి పలుగూ, పార తీసుకొని స్త్రీ పురుషులు భూమిపైకి వెళ్ళారు. వారి పార మన పారలానే ఉన్నది. అయితే పట్టుకొనే కాడ మాత్రం పొడుగ్గా ఉంటుంది. నిలబడి భూమిని చెక్కవచ్చు. చిన్నచిన్న పొదలను నరుక్కుంటూ శుభ్రం చేస్తున్నారు. భూస్వామి కావలి వాళ్ళకు తెలిసింది. ఏమీ చేయలేకపోయారు. భూస్వామికి కబురు వెళ్ళేసరికి కొంత భూమిని శుభ్రం చేయగలిగారు. నాటు తుపాకులు తీసుకొని ఒక జీపులో భూస్వామి మనుషులు వచ్చి అడ్డుకున్నారు. ప్రజలదగ్గర పలుగు, పార, కట్టెలు, జెండా కర్రలు ఉన్నాయి, ఇద్దరి దగ్గర మాత్రమే తుపాకులు ఉన్నాయి. తుపాకీ పేలగానే ప్రజలు పారిపోతారని ఊహించారు భూస్వామి మనుషులు. తూటా దెబ్బలు తింటూ జనం వారిద్దరిని చుట్టుముట్టి, కొట్టి, తుపాకీలు గుంజుకున్నారు. వారిద్దరూ కాళ్ళకి బుద్ధి చెప్పారు. వారితోపాటు మిగిలిన వారునూ. మొదట

లభించిన విజయంతో ప్రజలు భూమిని ముద్దాడి శుభ్రం చేసుకొంటూ వెళ్ళారు. అక్కడే ప్రజలు ఉండిపోయారు. భూస్వామి పోలీసులను తీసుకొని రావటానికి మూడు నాలుగు రోజులు పట్టింది. పోలీసులు వచ్చి బలవంతంగా అందర్నీ భూమి నుంచి బయటకు పంపించారు. వేరే కొన్ని గ్రామాల నుంచి రాత్రికి రాత్రి ఎం.ఎస్.టి. జనాన్ని చేరవేసే వారు. కొన్నిసార్లు పోలీసులు వారిని దారిలోనే ఆపివేసేవారు. పోలీసులు వచ్చి వెళ్ళగొట్టేవారు. నాయకుల్ని అరెస్టు చేసేవారు. పిల్లల్ని, స్త్రీలను ముందు భూమిపైకి పంపేవారు. వారిని పోలీసులు అరెస్టు చేసేవారు కాదు. పోలీసులు వెళ్ళగానే మళ్ళీ ప్రజలు భూమిపైకి వెళ్ళటం, మళ్ళీ పోలీసులు రావటం, లాఠీలు ప్రయోగించటం జరిగేది. మనకథ లాంటిదే. భూమినుంచి వెళ్ళగొట్టటం, ప్రజలు భూమిపైకి వెళ్ళటం. అక్కడే రోడ్ వార చిన్న గుడిసెలు వేసుకొని ప్రజలు కాపురాలు మొదలు పెట్టారు.

ఇలా కొంతకాలం జరిగిన తర్వాత ఆ రాష్ట్ర రాజధాని అయిన పోర్టో అలెగ్రేకి ప్రజలు పాదయాత్ర తలపెట్టారు. ఆ ఊరికి పోర్టో అలెగ్రే 300 కి.మీ. దూరంలో ఉంది. దారి అంతా ఎత్తయిన కొండలు, లోయలు. ఆ గ్రామానికి వచ్చిన కుటుంబాలు అన్నీ కలిపి 300 మంది ఉన్నారు. అందులో స్త్రీలు, పురుషులూ పిల్లాపాపా. ఎం.ఎస్.టి. కార్యకర్తలు నాయకత్వం వహించారు. యాత్ర 1986లో మొదలయింది. గ్రామ గ్రామాన్ని తట్టుకుంటూ తమ అభ్యర్థన చెప్పుకుంటూ పాదయాత్ర సాగించారు. రాత్రి సమయంలో ఏదో ఒక గ్రామంలో ఆగిపోయే వారు. ఆ గ్రామంలో ఉన్న చర్చిలోనో, పాఠశాలలోనో తలదాచుకునే వారు. ఆ గ్రామ ప్రజలు వీరిని ఆహ్వానించేవారు. ఎం.ఎస్.టి. ఇతర గ్రామాల సహాయం తీసుకొని వీరికి భోజన సదుపాయం కల్పించేది. ఎం.ఎస్.టి కి దొరికిన గొప్ప అవకాశం ఏమంటే వారు చేస్తున్న పోరాటానికి చర్చి అండగా నిలబడింది. ఆశ్రయం ఇవ్వటమే కాకుండా ఆర్థిక సహాయం కూడా చేసింది. లాటిన్ అమెరికా దేశాలలో బయలుదేరిన 'లిబరేషన్ థియాలజీ' (మతం అనేది ఏదో మోక్షాన్ని ప్రసాదించటానికి కాదు, పరలోకంలో సుఖ సంపదలు కలుగచేయటానికీ కాదు. ఈ లోకంలో ఇక్కడ ప్రజలను ఆకలి నుంచి, అణచివేత నుంచి విముక్తం చేయాలనేది క్రైస్తవ మత బోధకులు తీసుకొచ్చిన సిద్ధాంతం) ఈ భూపోరాటానికి ఎంతో సహాయపడింది. ఈ మధ్యలో అక్కడక్కడా చిన్నచిన్న పోరాటాలు జరిగి విజయం పొందిన గ్రామాలు తగిలాయి. అక్కడ వారికి కొండంత అండ ఎలానూ దొరుకుతుంది. ఈ విధంగా గ్రామగ్రామం తిరుగుతూ ప్రజల సహకారాన్ని, సహాయాన్ని, మద్దతును పొందుతూ మొత్తం 300 కి.మి. రెండు నెలలపాటు నడిచి పోర్టో అలెగ్రే చేరారు. 300 మందితో మొదలయిన పాదయాత్ర ముగిసేసరికి 40,000 మందికి చేరింది. అక్కడ మన మాదిరిగానే ప్రభుత్వానికి విజ్ఞప్తి సమర్పించటం, వారు హామీ ఇవ్వటం జరిగింది. అయితే భూమి దొరకలేదు. తిరిగి గ్రామం చేరి పోరాటం సాగించారు. ఒక పక్క భూమిపైకి వెళ్ళి ఆక్రమించుకోవటానికి ప్రయత్నం, భూమి దున్నే సన్నాహాలు, పోలీసులు బయటకు వెళ్లగొట్టటాలు, ప్రజలు అక్కడే తిష్ఠ వేయటాలు, వెసులుబాటు దొరికితే ప్రక్క గ్రామాలకు వెళ్ళి ప్రచారాలు చేయటం. ఈ విధంగా వారి ఉద్యమం సాగింది. రెండు, మూడు సంవత్సరాల పోరాట ఫలితంగా ఆ ప్రజలు భూమిని సాధించుకోగలిగారు. మొదట వారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఉండటానికి అంగీకరించారు. పోరాట క్రమంలో స్త్రీలు, పురుషులు ఎన్నో దెబ్బలు తిన్నారు. ముగ్గురు, నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పటికే ఆ భూమిని ప్రభుత్వం జప్తు చేసింది. దానిపై యజమాని కోర్టుకు వెళ్ళాడు. కోర్టుకేసు కొంతకాలం నడిచింది. భూమిని స్వాధీనం చేసుకోవటం సమ్మతమే, చట్టబద్ధమే అని కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం చివరకు రెండు క్షేత్రాలను స్వాధీనం చేసుకొని వీరికి అప్పగించింది. మరో రెండు సంవత్సరాలు పోరాటం చేసి, మొత్తం 9000 హెక్టార్ల భూమిని ప్రజలు సంపాదించుకున్నారు. ఒక్కొక్క కుటుంబానికి 25 హెక్టార్ల చొప్పున పంచుకొని 300కు పైగా కుటుంబాలు ఆ భూమిమీద జీవనం ప్రారంభించాయి. ఒక్క సెంటు భూమి కూడా లేని కుటుంబాలు ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఒక్కో కుటుంబానికి 25 హెక్టార్ల భూమిని పంచుకొని, పెద్దపెద్ద విశాలమైన భాగంలో అందమైన ఇళ్ళు నిర్మించుకొని అన్ని హంగులూ సంపాదించుకొని, అక్కడ జీవనం సాగిస్తున్నారు. పిల్లలకు చదువు చెప్పించుకున్నారు. పట్టణాలకు పై చదువుల కోసం పంపించారు. కొందరు బయట ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అక్కడ ఉన్నవాళ్ళు స్వయంగా భూమి దున్నుకొంటూ బ్రతుకు ఆనందంగా గడుపుతున్నారు. అది మొట్టమొదటి విజయమేమో కొన్ని ఒడిదుడుకులు వచ్చాయి. నష్టాలు జరిగాయి. వాటిని ఎం.ఎస్.టి. సహకారంతో సర్దుకొని, దిద్దుకొని భూపోరాటానికి ఒక ఆదర్శంగా నిలబడ్డారు. వారికి 20 ఏళ్ళ క్రితం ఒక సెంటు భూమి లేదు. నిలవ నీడ లేదు, ఇప్పుడు ఒక్కొక్కరికి 25 హెక్టార్ల వ్యవసాయ భూమి అంటే దాదాపు 60 ఎకరాల సాగుభూమి దొరికింది. అది బీడుభూమి కాదు. అక్కడ 60 ఎకరాలంటే ఒక కుటుంబానికి సరిపోతాయని వాళ్ళ లెక్క. అది వారి జీవన ప్రమాణం. మనకు ఒక్క ఎకరం చాలు అంటున్నాం. హాయిగా బ్రతికే ఆశ మాకు లేదు. కనీసం తిండి తినగలుగుతాం అంటున్నాం. అదీ దొరికే దారి కనపడటం లేదు. అక్కడ 60 ఎకరాలు ఒక్కొక్క కుటుంబానికి ఇచ్చుకుంటే మన ప్రభుత్వం ఒక్కొక్కరికి మాగాణి 2 ఎకరాలు, మెట్ట అయితే 5 ఎకరాల వరకూ ఇవ్వవచ్చు అంటున్నది. కాని ఇవ్వటం లేదు. బ్రెజిల్‌లో ప్రజలు పోరాటం చేసి ఒక్కొక్కరు 60 ఎకరాలు పంచుకున్నారు.

పంచుకుంటున్నారు. ఇతర చోట్ల పంపిణీ కోసం పోరాటం సాగిస్తున్నారు.

ఎం.ఎస్.టి తన పోరాటం ప్రారంభించిననాటి నుంచి ఈనాటి వరకు 3,50,000 కుటుంబాలకు భూమిని పంచి వారు స్థిరనివాసం ఏర్పాటు చేసుకొనేలా చేయగలిగింది. 1,00,000 కుటుంబాలను ప్రస్తుతం 500 క్యాంపుల్లో సర్ది ఉంచారు భూమికోసం వారు ఎదురు చూస్తూ ఉన్నారు.

బ్రెజిల్ మొదటి విజయం పర్రన రాష్ట్రంలో జరిగింది 3000 కుటుంబాలకు మొత్తం 12,000 మంది భూమికోసం పోరాట యాత్ర చేసి 83,000 హెక్టార్ల భూమిని సాధించుకున్నారు.

మొత్తం 9000 హెక్టార్ల భూమిని ఒక్కొక్క కుటుంబానికి 25 హెక్టార్లచొప్పున లాటరీ పద్ధతి మీద పంపకం జరిగింది. ఎం.ఎస్.టి. భూమిపై యాజమాన్యాన్ని అంగీకరించలేదు. వంశపార పర్యంగా భూమి అనుభవించటానికి మాత్రమే వీలు కల్పించారు. ఒక కాంట్రాక్టు పద్ధతి లాగ. తానూ తన తర్వాత తన పిల్లలు సాగుచేసుకోవాల్సిందే. భూమి అక్కర లేదు అనుకున్నప్పుడు ఎం.ఎస్.టి.కి అప్పగించి వెళ్ళిపోవాలి. భార్యాభర్తలు విడాకులు తీసుకుంటే భూమిని చెరిసగం పంచుకుంటారు. ఇవి చాలా తక్కువగానే జరుగుతున్నాయంటారు. ఇల్లుమాత్రం భార్యకే ఉండిపోతుంది. కొడుకులకు ఏ హక్కులయితే ఉంటాయో కూతుళ్ళకూ అవే హక్కులు ఉంటాయి. పోరాటంలో స్త్రీ విడిగా పాల్గొంటే ఆమెకు ప్రత్యేకంగా దొరుకుతుంది. భూమిపై యాజమాన్యం ఉండకూడదనే సిద్ధాంతాన్ని ఎం.ఎస్.టి. మొదటి నుంచీ ప్రచారం చేస్తున్నది. దానిని అందరూ అంగీకరిస్తున్నారు.

భూపోరాటం మొదలయిన రోజుల్లో బ్రెజిల్ దేశంలోని ఆదివాసులు సభ్యులుగా ఉండేవారు. ఆ తర్వాత భూమిలేని పేదవారు, కార్మికులు, మురికి వాడల్లో నివసించే వారు, వలస వచ్చిన వారు క్రమంగా చేరారు. ఆదివాసుల పునరావాసం, భూమి, ఉపాధి ప్రభుత్వం బాధ్యత తీసుకున్నది కాబట్టి, భూమిలేని ఇతర పేదల సంగతి మేము చేపట్టాం అంటుంది ఎం.ఎస్.టి.

72 కుటుంబాలతో మొదలయిన ఆ గ్రామంలో ఇప్పుడు 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. పక్కా ఇళ్ళు కట్టుకొని, అన్ని సదుపాయాలు అమర్చుకున్న గ్రామాలను 'సెటిల్‌మెంట్' అంటున్నారు. భూమి దొరకక, నివాసం కుదరక రోడ్డువారన ప్లాస్టిక్ గుడారాలు వేసుకొని ఉంటున్న ప్రాంతాన్ని 'క్యాంప్' అంటున్నారు.

ఇంతవరకూ 23 రాష్ట్రాలలో వ్యాపించిన ఈ ఉద్యమంలో దాదాపు 15 లక్షల మంది ప్రజలు పోరాటంలో పాల్గొన్నారు. 3000 కుటుంబాలకు పైగా స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. 1,60,000 పిల్లలు పాఠశాలలకు వెళుతున్నారు. ఈ ఉద్యమంలో నుంచి వచ్చిన వారి పిల్లలు విశ్వవిద్యాలయాల స్థాయికి ఎదిగారు.

(ప్రముఖ దళిత నాయకుడు, అడ్వకేట్
బొజ్జా తారకం రాసిన పుస్తకం నుంచి)

(24వ పేజీ తరువాయి)

ప్రభువులకు వ్యతిరేకంగా జరిపిన భీకరపోరాటంలో అంతర్భాగం. స్వతంత్రం వచ్చిన నాటినుంచీ గ్రామీణ పునర్నిర్మాణానికి భూసంస్కరణలు అమలు జరపాలని జాతీయ ఎజెండాగా వుంటూ వచ్చింది. అయితే, పాలకులవర్గ స్వభావం, భూమిలేని, భుక్తి లేనివారు పాల్గొని నడిపిన ఉద్యమాల తీరు మీద భూసంస్కరణలు ఆధారపడి వున్నాయని చరిత్ర నిరూపించింది.

ప్రభుత్వం అనేక పథకాలను అమలు పరచి, గ్రామాల్లో పరిస్థితులను మార్చటానికి ప్రయత్నిస్తుంది. దారిద్ర నిర్మూలన పథకాలు, ఉపాధి కల్పనా కార్యక్రమాలు కొన్ని వేలకోట్ల రూపాయల ఖర్చు చేసి అమలు పరచినా, గ్రామీణ పేదల జీవితాల్లో గమనించ దగిన మార్పు లేకపోగా, అలా చేసిన ఖర్చులో పెద్ద మొత్తం రాజకీయ నాయకుల, బుర్రాకట్ల జేబుల్లోకి పోయాయి. అసమానతలు కొనసాగటమే కాక మరింతగా పెరుగుతున్నాయి. గ్రామాభివృద్ధి కాగితాలమీదే వుండిపోయింది. దీనికి భూసంస్కరణల నమలు పరచలేకపోవటమే కారణం. ఈ విషయాన్ని ప్రణాళికాసంఘం గుర్తించింది కూడా. ఉదాహరణకు ఏడవ ప్రణాళికా పత్రంలో "భూసంస్కరణలు అమలు పరచటం వల్ల పెద్ద సంఖ్యలో వున్న గ్రామీణ పేదలకు ఆస్తి ఏర్పడి, భూసంబంధమైన ఉత్పత్తి కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఏర్పడుతుంది. అతనికి లభించిన భూమి ఎంత చిన్నదైనా, అతనికో భద్రత ఏర్పడుతుంది" కాబట్టి అభివృద్ధి, పేదరికం తగ్గింపు, ఉపాధి, భూసంస్కరణలు-వీటన్నిటితో కూడిన సమగ్ర పథకం అమలు పరచాలి.

పై విశ్లేషణ తెలియచేసేదేమంటే విప్లవాత్మక భూసంస్కరణలు అమలు జరిగినవుడే గ్రామీణ ప్రాంతాల్లో అసమానతలు తొలగుతాయి; పేదలకు భద్రత ఏర్పడుతుంది. ఉత్పత్తి పెరుగుతుంది; భూమిలేని వారికి భూమితోపాటు ఉపాధి లభిస్తుంది. అభివృద్ధి సాధ్యమవుతుంది. పరిశ్రమల ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడుతుంది. గ్రామీణుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. నవభారత నిర్మాణానికి బాట సుగమమవుతుంది. ఈ లక్ష్యసాధనకే గత అర్థశతాబ్ద పొడవునా ప్రజా ఉద్యమాలు కొనసాగాయి. అనేకమంది అసువులు బాసారు; అయినా భూసంస్కరణలు అమలు జరపాలని ఉద్యమాలు కొనసాగుతున్నాయంటే, ఈ విప్లవం ఇంకా పూర్తికాలేదని విదితమవుతుంది.

వైవి కృష్ణారావు భూమి సమస్యలమీద రచించిన అనేక వ్యాసాలనుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వ్యాస రచన జరిగింది- వి. హనుమంతరావు)

అంటరాని వారికి భూములతో పనేంటి?

ప్రొ.కె.యస్.చలం
ఆంధ్రా యూనివర్శిటీ

ఇటీవల ఒక వ్యాసంలో ప్రొ॥ఆర్.ఎస్.రావు గారు పశ్చిమ బెంగాల్ భద్రలోక్ మేధావి వర్గానికి మిగతా రాష్ట్రాల విషయాలు ఎంతవరకు తెలుసు? అన్న ప్రశ్న వేశారు. అసలు పశ్చిమ బెంగాల్‌లోని భద్రలోక్ చేతుల్లో వుండే భూమి ఎవరు సాగుచేసేవారు? పశ్చిమ బెంగాల్‌లో వుండే భూకామందులంతా కలకత్తాలోనే నివాసం. ఈ నాటికి జిల్లా కలెక్టర్లతో బాటు రాష్ట్రంలోని నాలుగువంతులమంది కలకత్తాలోనే వుంటారు. భూమి సాగుచేసుకునేది దళితులు, ఆదివాసీలు మిగతా కాయకష్టం చేసుకొనే జనం. అందుకే ఆ రాష్ట్రంలోని సిలిగురిజిల్లాలో సుమారు 40 శాతం వుండే దళితులు నక్సల్బరీ ఉద్యమానికి కారకులయ్యారు. బహుశా ఈ విషయాన్ని చెబుతున్నందుకు నన్నెవరూ నిందించవద్దు. ఇంతకు మునుపెవ్వరూ ఈ విషయం చెప్పకుంటే అది నా తప్పు కాదు. ఇది ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే మూలవాసులైన దళిత, ఆదివాసీల భూమిని ఎవరు ఎలా కాజేసినా అది ప్రాచీన చరిత్ర. ఆధునిక కాలంలో బ్రిటీష్ వారు వచ్చి పెర్మనెంట్ సెటిల్‌మెంట్ ద్వారా యూరప్‌లోని భూస్వామ్య విధానాన్ని ఇక్కడ ప్రవేశపెట్టినపుడు బహుశా వారు ఒడిదుడుకులకు లోనయివుంటారు. లేకుంటే అంటరాని వారికోసం అన్ని చట్టాలు చేసిన బ్రిటీష్ వారు ఈ జాతులకు భూమి ఇవ్వాలని కోరుకో లేదా? ఒకవేళ ఆ ప్రయత్నం చేసినా ఈ స్వదేశీ దేశ భక్తులు దాన్ని జరగనీయ లేదా? ఆర్థిక చరిత్ర కారులెందుకు ఈ విషయంపై పరిశోధనలు చేయలేదు?

ఇక అసలు విషయానికి వద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో గాని, దేశంలో గాని దళితుల భూదాహం గూర్చి మాట్లాడుకునేటప్పుడు చరిత్ర గూర్చి తెలుసుకోవటం అవసరం. మద్రాసు రాష్ట్రంలో సుమారు 110 సంవత్సరాల క్రితం దళితులకోసం బ్రిటీష్ వారు రూపొందించిన "పంచమి భూమి" ల విషయంలో చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు గూర్చి ఇక్కడ చెప్పుకోవటం అవసరం. 1892 సెప్టెంబర్‌లో రెవెన్యూ డిపార్ట్‌మెంటు తెచ్చిన 60 పేజీల ప్రభుత్వ ఉత్తర్వు 1010 ప్రకారం అంటరాని వారికి మద్రాసు ప్రెసిడెన్సీలో ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగుచేసుకునేందుకు గత వంద సంవత్సరాలుగా దళితులు పోరాడుతూనే వున్నారు. 1991వ సంవత్సరంలో మద్రాసు హైకోర్టు ఈ భూముల విషయంలో దళితుల భూమి అన్యాక్రాంతం కారాదని, అవి వారికే చెందాలని తీర్పు ఇచ్చింది. అంటే సరిగ్గా ఒక శతాబ్దం పోరాటం చేశాక దళితుల భూమి సాగుచేసుకోవచ్చని తీర్పు వచ్చింది. గాని ఆ భూమి వారి చేతుల్లోకి ఇంకా రాలేదు. ఇంతకంటే ఘోరమైన విషయం పంజాబ్‌లో జరిగింది. 1947న స్వాతంత్ర్యం వచ్చేంతవరకు దళితులు ఎటువంటి భూమిని కలిగి వుండడానికి వీలులేదు. ఆయా జమిందారులలో ఇటువంటి ఆంక్షలు వున్నాయి. దేశంలో వ్యవసాయ రంగంలో అత్యంత ఎక్కువ ఉత్పత్తి, ఉత్పాదకత వ్యవసాయంలో కలిగి వున్న పంజాబ్‌లో ఇదీ పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే దళితులు భూమికి ఎంత దూరంలో అంటరాని వారుగా ఉంచబడ్డారో అర్థమవుతుంది. విచిత్రమేమంటే భూమిని సొంతంగా పొందడానికి హక్కు లేకపోయినా, ఆ భూమిని సాగుచేస్తూ వస్తున్నది మాత్రం దళితులే. భూమి మీద ఆధారపడి జీవించే దళితుల సంఖ్య, నిష్పత్తి ప్రతిఏటా పెరుగుతూనే వున్నది.

మరి స్వాతంత్ర్యం వచ్చాక తెచ్చిన కౌలుదారి చట్టం ఎంచక్కా అమలయింది. ఎందుకు? ఎలా? బహుశా స్వాతంత్ర్యానంతరం వచ్చిన చట్టాల్లో చడిచప్పుడు కాకుండా రక్తరహిత విప్లవంగా అమలు జరిగిన చట్టం ఇదొక్కటే. దీని ద్వారా బాగుపడిన వాళ్లంతా శూద్రులు, దళితేతరులేనన్నది మనందరికీ తెలిసిందే కదా! మరి భూసంస్కరణలు ఎవరి కోసం? దీని ద్వారా అంటరాని వారికి వచ్చే మేలు ఎంత? దళితులు వ్యవసాయ కూలీలే కాదు సుమారు 15 వృత్తుల్లో ఆరి తేరిన వారు. ఆధునిక పరిశ్రమలు, నూతన ఆర్థిక విధానాలు వచ్చాక వీళ్లంతా మళ్లీ భూమిమీద ఆధారపడే వ్యవసాయ కార్మికులుగానే మారిపోయారు. అందుకే దేశంలో గాని, రాష్ట్రంలోగాని, భూసమస్య గూర్చి చర్చించినపుడు దళితుల పరిస్థితి విని ప్రత్యేకంగా చూడాలని ఆర్థికశాస్త్ర పరిశోధకులు చాలామంది సామాజిక అంశాలలో చాలా వెనుకబడిన వారుగాని, అది అవసరమని భావించేవాళ్లు తక్కువ. అందుచేతనే భూబదలాయింపుల్లో ఇప్పుడు జరుగుతున్న వింతలు బహిరంగ పడటం లేదు.

ఆంధ్రరాష్ట్రంలో జరిగిన ఇటీవలి "రైతుల" ఆత్మహత్యలను పరిశీలించి చూస్తే కొన్ని ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. 2004 జూలై నెలలో జరిగిన ఆత్మహత్యల వివరాలను ఈనాడు వార్త పత్రిక నుండి సేకరించగా, అందులో 75 శాతంమంది దళితులు, వెనుక బడిన కులాలవారే వున్నారు. ఇది ఎందుకు జరిగింది? వ్యవసాయ రంగం జాతీయాదాయంలో గాని, రాష్ట్ర ఆదాయంలో గాని

(మిగతాది 40వ పేజీలో)

దళితులకు హోదా, గౌరవం, ధైర్యం ఇచ్చేది భూమి

-బొజ్జా తారకం

భూమికి దళితులకు చాల దగ్గర సంబంధం ఉన్నది. సంబంధం అయితే దగ్గిర అనే అంటున్నాము కాని భూమికి దళితులకు మధ్య దూరం మాత్రం చాలా ఉన్నది. అందరానంత దూరం. భూమిలేకపోవటమే వారిద్దరి మధ్య సంబంధం అని చెప్పినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఆశ్చర్యపోయే విషయం ఏమంటే అదే భూమిపైన దళితుని అడుగులు ఉంటాయి, నడిచిన ఆనవాళ్లుంటాయి, దున్నిన నాగేటి చాళ్లు ఉంటాయి. దళితుడు వేసిన విత్తనాలు మొలకలెత్తుతాయి, మొలకలు పెరిగి పండిన పంట కనబడుతుంది. పంటను కోసిన పనలు ఉంటాయి. కట్టలు కట్టి ధాన్యం ఎత్తుకొని వెళ్తుంటే దారంటా రాలిపడి గింజలు కనబడతాయి. కోతకోయగా అక్కడక్కడ మిగిలిపోయిన పరగలు అదే భూమి మీద కనబడతాయి. అయినా అతనికి ఆ భూమి మీద ఏ సంబంధమూ ఉండదు. ఆ భూమిపైన గాని, ఆ భూమిపైన పండిన పంటపైన గాని, ఏపాటి హక్కు కూడా ఉండదు. చివరకు మిగిలిన పరగలు గాని, రాలిపోయిన గింజలు గాని ఏరుకునే హక్కు అతనికి లేదు. అదే దళితునికి భూమికి ఉన్న సంబంధం.

భూమిలేని దళితులు ఉన్నారు కాని దళితులు లేని భూమి లేదు. ఇదే మాటను జాషువా అద్భుతంగా చెపుతాడు. అతని చెమట బొట్టుపడకపోతే " సశ్యరమ పండి పులకింప సంశయించు" అని. అంటే దళితుని చెమట రాలకపోతే భూమి పంట పండటానికే సంశయిస్తుంది అని. 'ప్రపంచానికి అన్నం పెడతాడు గాని అతను తిన్నది ఎరుగను' అంటాడు జాషువా. అదీ దళితునికి భూమికి ఉన్న సంబంధం. ఇదే సందర్భంలో కామ్రేడ్ మావో మాటలు గుర్తుకు వస్తాయి. చైనా గురించి చెప్పతూ ఆయన ఇలా అంటాడు.

"చైనా సమస్యలు అంటే గ్రామీణ సమస్యలు, గ్రామీణ సమస్యలు అంటే భూమి సమస్యలు' అని. దీనిని మన భారత దేశానికి అన్వయించుకుంటే సరిపోతుంది, అయితే ఒక అడుగు ముందుకు వేయాలి. అంతే! "భారతదేశ సమస్యలు అంటే గ్రామీణ సమస్యలు, గ్రామీణ సమస్యలు అంటే భూమి సమస్యలు, భూమి సమస్యలు అంటే దళితుల సమస్యలు" ఇదీ దళితులకు భూమికి ఉన్న సంబంధం.

ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఒక్క మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే దాదాపు 70 శాతం దళితులకు అసలు భూమి లేదు. లేదా చాలా తక్కువ ఉంటుంది. ఇదే భారతదేశం లెక్కలు చూస్తే అసలు భూమి లేనివారు దళితులలో 77 శాతం ఉంటారు. ఆంధ్రప్రదేశ్‌లో అసలు భూమి అంటూ ఏమీ లేనివారు 10 శాతం ఉంటారు. అర ఎకరం లోపు ఉన్నవారు 36 శాతం ఉంటారు. ఇందులో దళితులు దాదాపు 70 శాతం ఉంటారు.

ఈ పరిస్థితి స్వతంత్రం వచ్చిన ఏభైఏడేళ్ల తరవాతది. ఈ ఏభై ఏడేళ్లలో సంస్థానాలు రద్దయ్యాయి, జమీందార్లు రద్దయ్యారు. ఈనాములు రద్దయ్యాయి. ఎస్టేట్లు రద్దయ్యాయి, కౌలుదారు చట్టాలు వచ్చాయి, సీలింగు చట్టాలు వచ్చాయి. ప్రభుత్వభూమి పంపిణీ జరిగింది, ఇంత జరిగినా దాదాపు 40 శాతం ప్రజలకు అర ఎకరంలోపు మాత్రమే ఉన్నది. ఒక్క అంగుళం కూడా స్వంతభూమి లేనివారు నూటికి పదిమంది ఉన్నారు. నూటికి దాదాపు 75 మంది దళితులు ఈ కోవలోకే వస్తారు. ఇదీ దళితులకు భూమికి ఉన్న సంబంధం.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది! భూమిలేక కొంతమంది దళితులు అయ్యారా! లేక వీరు దళితులు కావటం మూలంగా వీరికి భూమి లేకుండా పోయిందా? అంటే రెండూ ఒక దానితో ఒకటి కలిసి పోతాయి. కాని కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే కొంతమందిని అంటరాని వారుగా చేసి వారికి భూమిలేకుండా చేసిన విషయం కనపడుతుంది. వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థగా మారుతున్న సమయంలో, కులాల మధ్య అంతర్వివాహాలను నిషేధించిన కాలంలో ఆ నిషేధ సమయంలో ఏర్పాటయిన కులాలను కొన్నింటిని అంటరానివిగా చేసి వీరికి "భూమి ఉండ కూడదు!" అనే ఆంక్ష పెట్టటం జరిగింది. పైన చెప్పిన ఆ కులాలను ఆ కాలంలో 'చండాలురు' అని పిలిచారు, సాటి మానవుని గుర్తింపుకోసం ఆ కులాలు చేసిన పోరాటంలో వారు తమను తాము ఆదిద్రావిడులుగా, ఆది ధర్మీలుగా, ఆది ఆంధ్రులుగా ఆది కర్నాటకులుగా పిలుచుకున్నారు. వర్ణవ్యవస్థ వారిని "పంచములు" అన్నది. వీరినే గాంధీజీ "హరిజనులు" అన్నారు. వీరినే బాబాసాహేబ్ అంబేద్కర్ "దళితులు" అన్నారు. మొదట వీరిని చండాలురుగా గుర్తించి వీరికి భూమి ఉండకూడదు అని మనుధర్మ శాస్త్రంలో చెప్పించారు. కుక్కలు, గాడిదలు తప్ప వీరి దగ్గర ఆస్తి ఇతర పశువులు ఏవీ ఉండకూడదు అన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని చాలా కట్టుదిట్టంగా అమలు చేశారు కనుకనే ఈ నాటికీ అసలు

భూమి లేనివారు గాని, అరెకరం భూమి మాత్రమే ఉన్నవారు గాని దళితులలో 70 శాతంకు పైగా ఉన్నారు. హిందూ రాజ్యంపోయి ముస్లిరాజ్యం వచ్చినా, అదిపోయి బ్రిటీషురాజ్యం వచ్చినా దళితులు భూమి కలిగి ఉండకూడదనే శాసనపరమైన అంక్ష అలానే ఉండిపోయింది. ఇంకా చెప్పాలంటే మనుధర్మశాస్త్రంలో చెప్పిన దని ప్రకారం చాల రాష్ట్రాలలో అంటే అప్పటి రాజ్యాలు, సంస్థానాలు మొదలైన వాటిలో "దళితులకు ఎవరూ భూమి అమ్మకూడదు" అనే నిషేధం ఉండేది. నిషేధం అంటే అదేదో సామాజిక పరమైనది కాదు, సాక్షాత్తు శాసనం, చట్టం. దానిని ఉల్లంఘిస్తే శిక్షలు ఉండేవి. స్వంతంత్రం వచ్చిన తర్వాత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఇటువంటి చట్టాలు రద్దు అయ్యాయి. అయినా ఆ చట్టపరమైన నిషేధం తిరిగి సామాజిక ఆంక్షగా అవతారం ఎత్తింది. ఇప్పటికీ అనేక ప్రాంతాలలో చాలా చోట్ల దళితులకు భూమి అమ్మరు. ఏదో ఒకవంక పెట్టి ఆ భూమి దళితుడు కొనుక్కోకుండా చూస్తారు. 'మన పొలాల మధ్య దళితుడు రావటమా?' అనే బాధతో దళితునికి భూమి అమ్మకుండా చేయిస్తారు. దళితుడు ఎవరైనా తన వద్ద ఉన్న చిన్నా చితక భూమి ఏదైనా అమ్ముతానంటే మాత్రం సవర్ణులు అందరూ తయారువుతారు, అంతేగాని దళితునికి భూమి అమ్మటానికి ముందుకురారు!

మనది గ్రామీణ వ్యవస్థ, అంటే కుల వ్యవస్థ. మళ్లీ కులానికి భూమికి సంబంధం ఉన్నది. ఎవరైతే ధనిక రైతులు లేదా భూస్వాములు ఉన్నారో వారంతా అగ్రకులాలని చెప్పుకుంటున్న వారే! ఒక మోస్తరు అంటే రెండు మూడు ఎకరాలు ఉండే మధ్యతరగతి రైతులు మధ్యకులాల వారు అంటే వెనుకబడిన కులాల వారే! అసలు భూమిలేని వారు అంటరాని కులాల వారు. కుల వ్యవస్థ- నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ- సరిగ్గా భూమి పరిస్థితిలో స్పష్టంగా కనపడుతుంది. 'కులం' ఉన్నవానికి భూమి ఉంటుంది. 'కులం' తక్కువ వానికి భూమి ఉండదు.

గ్రామీణ వ్యవస్థలో భూస్వాములు ఉంటారు. మిగిలిన కులాలన్నీ వ్యవసాయం మీద ఆధారపడి ఉంటాయి కాబట్టి భూస్వాముల మీద వారు ఆధారపడి ఉంటారు. దళితులు కూడా అంతే. దళితులు సాక్షాత్తు భూస్వాముల దగ్గర పాలేర్లుగా, జీతగాళ్లుగా, వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ బ్రతుకు తారు. ఒకటి భూమి కలిగిన హోదా, రెండోది భూమిలేని స్థితి. ఈ హోదా ఉన్నంత వరకూ ఆస్థితి కూడా ఉంటుంది. హోదాలేని వారికి హోదా కల్పించటం జరిగితే మొదటి నుంచీ హోదా అనుభవిస్తున్న వారికి లేనివారి మీద పెత్తనం పోతుంది. పెత్తనం పోతే వారికి అన్నీ పోయినట్టే! పాలేర్లు కూడా భూమి కలిగి ఉన్నారంటే పాలేరుకు కామందుకూ తేడా ఏమిటి అనే అభ్యంతరం ఇందులో ఇమిడి ఉంది. అగ్రకులాలకు భూమి ఉన్నది. తక్కువ కులాలకు లేదా దళితులకు భూమి లేదు. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండటం వల్ల అగ్రకులాలకు పెత్తనం సాగించే అవకాశం ఉంటుంది. నిచ్చెనమెట్లు అలానే ఉంటాయి. మనుషులపట్ల గౌరవభావము దాని మీదనే ఆధారపడి ఉంటుంది.

పట్టణాలలో బ్యాంకులో ఎంత డబ్బుదాచుకున్నావనే దానిమీద గౌరవం పెరిగినట్టుగా, గ్రామాల్లో ఎంత భూమి ఎక్కువ ఉంటే అతనికంత హోదా, గౌరవం, మర్యాద, అతనంటే భయమూ. భూమి కలిగి ఉంటే మర్యాద, భూమిలేకపోతే తక్కువ చూపు. దళితుల వద్ద అసలు భూమిలేకపోవటం అంటూ ఎందుకు జరిగిందో ఇక్కడ మనం చెప్పుకోలేము గాని వాస్తవ పరిస్థితి వారి దగ్గర భూమి లేదు. రోజువారీ జీవనానికి భూస్వాముల మీద ఆధారపడి ఉంటారు. వారి దగ్గర పాలేర్లుగా వారి భూముల్లో కూలీలుగా బ్రతుకుతారు. అందువల్ల భూస్వాములు వారిని తమతోటి మానవులుగా చూడరు. అంతే కాక ఎందుకు చూడరు అని అడిగితే తన్నుతారు, చంపుతారు. తమ పొలాల్లో కూలీలుగా బ్రతికేవారిపైన వారి జీవితాలపైన యాజమాన్యం తెచ్చుకోవటమే కాకుండా వారి స్త్రీలు కూడా వారికి లొంగి ఉండాలని అనుకుంటారు. వారిపై అత్యాచారాలు చేయటం తమ హక్కు అని అనుకుంటారు. ఎదురు తిరిగిన వారిని చంపుతారు. అత్యాచారాలన్నీ ఇదే అంశం చుట్టూ తిరుగుతాయి. ఇదే భూమి దళితుని దగ్గర ఉంటే భూస్వామి మీద ఆధారపడేస్థితి ఉండదు. అతని పొలంలో పాలేరుగా జీతగానిగా కూలీగా బ్రతికేస్థితి ఉండదు. తన జీవితాన్ని శాసించే హక్కు భూస్వామికి ఉండదు. తన స్త్రీపై భూస్వామి చెయ్యి వేసే సాహసం అపుడు చెయ్యలేదు. కామందు-పాలేరు వ్యవస్థ కొనసాగేంతకాలం ఈ అత్యాచారాలు అవమానాలు తప్పవు. వీటిని అరికట్టాలంటే దళితులకు భూమి దొరకాలి. ఆ స్థితిరావటం ఇష్టం లేని భూస్వాములు ఎప్పటికీ దళితులకు భూమి దక్కకుండా చూస్తారు. ఇదీ దళితులకు భూమికి మధ్య ఉన్న సంబంధం. అందుకనే భూస్వాములు దళితులకు భూమి దక్కకుండా చూస్తున్నారు.

గ్రామాలలో భూమికోసం జరుగుతున్న పోరాటాలు చూస్తూ ఉన్నాం. రైత్వారీ విధానం ప్రవేశపెట్టిన తర్వాత రైతులయిన వారు పట్టా ప్రకారం వచ్చిన భూమి కాకుండా మిగిలిన భూమిని ఆక్రమించుకొని ఉన్నారు. ఆ భూమిని దళితులకు పంచటానికి ఏ

ప్రయత్నం జరిగినా భూస్వాములు ఒప్పుకోరు. తమ దగ్గర ఉన్న, అంటే తమ అక్రమ స్వాధీనంలో ఉన్న భూమిని ఒక్క అంగుళం కూడా వదులుకోవటానికి భూస్వామి ఒప్పుకోడు. ఎందుకని? దానివల్ల వ్యక్తిగతంగా వారికి నష్టం ఏమీ ఉండదు. పైగా అవి అక్రమమూ, చట్ట విరుద్ధమూను! అయినా దానిని వదులు కోవటానికి ఇష్టపడడు. ఎందుకంటే దళితునికి-తనపాలేరుకు, తన పొలంలో పని చేసే కూలీకి-భూమి ఉండటం అతను అంగీకరించ లేడు. అతనికి తనలో సమానమైన హోదా కల్పించటం భూస్వామి సహించ లేడు. అందుకనే భూమికోసం దళితులు చేసే ఏ పోరాటాన్నయినా భూస్వామి ఎదుర్కొంటాడు. చివరకు దళితులను చంపించటానికి కూడా సిద్ధమవుతాడు. అత్యాచారాలు ఎక్కువశాతం ఇదే పరిస్థితిలో జరుగుతున్నాయి. ఆశ్చర్యం ఏమంటే ప్రత్యక్షంగా చంపలేకపోతే, చంపించలేకపోతే మంత్రగాడని పేరుపెట్టి ఊరందరి చేతా చంపిస్తాడు. ఏమయినా సరే దళితునికి భూమి దక్కకూడదు. అది భూస్వామి స్వభావం.

అధికారం భూస్వాములది కాబట్టి ప్రభుత్వ వైఖరి కూడా ఇంతే! ప్రభుత్వంలోని అన్ని ప్రధాన అంశాల వైఖరి కూడా ఇదే! అది పోలీసు యంత్రాంగం కాని, న్యాయ వ్యవస్థ కాని, భూస్వాముల ప్రయోజనాలు కాపాడటానికే ఇవన్నీ. లేకపోతే ఈవేళ ప్రభుత్వ భూమి కొన్ని లక్షల ఎకరాలు ఉన్నది. అది బంజరు గాని, అటవీ భూమిగాని లంక భూములు గాని, తీర ప్రాంతభూములు గాని, దేవాదాయ భూములు గాని, సీలింగు మిగులు భూమి గాని భూస్వాముల దురాక్రమణలో ఉన్న భూమి గాని. ఏదైనా గాని ప్రభుత్వ లెక్కల ప్రకారం మన ఆంధ్రప్రదేశ్‌లో 60 లక్షల భూమి పంపకానికి ఉన్నది. మరి ఏది! ఒక్క ఎకరం కూడా లేని దళితులు గ్రామాలలో నూటికి డబ్బైకి పైగా ఎందుకున్నారు? అంటే దళితులకు భూమిని ఇవ్వటం అనే విషయంలో భూస్వాముల వైఖరికీ ప్రభుత్వ వైఖరికి పెద్ద తేడా ఏమీ కనపడదు.

భూమి అనేది గ్రామాలలో ఒక హోదా అనుకున్నాం కదా, అది ఒక మర్యాదకు గుర్తు. భూమి అన్నం మాత్రమే పెట్టదు. గౌరవాన్నిస్తుంది. ధైర్యాన్నిస్తుంది. హోదా ఇస్తుంది. చదువు చెప్పిస్తుంది. నాగరికత నేర్పిస్తుంది. ఐశ్వర్యానిస్తుంది. రాజకీయ అధికారం ఇస్తుంది. వీటన్నిటితోపాటు దళితులకు ఆత్మ గౌరవాన్నిస్తుంది. ఈ ఆత్మ గౌరవాన్ని ఇస్తుంది కాబట్టే భూస్వాములు దళితుల భూమి కలిగి ఉండటానికి ఒప్పుకోవటం లేదు. అందుకనే దళితుల భూపోరాటం ఆత్మగౌరవ పోరాటం అయింది, హక్కుల పోరాటం అయింది.

గ్రామాలలో ఎవరిదగ్గర భూమి ఉంటుందో వారి వద్దనే విద్య ఉన్నది, వారి వద్దనే ఆరోగ్యం ఉన్నది, వారి వద్దనే హోదా ఉన్నది. వారి వద్దనే రాజకీయ అధికారం ఉన్నది. ఈ క్రమాన్ని తిరగవేసి చూసినా అంతే. ఎవరిదగ్గర రాజ్యాధికారం ఉంటుందో వారి వద్ద భూమి ఉంటుంది. వారివద్ద చదువు ఉంటుంది. వారివద్ద ఆరోగ్యం ఉంటుంది. భూమిలేక పోవటంవల్ల దళితులు చదువుకోలేకపోతున్నారు, అనారోగ్యంతో బాధపడుతున్నారు, రాజకీయ అధికారం పొందలేకపోతున్నారు. ఆత్మగౌరవం కోల్పోతున్నారు. ఈ దేశంలో భూమి ఉన్నవాళ్ల అగ్రకులాలు, భూమి లేనివారు నిమ్న కులాలు. భూమికి కులానికే ఆ సంబంధం ఉన్నది. మొత్తం జీవితమంతా భూమితో ముడిపడి ఉన్న దళితులు. భూమి చుట్టూనే తిరుగుతున్న దళితులకు భూమి లేకుండా చేయటం అనేది పెద్ద సామాజిక ఆర్థిక రాజకీయ కుట్ర. ఈ కుట్రను భగ్నం చేయాలి. దళితులకు సమాన హోదా కల్పించటానికి అగ్రకుల భూస్వాములు ఇష్టపడరు కనుకనే, వారి ప్రయోజనాలు కాపాడుతున్న ప్రభుత్వం కూడా ఆ దిశగా పయనించదని తెలిసే, దాదాసాహెబ్ అంబేద్కర్ ఎప్పుడో చెప్పాడు భూమిని జాతీయం చేయండి అని. ఎవరికీ భూమిపై హక్కులేనినాడు ఎవరు భూమిని దున్నుకొని బ్రతకాలనుకుంటారో, వారికి ఆ అవకాశం దొరుకుతుంది. వారిలో దళితులు అత్యధికశాతం ఉంటారు కాబట్టి అపుడు దళితులకు భూమి దక్కుతుంది. మరోవిధంగా ఇది జరిగే అవకాశం కనబడటం లేదు!

దళితరైతుల చేతుల్లో తలసరి భూమి సగటు విస్తీర్ణం నానాటికి తీసికట్టు నాగంభొట్లుగా తయారైంది. 1976-77లో తలసరి భూమి విస్తీర్ణం 1.19 హె. నుంచి 80-81లో 1.06 హె.కు, 86-87లో 0.9 హె.కు, 90-91లో 0.91 హె.కు 95-96లో 0.83కు పడిపోతూ వచ్చింది.

కేంద్ర నిర్ణయం ప్రకారం 1976-77 నుంచి ప్రతీ అయిదు సంవత్సరాలకు ఒకసారి వ్యవసాయ భూముల లెక్కలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా దళితుల, గిరిజనుల భూమి విస్తీర్ణం గురించి గణాంకాలు సేకరణ ప్రారంభమైంది. 2000-01 వ్యవసాయ లెక్కలు ఇంకా విడుదల కాలేదు. 95-96 లో లెక్కలు కూడా ఆగష్టు 2003 నెలలోనే ప్రచురించబడ్డాయి. అనేక ప్రభుత్వ గణాంకాల్లోలాగే, ఈ గణాంకాల్లో కూడా ఒకే సంవత్సరానికి వివిధ ప్రచురణల్లో లెక్కలు వివిధ రకాలుగా వున్నాయి. ఆ తేడాలను పక్కన పెడితే చిన్న సన్నకారు, మధ్యతరహా, పెద్ద రైతుల తలసరి భూమి విస్తీర్ణం ఈ కింది విధంగా వుంది.

తలసరి సగటు విస్తీర్ణం

(హెక్టార్లు)

	76-77	80-81	86-87	90-91	95-96
చిన్న	0.4	0.4	0.4	0.41	0.42
సన్నకారు	1.4	1.5	1.41	1.40	1.39
సెమీ మధ్యతరహా	2.7	2.6	2.6	2.56	2.53
మధ్యతరహా	6.2	5.7	5.6	5.58	5.53
పెద్ద తరహా	14.0	18.0	13.01	16.00	19.0
	1.19	1.06	0.95	0.91	0.83

76-77తో పోల్చి చూస్తే, పెద్దతరహా రైతులు తప్ప, మిగతా తరగతుల వారందరి భూముల సగటు విస్తీర్ణం తగ్గిపోయిందని ఈ పట్టిక తెలియ చేస్తుంది.

భూసంస్కరణలు అమలు పరచాం, పేదలకు భూములు పంచిపెట్టాం, పంట పండించుకోవటానికి ఆర్థిక సహాయం చేశాం ప్రజలే నాదేవుళ్లు అని చెవులు హోరెత్తేలా ప్రచారం. ఆచరణలో నిరుపేద రైతులకు సగటున హెక్టారులో సగం భూమి కూడా లేని పరిస్థితి. అదికూడా రెండు దశాబ్దాలక్రితం ఎక్కడ వున్నారో, అక్కడే వుండిపోయారంటే పేదలగురించి పాలకులు చెప్పేమాటలన్నీ వారి నాలుక చివరినుంచి వచ్చినవేనని స్పష్టమవుతుంది.

దళితుల చేతుల్లోవున్న కమతాల సంఖ్య 8.24 లక్షల నుంచి 12.85 లక్షలకు పెరగగా, ఆ కమతాల మొత్తం విస్తీర్ణం 9.84 ల.హె. నుంచి 10.66 ల.హె. మాత్రమే పెరిగింది. అంటే కమతాలు నాలుగున్నర లక్షలకు పైగా పెరిగితే, కమతాల విస్తీర్ణం పెరుగుదల కేవలం 0.82 ల.హె. మాత్రమే. కమతాల సైజు తగ్గిపోతుందని ఈ విశ్లేషణ తెలియ చేస్తుంది. అలాగే మొత్తం జనాభాలో దళితుల శాతం 1971-81 జనాభా లెక్కల ప్రకారం 13.3 శాతం మంది 14.9 శాతానికి పెరిగినా, వారి కమతాల సంఖ్య 13.4 శాతం నుండి 12.6 శాతానికి, 1986-87 నాటికి ఇంకా తగ్గి 12.2 శాతానికి చేరుకొంది. 1991 వచ్చే నాటికి జనాభా 105.92 లక్షలకు (15.93 శాతం) వారి కమతాల సంఖ్య 12.85 శాతానికి పెరిగినా ఆ కమతాల కిందవున్న భూమి 7.42 శాతం మాత్రమే పెరిగింది.

కేవలం చిన్నరైతులు (1 హె.కు తక్కువగా వున్నవారు) కమతాల సంఖ్య 5.34 లక్షల నుంచి 95-96లో 9.44 ల.కు పెరిగింది కాని, వారి కమతాల్లో భూమి విస్తీర్ణం 2.91 ల.హె. నుంచి 3.96 ల.కు మాత్రమే పెరిగింది.

అలాగే సన్నకారు రైతుల (1-2హె.) కమతాల సంఖ్య పైన ఉదహరించిన కాలంలో 18.9 శాతం నుంచి 17.75కు తగ్గినా భూమి విస్తీర్ణం 2.27 ల.హె. నుంచి 3.17 ల.హె. పెరిగింది. ఆ కాస్తా పెరగడానికి 20 ఏళ్లు పట్టింది. అంత కాలంలో ధరల పెరుగుదల, కుటుంబం పెరుగుదల, వ్యవసాయ ఖర్చుల పెరుగుదల, పిల్లల చదువుసంధ్యల జీతాల పెరుగుదల లాంటివన్నీ లెక్కవేస్తే విస్తీర్ణం పెరిగింది కాని, జీవన వ్యయం అంతకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ పెరిగి, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లయింది.

90వ దశకంలోకి వచ్చి చూస్తే 90-91/95-96 మధ్య అయిదు సంవత్సరాల్లో దళితుల జనాభా 1981 కన్నా 1991లో 14.9 శాతం నుంచి 15.93 శాతానికి, వారి కమతాల సంఖ్య 11.83 ల. నుంచి 12.85 ల.కు పెరగగా భూమి విస్తీర్ణం 10.82 ల.హె. నుంచి 10.66 ల.హె. కు దిగిపోయింది. వారి కమతాల్లో చిన్న రైతుల కమతాల సంఖ్య శాతం 2.97 శాతం పెరగగా, మిగతా తరగతుల వారి కమతాల సంఖ్య శాతం తగ్గిపోయింది.

వ్యవసాయ కమతాల సెన్సస్ ప్రారంభించినప్పటినుంచి దళితుల భూములకు నీటి సౌకర్యం గురించి సమాచార సేకరణ జరగలేదు. 90-91 నుండి 95-96 లో ఈ లెక్కల సేకరణ ప్రారంభమైంది. దళితులు వ్యవసాయం చేస్తున్న 10.94 లక్షల కమతాల్లో పూర్తి నీటి సౌకర్యం 4.67ల. కమతాలకే (42.69 శాతం) వుంది. మరో 1.05ల. కమతాలు పాక్షికంగా నీటి సౌకర్యం పొందుతున్నాయి. 5.22ల. కమతాలకు ఎటువంటి నీటి సౌకర్యం లేదు. అంటే సుమారుగా సగానికి సగం కమతాలు నీటి సౌకర్యంలేని కమతాలు. విస్తీర్ణం దృష్ట్యా చూస్తే మొత్తం 8.35 ల.హె. లో 2.85 ల.హె. కు మాత్రమే నీటి పారుదల ఏర్పాటు వుంది.

90-91/95-96 ల్లో నీటిపారుదల ఉన్న భూముల వివరాలు ఈ కింది పట్టికలో చూడవచ్చు.

నీటిపారుదల వున్న భూములు

(విస్తీర్ణం లక్షల హె.)

	కమతాలసంఖ్య (లక్షలు)	నికరపంట భూమి	నికరసాగు విస్తీర్ణం
ఎ. పూర్తి నీటిసదుపాయం	42.69	27.30	80.00
	(42.82)	(26.12)	(79.33)
బి. పాక్షిక నీటిసదుపాయం	9.60	17.01	20.00
	(11.09)	(18.73)	(20.67)

సి. ఎ+బి	52.29	44.31	100.00
	(53.91	(44.85)	(100.00)
డి. నీరుపారని భూమి	47.71	55.69	
	(46.09)	(55.15)	

(బ్రాకెట్‌లో వున్న లెక్కలు 1990-91 సెన్సస్ నాటివి)

90-91తో పోలిస్తే 95-96లో నీటి సౌకర్యం అందిన కమతాల సంఖ్య, విత్తన భూమి, నికరసాగు భూమి కొద్దిగా తగ్గుదలను సూచిస్తున్నాయి.

ఇతరులతో పోలిస్తే దళితరైతులు ఎంత దయనీయ స్థితిలో వున్నారో వ్యవసాయ సెన్సస్ తెలియ చేస్తుంది. ఉదహరణకు దళితులలో చిన్న, సన్నకారు రైతుల సంఖ్య (2హె. వరకూ) 1991లో 89.1 శాతం వుంటే, మొత్తం రాష్ట్రంలో 35.89 శాతం మాత్రమే వుంది. మధ్యతరహా దళిత రైతుల సంఖ్య 36.8 శాతం కాగా, రాష్ట్రం శాతం 51.29. చిన్న, సన్నకారు దళిత రైతుల చేతుల్లో కేవలం 6.46 ల.హె. భూమి వుంటే రాష్ట్రం మొత్తంలో ఆ భూమి 51.96 ల.హె. వుంది. మధ్యతరహా రైతాంగం చేతుల్లో దళితులవి 3.98 ల.హె, మొత్తం రాష్ట్రం 49.56 ల.హె. ఈ లెక్కల్లో మెట్ట, మాగాణీ భూముల వివరాలు సేకరించలేదు. అదే చేసివుంటే దళిత రైతుల స్థితి ఇంకా ఎంత అధ్వాన్నంగా వుండివుందో తెలిసేది. ఎందుచేతనంటే పేదరికం దృష్ట్యా వారి చేతుల్లో తక్కువ సారవంతమైన భూమి వుంటుంది. ఇదే విషయాన్ని సెన్సస్ గణాంకాల రూపంలో తెలియ చేస్తుంది.

కమతాలు, భూమి విస్తీర్ణం 1991

(హెక్టార్లు)

కమతం సైజు	మొత్తం రాష్ట్రం కమతాలసంఖ్య	మొత్తం రాష్ట్రం విస్తీర్ణం	దళితులు కమతాలసంఖ్య	దళితులు విస్తీర్ణం
చిన్నరైతులు				
0.02కు తక్కువ	39486	406	77237	59
0.02-0.5	3157800	876160	555220	145943
0.5-1.0	2013417	1492203	273876	200276
మొత్తంచిన్నరైతులు	5210703	2368768	836360	346278
సన్నకారు				
1.0-2.0	1917862	2826567	217413	305886
సెమీ-మీడియం				
2.0-3.0	926530	2202252	80502	186199
3.0-4.0	418697	1437451	22837	78065
మొత్తం సెమీమీడియం	1345227	3639703	103339	264264
మధ్య తరహా				
4.0-5.0	253263	1123875	11587	51128
5.0-7.5	277111	1677108	9607	57569
7.5-10.0	113788	976076	2983	25347
మొత్తం మధ్యతరహా	644162	3777059	24177	134044
పెద్ద తరహా				
10.0-20.0	101191	1331373	1858	23781
20 ఆపైన	17197	516665	260	8027
మొత్తం పెద్ద తరహా	118388	1848038	2118	31808
	9290342	14460135	1183407	1382280

మొత్తం రాష్ట్రంలో అందరికన్నా అట్టడుగున వున్న 0.02 హె. కన్నా తక్కువ భూమి వున్న వారి సగటు కమతం విస్తీర్ణం 0.01 అయితే, అది దళిత వర్గాల్లో 0.0008 హె. మాత్రమే.

ఆఖరున ఒక్కమాట. ఈ గణాంకాలన్నీ చూచి ఇది చంద్రబాబు అధికారంలోకి రాకముందు పరిస్థితి అని, ఆయన పగ్గాలు చేతపట్టిన తర్వాత పరిస్థితి బ్రహ్మాండంగా బాగుపడిపోయిందని అనవచ్చు. ఆయన భక్తులు గమనించాల్సిందేమిటంటే 80-81లో కాంగ్రేసు అధికారంలో వుండగా తలసరి సగటు భూమి విస్తీర్ణం 1.06 హె. వుండగా, రామారావు పరిపాలనలో 0.9 హె.కు పడిపోయింది. ఏమైనా దళితుల దారిద్ర్యం విషయంలో ఇద్దరి బాధ్యతావుంది. తిలాపాపం, తలా పిడికెడు.

+ దళితుల భూకమతాల సగటు విస్తీర్ణం 1976-77లో 1.19 హె. నుంచి 95-96లో 0.83 హె. కు తగ్గింది.
+ సగం కమతాలకు ఎటువంటి నీటి సౌకర్యం లేదు.
+ 77వేల అతిచిన్న రైతుల భూకమతాల సైజు 0.2 హెక్టారు, వాటి మొత్తం భూమి విస్తీర్ణం 59 హె. మాత్రమే.
+ రాష్ట్రం మొత్తం మీద అందరు రైతుల్లో అతి పేద రైతు తలసరి సగటు విస్తీర్ణం 0.01 హె. అయితే, దళిత భూకమతం సగటు విస్తీర్ణం 0.0008 హె!

గిరిజనులనెత్తిన చంద్రబాబు చెయ్యి

-మాడభూషి శ్రీధర్

గిరిజనులను, ఆదిమవాసులను, వారిసొంత ప్రదేశాలైన కొండప్రాంతాలనుంచి, వన జనావాసాలనుంచి తరిమి కొట్టడం నాగరికతగా మారిపోయింది. ఎవరు వలసవాదులు? ఎవరు సొంతదారులు?

కొండలనుంచి కొండజాతుల వారిని తరిమివేసే అధికారం ప్రభుత్వానికి కూడా లేదు. ఆ విషయం ఆంగ్లేయ ప్రభుత్వం, నిజాం సర్కార్, చివరకు విధిలేక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా శాసనరూపంలో ఆమోదించిన తరువాత కూడా గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు.

బిర్లాగ్రూప్‌కు చెందిన ఒక సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఒక లీజు పత్రం పొంది విశాఖపట్టణం జిల్లా పాడేరు పంచాయతీ ప్రాంతంలోని (అనంతగిరి మండలం) గనులు తవ్వడానికి రోడ్లు వేయడానికి పలుగు, పార, డ్రిల్లర్ తదితర పరికరాలతో సిబ్బందిని దింపింది. హఠాత్తుగా ఉన్నట్టుండి ఊరొదిలి వెళ్ళి పొమ్మని, అందుకు 5వేల రూపాయలు పరిహారం ఇస్తామని సర్కార్ అధికారులు చెప్పారు. ఇది 1987లో జరిగిన సంఘటన. దీనికి వ్యతిరేకంగా ఊరిజనం ఆందోళన ప్రారంభించారు. దశాబ్దం దాటింది. 'సమత' అనే ఒక ఎన్.జివో. గిరిజనుల హక్కులకోసం సాగించే పోరాటంలో భాగంగా హైకోర్టులో రిట్ దాఖలు చేసింది. ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘిస్తే, ప్రజల హక్కులు హరిస్తే కోర్టు ఒక్కటే దిక్కు.

గిరిజన భూములను ఎవరికీ బదిలీ చేయడానికి వీల్లేదు. అనాదిగా నిషేధం ఉంది. అల్లూరి సీతారామరాజు నాటి ఉద్యమ ఫలితం అది. వన్ ఆఫ్ సెవెంటీగా పేరొందిన 1970 చట్టాల ప్రకారం గిరిజనుల భూములను గిరిజనేతరుల పేరున కూడా బదలాయించడానికి వీల్లేదు. ఆస్తి కొనుగోళ్ళ లావాదేవీల పైన నిషేధం ఉంది.

గిరిజనేతరులంటే ప్రభుత్వం కూడా అని అర్థం చెప్పుకోవచ్చా లేదా? అన్న ప్రశ్నను 'సమత' లేవనెత్తింది. గిరిజనులు, గిరిజనేతరులు బదిలీ చేయలేని గిరిజన భూములను ప్రభుత్వం మరెవరికో ఏవిధంగా బదిలీ చేయగల్గుతుంది? అని ప్రశ్నించింది. కేంద్రానికి, రాష్ట్రానికి ఎన్ని విన్నపాలు చేసినా ప్రయోజనం లేకపోతే-స్థానిక కోర్టుల్లో, తరువాత హైకోర్టులో కేసువేసింది. హైకోర్టు కేసులను డిస్మిస్ చేసింది. సుప్రీం కోర్టుకు అప్పీలుకు వెళ్లింది. నాలుగేళ్ళ పోరాటం తరువాత చరిత్రాత్మక తీర్పు గెలిచింది. షెడ్యూల్డు ప్రాంతాలలో ప్రయివేటు గనుల త్రవ్వకం 1980 అటవీ రక్షణ చట్టం కింద నిషేధించడం సమంజసమేనని గనుల లీజులు ఇచ్చే అధికారం ఏ వ్యక్తికీ లేదని, కనుక ప్రభుత్వానికి కూడా ఆ అధికారం లేదని సుప్రీంకోర్టు తీర్మానించింది. రాష్ట్ర గనుల అభివృద్ధి సంస్థ గానీ, గిరిజనుల సహకార సంఘం గాని గనులు తవ్వి అభివృద్ధి చేయవచ్చు. ఈ గనులు కూడా అటవీ రక్షణ చట్టం, పర్యావరణ రక్షణ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ చట్టం, పంచాయత్(షెడ్యూల్డు ప్రాంతాల విస్తరణ) చట్టం కింద గ్రామసభలకే తమ వనరులను కాపాడుకునే అధికారం ఉంది.

గనుల అభివృద్ధి ద్వారా లభించే ఆదాయంలో కనీసం 20 శాతం ఆయా గిరిజన ప్రాంతాలలో మౌలిక వనరుల కల్పనకు కేటాయించాలి.

గిరిజనుల స్వయంపాలన, పంచాయతీ అధికారాలు కాపాడడానికి ఈ సూత్రాలతో కొత్తచట్టం తేవాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. ఇదొక గొప్పతీర్పు. కాని గిరిజనుల కష్టాలు కడతేర లేదు. 1997 తీర్పులో మార్పులు కోరుతూ కేంద్ర రాష్ట్రాలు పిటీషన్లు దాఖలు చేసాయి. సుప్రీంకోర్టు వాటిని 2000లో తిరస్కరించింది.

గనులు ఖనిజాల (నియంత్రణ-అభివృద్ధి) సవరణ చట్టం 2003 ద్వారా 'సమత' తీర్పును నీరుగార్చే ప్రతిపాదనను చంద్రబాబునాయుడు ప్రభుత్వం రహస్యంగా కేంద్రానికి పంపింది. తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర గనుల సంస్థకు షెడ్యూల్డు భూములను లీజుకు ఇచ్చింది. తరువాత కేంద్ర అడవులు- పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి, అభ్యంతరం లేదనే ధృవపత్రం కోరింది. కేంద్రం కూడా ఈ రహస్య ప్రతిపాదనను ఆమోదించేందుకు సిద్ధంగా ఉంది. వ్యవసాయేతర అవసరాలకు గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదిలీ చేసే అవకాశం ఉందనే వాక్యాన్ని అయిదో షెడ్యూల్లో చేర్చి, గిరిజనులకు తీవ్రమైన అన్యాయం చేసేందుకు ఎన్.డి.ఎ. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మన్‌మోహన్ ప్రభుత్వం అయినా గిరిజనుల మొర వింటుందా?

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధికి, ప్రత్యేక కార్యక్రమాలకు సబ్‌ప్లాన్‌ను ప్రభుత్వాలు చేపట్టాయి. కాని భూమి తగాదాలు, దోపిడీ ఆపలేకపోయాయి. షెడ్యూల్డు ప్రాంతాల్లో భూములను గిరిజనేతరుల పాలు కాకుండా శాసనాలు చేయవలసి వచ్చింది. 1959లో అటువంటి తొలిశాసనం వచ్చింది. 1917 చట్టం

అమలు కాకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని, కనుక కొత్త శాసనం అవసరమని భావించారు. గిరిజనుల భూమి గిరిజనేతరులకు బదిలీ చేసినా చెల్లదని ఈ చట్టం నిర్దేశించింది. ఈ చట్టానికి లిమిటేషన్ చట్టం వర్తించబోదని పేర్కొన్నారు. కనుక సుదీర్ఘ ఆక్రమణ ద్వారా భూమిపై హక్కు సాధించే అవకాశం లేదు. ఇటువంటి బదిలీలను రిజిస్టర్ చేయడానికి వీల్లేదని మరో నియమం చేర్చారు. ఈ నియమాలను ఉల్లంఘించి ఆస్తి బదిలీ చేస్తే, వ్రాతపూర్వక ఫిర్యాదుపైన గానీ, తమంత తాముగానీ 'అధికారి' (ఏజెంట్) భూమి ఆక్రమించిన గిరిజనేతరుడిని స్వాధీనంనుంచి తప్పించి అసలు సొంతదారయిన గిరిజనుడికి ఇవ్వాలి. సొంతదారుడు లేకపోతే, లేదా దొరకకపోతే వారి వారసులకు, వారూ లేకపోతే ప్రభుత్వం ఆ భూమిని ఇతర గిరిజనుడికి లేదా గిరిజనులతో ఏర్పాటయిన సహకార సంఘానికి ఇవ్వవలసి ఉంటుంది. ఈ నిబంధనలు ఉల్లంఘించి గిరిజనుడి భూమి కొన్న వ్యక్తికి ఏడాది కఠిన కారాగార శిక్ష లేదా 2 వేల రూపాయల జరిమానా విధించవచ్చు.

ఇంత సంరక్షితమయిన శాసనం చేసినా గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాక తప్పలేదు. 1917 శాసనం కింద 'ఏజెంట్' అనుమతితో (మాత్రమే) గిరిజనుల భూములు కొనుక్కోవచ్చునని ఉండడంతో ఏజెంట్ అనుమతి తీసుకొని గిరిజనేతరులు భూములు కొన్నారని వాదించడం మొదలు పెట్టారు. ప్రభుత్వం కూడా గిరిజనేతరులను పరోక్షంగా సమర్థిస్తూ ఏజెంట్ అనుమతితో కొన్న భూములను గిరిజనేతరులకే అప్పగించాలన్న ధోరణిని కనబరిచింది. 1917కు తర్వాతగానీ, అంతకు పూర్వంగానీ 'ఏజెంట్' ఎవ్వరికీ అనమతినిచ్చిన దాఖలాలు లేవు. ఎవ్వరూ ఏజెంట్ అనుమతికోసం దరఖాస్తు ఇవ్వలేదు కూడా. అయినా 1917 నాటి రికార్డులు లేవు కనుక 'అనుమతితో కొన్నారు' అని వాదించేందుకు సాహసిస్తున్నారు అని ఒక అధికారి విమర్శించారు.

1959 చట్టం అమలులో లోపాలను సవరించి గిరిజన భూముల క్రమ విక్రయాలను మరింతగా నిరోధించడం కోసం ఆక్ట్ 1 ఆఫ్ 1970 ని రూపొందించారు. 1970లో రెగ్యులేషన్ ద్వారా 1959 చట్టాన్ని సవరించడం ఈ చట్టం లక్ష్యం. భూమి బదిలీ రెగ్యులేషన్ (ఎల్‌టిఆర్) 1970 సవరణతో ఇంకా కఠిన నియమాలు రూపొందించారు. షెడ్యూల్డు ప్రాంతాల్లో భూముల బదిలీపై పూర్తి నిషేధం విధించారు. గిరిజనుడు మరో గిరిజనుడికి కూడా భూమి అమ్ముకోవడానికి వీల్లేదు. గిరిజనేతరుడు కూడా గిరిజనుడు కాక మరెవరికీ భూమి విక్రయించడానికి వీల్లేదని ఆక్ట్ 1 ఆఫ్ 1970 నిషేధించింది. ఈ చట్టంలో మరో విశేషమేమిటంటే షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజనుడి నుంచి కొన్నాడనే భావించవలసి ఉంటుందని నిర్ధారించింది. అంటే అతను గిరిజనుడి నుంచి భూమి కొనలేదని నిరూపించుకునే వరకు అతను గిరిజనుడి భూమిని అక్రమంగా క్రయం చేసాడని చట్టం భావిస్తుంది. ఈ చట్టం ప్రకారం గిరిజన, గిరిజనేతరుల మధ్య, గిరిజనుల మధ్య, గిరిజనేతరుల మధ్య భూమి క్రయ విక్రయాలకు తావే లేదు. గిరిజనేతరుడు గిరిజనుడికి మాత్రం భూమిని అమ్ముకోవచ్చుననే భావన మిగులుతుంది. కాని అటువంటి సందర్భమే రాకపోవచ్చు.

షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజనులు కానీ గిరిజనేతరుడు కానీ తమ అధీనంలో ఉన్న భూమిని అమ్మకతప్పని పరిస్థితి ఏర్పడితే, లేదా సరైన ధర ఇచ్చి ప్రభుత్వమే కేటాయించాలి అని ఆక్ట్ 1 ఆఫ్ 1970 చెప్తున్నది. 1970 చట్టం ప్రకారం గిరిజనేతరుడు గిరిజనుడి నుంచి అక్రమంగా భూమిని ఆర్జించాడన్న భావనకు వీలు ఏర్పడడంతో భూమి ఉన్న ప్రతి గిరిజనేతరుడు 1959 చట్టాన్ని ఉల్లంఘించిన నేరస్తుడవుతున్నాడు. గిరిజనుడు అమాయకుడు కనుక, అతడి భూమిని అక్రమంగా కోల్పోవడమే గాక, ఆ భూమి తనదని చెప్పుకునే ఆధారాలేమీ లేకుండా ఉన్నాడు కనుక గిరిజనేతరుడి మోసాన్ని రుజువుచేసే అవకాశం లేదని, కనుకనే ఈవిధమైన మార్పు అవసరమని చట్టం భావించింది. ఈ సవరణతో చట్టం దురుపయోగానికి వీల్లేని పకడ్బందీ శాసనంగా మారిపోయింది. కనుక గిరిజనేతరులు తీవ్రంగా ఆగ్రహించారు. గిరిజనుల భూములు స్వాధీనం కొనసాగాలనే ఉంది. ఈ రెండు చట్టాలను అమలు చేయకుండా సంవత్సరాల కొద్దీ కాలం గడపడమే ఏకైక మార్గం అని గిరిజనేతరులు, వారి స్వార్థ ప్రయోజనాల పరిరక్షకులైన అధికారులు, వారిని ప్రోత్సహించే రాజకీయ నాయకులు భావించారు. కనుక 1959, 1970 చట్టాలు మళ్ళీ అటకెక్కాయి. వేటకోసం విసిరే బాణాలు భూమికోసం విసిరే పరిస్థితి ఏర్పడింది.

గిరిజనులకు భూమి తల్లివంటిది. భూమి సొంతం అని చెప్పుకోవడానికి ఒక పట్టా అవసరమనే ఆలోచన వారికి లేదు. పట్టా వారి దృష్టిలో ఒక కాగితం ముక్క. నమ్మిన నేస్తం అడిగితే భూమి ఇచ్చి వెళ్లిపోయే మంచితనం వారి సొత్తు. వ్యాపారం పేరుతో వడ్డీలకు అప్పులిచ్చి గిరిజనుల భూములను స్వాధీనం చేసుకునే ఆలోచనల నుంచి వారిని రక్షించేందుకు 1917 నుంచి చట్టాలు చేస్తున్నారు. షెడ్యూల్డు ప్రాంతాల్లో సాధారణ చట్టాలు వర్తించవు. సాధారణంగా సాగించే క్రయవిక్రయాలు చెల్లవు. కాల పరిమితి చట్టం వంటివి వర్తించవు. (సెక్షన్ 3, 7) అనుమతి లేకుండా కొంతకాలం కబ్జాలో ఉండి, 'వ్యతిరేక స్వాధీన' సూత్రం కింద భూమిని సొంతం చేసుకునే విధానాలు ఇక్కడ చెల్లవు. 1978లో చేసిన మొదటి రెగ్యులేషన్ ద్వారా 1959 చట్టంలో చేర్చిన సెక్షన్ 3 బి ప్రకారం గిరిజనుడికి,

ఇతరుడికి మధ్య జరిగిన క్రయాన్ని రిజిస్టర్ చేయడానికి వీల్లేదు. సెక్షన్ 3 ప్రకారం మరో గిరిజనుడికి భూమి బదిలీ చేయడం సాధ్యమవుతుంది. గిరిజనుడికి లేదా గిరిజనులతో కూడిన సహకార సంఘానికి భూమి అమ్మవచ్చు. గిరిజనుడైన మరో గిరిజనుడికి అమ్ముకోవలసిందేగాని మరో వీలులేదు. ఒకవేళ కొనగల గిరిజనుడు లేకపోతే, లేదా సమంజమైన ధర ఇవ్వడానికి ఏ గిరిజనుడూ సిద్ధంగా లేకపోతే, అతను 'ఏజెంట్' (ప్రత్యేకాధికారి లేదా కలెక్టర్) దరఖాస్తు పెట్టుకోవాలి. ఆ అధికారి నష్టపరిహారం ఇచ్చి ఆ భూమిని కొని గిరిజనులకు మాత్రమే కేటాయించాలి. ఈ నియమాలను ఎవరు ఉల్లంఘించినా సరే ప్రభుత్వోద్యోగి వ్రాతపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చినా లేదా తనంత తానుగానైనా గిరిజనుడి భూమి కబ్జాలో ఉంటే ఖాళీ చేయాలనే ఉత్తర్వు(డిక్రీ) జారీ చేయవచ్చు. ఆ భూమిని ఖాళీ చేయించి బదిలీ చేసిన గిరిజనుడికి గానీ, అతని వారసులకుగానీ అప్పగించాలి. ఒకవేళ అతను భూమి తీసుకోవడానికి ఇష్టపడకపోయినా, అతను, లేదా అతని వారసులు దొరకకపోయినా ఏజెంట్ ఆ భూమిని గిరిజనుడికి, లేదా గిరిజనులతో కూడిన సహకార సంఘానికి కేటాయించాలి. సెక్షన్ 6ఎ(1978లో చేర్చినది) ప్రకారం గిరిజనేతరుడు ఈ విధంగా భూమి సంపాదిస్తే ఆ భూమిని కోల్పోవడమేగాక అతనిపై ఏడాది వరకు కఠిన కారాగార శిక్ష, రు. 2000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ రెగ్యులేషన్ ఎంత పకడ్బందీగా ఉన్నా తెలివైన గిరిజనేతరుల ఉపాయాల ముందు పనికిరాకుండా పోయింది. ఏదో లొసుగుల ఆధారంగా గిరిజన భూముల స్వాహా కొనసాగింది. 1917 చట్టం ప్రకారం 'ఏజెంట్' అనుమతితో 'బదిలీ' చేసుకోవచ్చు అని ఉంది కనుక తమకు ఏజెంట్ అనుమతి ఉందని వాదించే దొంగ వాచనలు మొదలయ్యాయి. గిరిజనేతరుల పక్షాన్నే రాజకీయ నాయకులు అధికారులు ఉండడంతో 'ఏజెంట్' అనుమతితో భూములు కొన్నారని రికార్డులు సృష్టించే ప్రయత్నాలు జరిగాయి. నిజానికి 1917 లో ఏజెంట్ ఎవరికీ అందుబాటులో లేరు. ఏజెంట్ అనుమతి పొందే విధానాన్ని వివరణ రూపొందలేదు. ఏజెంట్ అనుమతికి సంబంధించిన ఏ రికార్డు కూడా లేదు. ప్రభుత్వం అనేక సందర్భాల్లో రూపొందించిన రిపోర్ట్‌లలో ఏజెంట్ అనుమతితో భూములు బదిలీ చేసుకున్న గిరిజనేతరుల కేసును చాలా బాగా సమర్థించింది.

1959 రెగ్యులేషన్‌ను సమర్థవంతంగా సవరించే ప్రయత్నం 1970లో (ఆక్ట్ 1 ఆఫ్ 1970) జరిగింది. షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజనుడు గానీ గిరిజనేతరుడు గానీ, గిరిజనుడికి కాక ఎవరికీ భూమిని బదలాయించకుండా ఈ సవరణ పూర్తి నిషేధం విధించింది. దీంతో గిరిజనేతరుల మధ్య కూడా బదిలీలు చెల్లకుండా పోతాయి. అంతేకాదు గిరిజనేతరుడి ఆధీనంలో ఉన్న భూమి గిరిజనుడిదే అని, అది గిరిజనుడి నుంచి బదిలీ అయిందేననే చట్టపరమైన భావనను ఈ సవరణ కల్పించింది. తాను చట్టవరంగా భూమిని సంపాదించానని రుజువు చేసుకునే బాధ్యత గిరిజనేతరుడిపై పడింది. గిరిజనుడు తన భూమి తనదేనని రుజువు చేసుకోవడవం దాదాపు అసాధ్యం కనుక చట్టం ఈ విధమైన విచారణ పరమయిన విధాన మార్పులను కూడా తీసుకురావడం విశేషం. 1917 నుంచి షెడ్యూల్డు ప్రాంతాల్లో తమకు భూమి ఉందని గిరిజనేతరుల రుజువు చేసుకుంటే తప్ప గిరిజన భూమిని సొంతం చేసుకునే ఆస్కారం లేదు. అంతేకాకుండా అనేక చేతులు మారి భూములను గందరగోళంలో పడేయకుండా ఆ పేరుకు స్పష్టమైన రికార్డు కోసం గిరిజనేతరుల మధ్య బదిలీలను పూర్తిగా నిషేధించారు. షెడ్యూల్డు ప్రాంతాల్లో ఒక్క గిరిజనుడు మాత్రమే అదీ మరొక గిరిజనుడికి మాత్రమే ఆస్తిని అమ్ముకోవచ్చు. నిజానికి సాధారణ న్యాయ సూత్రాల ప్రకారం భూమి, లేదా ఆస్తి అన్న తర్వాత క్రయ విక్రయాలను, బదిలీలను నిషేధించడానికి వీలేలేదు. ఆస్తులు అమ్మకుండా కట్టిపడేయడాన్ని చట్టం సహించదు. కాని ఈ ఏజెన్సీ చట్టాలు ప్రత్యేకమైనవి. ఇవి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రత్యేక ప్రాంతాలకు పరిమితమైన గిరిజన ప్రయోజన సంరక్షక చట్టాలు. కనుక సాధారణ చట్టాలకు ఇవి మినహాయింపుగా అమలులో ఉంటాయి.

చిత్తశుద్ధిలేని సర్కారు.

కాని ప్రత్యేక చట్టాలను అమలు చేయడానికి ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండాలి. బ్రిటీష్ ప్రభుత్వం వలెనే మన ప్రభుత్వాలు కూడా గిరిజనులను మోసం చేసిన వారినే సమర్థించాయి. చట్టాలను అటకెక్కించాయి. ఈ రెగ్యులేషన్‌లను సమర్ధవంతంగా అమలు చేసిన అధికారులను బదిలీ చేశాయి. 1979లో ఖమ్మం జిల్లా కలెక్టర్ డి.సుబ్బారావును, 1986లో ఏటూరు నాగారంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఫణికుమార్‌ను, గిరిజనేతర రైతుల వత్తిడితో బదిలీ చేశారు. చాలామంది అధికారులకు ఇదే గతి పట్టించారు. గిరిజనేతరులు తాము ఆక్రమించిన గిరిజన భూములను రక్షించుకునేందుకు 1959, 1970 చట్టాల రాజ్యాంగబద్ధతను సవాలు చేశారు. వారు స్థిరాస్తులు సంపాదించే హక్కును ఈ చట్టం కాలరాస్తున్నదని వారు వాదించారు. ఆస్తుల స్వేచ్ఛమీద, ఇదొక అనవసర ప్రతిబంధకమని వాదించారు. 19వ శతాబ్దం చివరలో 20వ శతాబ్దపు మొదట్లో గిరిజన ప్రాంతాలకు వచ్చిన గిరిజనేతరులు వారి విశాల భూభాగాలను ఆక్రమించి, వారిని మోసం చేసిన సంఘటనల ఆధారంగా ఈ రక్షణ శాసనాలను చేయవలసి వచ్చిందని ప్రభుత్వం తన కౌంటర్‌లో పేర్కొంది. "కొంత డబ్బు ఇచ్చి, సెక్యూరిటీ కింద

అస్తులను కాజేశారు. కాగితాలు ఏవీ ఉండవు. వాటిమీద వడ్డీ 25 శాతం నుంచి 50 శాతం దాకా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో నూరుశాతం వడ్డీ వసూలు చేసిన దొంగలూ ఉన్నారు. గిరిజనులు ఇచ్చిన డబ్బుకు కనీసం వీరు లెక్క కూడా రాసేవారు కాదు. వడ్డీ వ్యాపారస్తుల మాటలను వారు అమాయకంగా నమ్మేవారు. అప్పు ఎప్పుడిచ్చారో ఎంత ఇచ్చారో తెలియదు. ఇచ్చిన వస్తువులు కొలతలో, బరువుల్లో మోసాలు, నాణ్యతలో మోసాలు ఉండేవి. గిరిజనులు కొనేటపుడు బాట్లు తక్కువ బరువని, గిరిజనేతరులు అమ్ముటపుడు బరువు ఎక్కువ బాట్లు వాడేవారు. బాకీ తీర్చకపోతే వెట్టిచాకిరీ చేయాలి. ఆ రుణం ఎప్పుడూ తీరదు. అస్తులు భూములు పోయి, చాకిరీ మిగిలేది. సొంత భూముల్లో గిరిజనులు వ్యవసాయ కూలీలుగా మారిపోయేవారు. బలవంతంగా కొన్ని భూములు గుంజుకున్నారు. గిరిజనులకు ప్రత్యేక హక్కులు ఉన్న విషయం కూడా తెలియదు" అని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ రెగ్యులేషన్ చట్టాలను సమర్థించింది. "గిరిజనులు ఈ అన్యాయాలు ఎదుర్కొనడానికి విప్లవకారులతో చేతులు కలపవలసి వచ్చింది. మళ్ళీ వారు విజృంభిస్తున్నారు. మైదానాలకు కూడా వారి విప్లవం విస్తరిస్తున్నది" అని కౌంటర్‌లో పేర్కొన్నారు.

కాని ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎస్.రాజాజీ ఫిబ్రవరి 17, 1977 నాడు సమర్పించిన ఒక నివేదికలో గిరిజన భూములు గిరిజనేతరుల చేతిలో ఉండడానికి కారణం ఏజెంట్ అనుమతి అని పేర్కొన్నారు. మొత్తానికి ఈ రెండు ప్రకటనలు బట్టి ఈ చట్టాలు అమలు కాలేదని అర్థమవుతుంది.

హెమండార్ఫ్ ఆవేదన

'ఆర్థికంగా బాగుపడిన తెలివైన వర్గాలు అమాయకులను మోసం చేయడానికి ఎప్పుడూ దాడి చేస్తూనే ఉంటారు' అని గిరిజన జీవితాలు అధ్యయనం చేసిన క్రిస్టఫ్‌వోన్ ప్యూరల్ హైమండార్ఫ్ తన గ్రంథంలో రాసారు. "భూమికోసం గిరిజన ప్రాంతాల్లో జొరబడిన ఈ అవసరవాదులు గిరిజనులు తమ భూమికోసం పోరాడే పరిస్థితి తీసుకువచ్చారు. వారి తాతలనాటి భూములలో వారే నౌకర్లయిపోయారు. భూమి లేని కూలీలైనారు" అని హైమండార్ఫ్ వాపోయారు. "అనాదివాసులైన గిరిజనుల జీవితాలను భారత పారిశ్రామికీకరణ నాశనం చేసింది" అని నిరాద్ సి.చౌదరి బాధపడ్డారు. ఈ మాటలన్నీ ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొని గిరిజనుల ఉద్ధరణ, ప్రత్యేక సంరక్షణ చారిత్రక అవసరం అని వివరించింది. సుప్రీంకోర్టు 1959, 1970 చట్టాలు రాజ్యాంగబద్ధం అని తీర్పు చెప్పి ప్రభుత్వ వాదంతో సమర్థించింది. గిరిజనుల అసలు భూములను వారికే ఇవ్వడంలో న్యాయమే ఉంది అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. గతం నుంచి పాఠాలు నేర్చుకుని ఈ సంక్షేమ శాసనంలో లోపాలు సరిదిద్దాలని సుప్రీంకోర్టు సూచించింది. ఏమీలేదని అమాయక గిరిజనులను, గిరిజనేతర మాయగాళ్ళను ఒకగాట కడితే కుంటివాడికి, బలవంతుడైన సకలంగాలకు మధ్య పోటీ పెట్టినట్టు ఉంటుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

గిరిజనేతరుల కొత్త మోసాలు

కాని లోపాలను సరిచేయడానికి ప్రభుత్వాలు ఇష్టపడడం లేదు. గిరిజనేతరులు కొత్త కొత్త మోసాలు కనిపెట్టారు. అమాయక గిరిజన మహిళలను రెండో భార్యగా, ఉంపుడు గత్తెగా స్వీకరించారు. ఆమె భూములు ఆమె పేరనే ఉంచి ఆమెతోపాటు ఆస్తులను అనుభవించారు. ఆమె పేరనే గిరిజనులకు ఇచ్చే అప్పులూ తీసుకున్నారు. మైదానాల్లో మొదటి భార్యతో, గిరిజన ప్రాంతాల్లో గిరిజన మహిళతో జీవితాన్ని పంచుకున్నారు. గిరిజనులను నౌకర్లుగా మార్చి భూములను వారి పేరనే నిలిపి, బినామీ ఆస్తులు అనుభవించారు. దొంగ ట్రైబల్ సర్టిఫికెట్లు సంపాదించి తద్వారా గిరిజనులను దోచారు. కనీసం షెడ్యూల్డు ప్రాంతాల్లో భూముల సర్వే కూడా నిర్వహించలేక పోయాయి ఈ ప్రభుత్వాలు. ఏ భూములు ఎవరివో చెప్పవలసిన రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, రెవెన్యూ గ్రామాధికారులు భూముల హద్దులు నిర్ణయించడంలో ఎన్ని గొడవలు సృష్టించారో ఎన్ని కీచులాటలు పెట్టారో చెప్పలేము. భూములు మార్చారు. లేనివారికి ఇచ్చారు. ఉన్నవారివి పీకారు. అమాయకుల బుర్రగొరిగారు. వీళ్ళు చేసిన అన్యాయాలకు ఉట్నూరు (అదిలాబాద్)లో ఒక ఉదాహరణను డాక్టర్ పి.వి. రమేశ్ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ 1995లో పేర్కొన్నారు. "కేవలం అయిదెకరాలున్న గిరిజనుడి భూమిని మిగులు భూమిగా మార్చారు. ఆ మొత్తం భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎందుకంటే అతని పేరు 148 ఎకరాలకు 'పట్టాదార్'గా పహణిలో అతనికి తెలియకుండా నమోదు చేశారు. మరోవైపు 'పట్టాదార్ కల్టివేటర్' పేరుతో ఒక వ్యక్తి, తనకు ఏ భూమి లేకపోయినా, 742 ఎకరాలకు నష్టపరిహారం సంపాదించారు. ఈ విధంగా సర్వేలేని భూముల్లో కరణాలు, పటేళ్లు, పట్వారీలు రెవెన్యూ లీలలు చూపి భూముల మోసాలు చేశారు. ఇటువంటి ఉద్యోగులు, అధికారులున్న చోట భూసంస్కరణల చట్టాలు, గిరిజన భూరక్షణ చట్టాలు అమలు కావడం అసాధ్యం. గిరిజన చట్టాలను అమలు చేయడం ఇష్టంలేని ప్రభుత్వాల వల్ల గిరిజన ఉద్యమాలు పుడతాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒకవైపు నుంచి వెలమలు, మరోవైపు నుంచి కమ్మవారు, వారి వెంట ఇతర కులాలవారు గిరిజనుల భూములు, జీవితాలు కబళించారు. కనీసం 7 లక్షల 51 హెక్టార్ల గిరిజనుల భూములు దురాక్రమణలో ఉన్నాయి. గిరిజన భూరక్షణ చట్టాలు ఏ మాత్రం అమలవుతున్నాయో చెప్పడానికి ఇదే ఉదాహరణ.

ఏ రక్షణ, సహాయం లేని కౌలు రైతులు-లోపమెక్కడ?

- డా॥ అరిబండి ప్రసాదరావు

ఏ రక్షణ, సహాయం లేని కౌలు రైతులు కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభంలో అత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటూ, ఆత్మహత్యలకు గురవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పండించే పంటను, చేసిన శ్రమను పూర్తిగానష్ట పోయినా, రెవెన్యూ రికార్డుల్లో వీరిపేర్లు లేవు అనే పేరుతో వీరికి ఏ సహాయం అందటం లేదు. సంస్థాగత రుణసౌకర్యం కూడా ఇదే పేరుతో అందటం లేదు. చివరకు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కిసాన్ క్రెడిట్' కార్డులు కూడా ఈ పేరుతోనే కౌలు రైతులకు అందుబాటులో లేవు. ప్రజాతంత్ర ఉద్యమం వత్తిడి తెచ్చినప్పుడల్లా, రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల ఎడ మొసలి కన్నీరు కారుస్తు, జాలి మాటలు పలుకుతూ, రెవెన్యూ రికార్డుల్లో కౌలు రైతులపేర్లు లేకపోవడమే ప్రధాన కారణమని చెబుతుంది. రికార్డుల్లో కౌలు రైతుల పేర్లు నమోదు చేయించవల్సిన బాధ్యత గల ప్రభుత్వం ఈ విషయంలో ఎందుకు వైఫల్యం అవుతుంది? లోపమెక్కడ వుంది? ఆలోచించాల్సిందే.

పని చేయని కౌలుదారుల రక్షణ చట్టం:

భూహక్కు రికార్డుల చట్టం 1971 రూపొందింది. దీనిలో కౌలుదారులను కూడా నమోదు చేయాలని నిర్దేశించబడింది. తదుపరి 1980 లో మార్పు చేసిన ఈ చట్టం అనుసరించే కౌలుదార్లకు కూడా ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుండి రుణం పొందే 'పాసు బుక్కును' కూడా ఇవ్వాలి. రెవెన్యూ రికార్డుల్లో 'కౌలుదార్ల' పేరు లేదనే పేరుతో వీరికి పాసు పుస్తకాలను కూడా ఇవ్వడం లేదు. ఇంత స్పష్టంగా చట్టం నిర్దేశిస్తున్నా, కౌలుదార్లు ఎందుకు నిర్లక్ష్యానికి గురి అవుతున్నారు? ఇది మరో ముఖ్యమైన ప్రశ్నే.

గత అనుభవం:

నిజాం ఫ్యూడల్ వ్యవస్థపై జరిగిన తెలంగాణా సాయుధపోరాటం ఫలితంగా, అప్పటి తెలంగాణ ప్రాంతంలో ఉన్న కౌలు రైతులకు పూర్తి రక్షణ కలిపిస్తూ, పాత రైతును ఏ ఆసామి తొలగించలేని విధంగా 1950లో కౌలు మరియు వ్యవసాయ భూముల చట్టం (1950లో 21వ చట్టం) అప్పటి ఆంధ్రప్రదేశ్ శాసనసభ రూపొందించింది. ఈ చట్టం సెక్షన్ 5(ఎ) ప్రకారం వ్యక్తిగత సేద్యం గాక, పాలేరు కాని ఏ ఇతరులు సేద్యం చేస్తున్నా, వారిని కౌలుదారులుగా కొన్ని నియమాలకు లోబడి, పరిగణించాలని నేరుగా ఆదేశించబడింది. ఇలా కౌలుదార్లుగా పరిగణింపబడ్డ వారిని భూకామందులు తొలగించి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోలేని విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి. నామ మాత్రపు కౌలు నిర్ణయించబడింది. కౌలుగా మెట్ట, చెలక భూములకు 4 రెట్ల శిస్తు, నల్ల రేగడి భూములకు 5 రెట్లు, మాగాణి భూములకు 4 రెట్ల శిస్తు నిర్దేశించబడింది. ఆసామి తన భూమిని అమ్ముకోవడానికి ప్రథమ ప్రాధాన్యతగా కౌలుదారురే అమ్మాలని, కౌలు రైతు "కొనను" అన్నప్పుడే ఇతరులకు అమ్మాలని నిర్దేశించబడింది. 1948 పూర్వం 6 సంవత్సరాల కౌలు చేసిన ప్రతిరైతును రక్షిత కౌలు రైతుగా గుర్తించబడ్డాడు. రక్షిత కౌలు రైతు నుండి భూమిని స్వంత సేద్యానికి కూడా, అదీ 3 కుటుంబ కమతాల కన్నా తక్కువ వున్న సందర్భాలలో, కలెక్టరు పూర్వానుమతితో మాత్రమే తిరిగి పొందగలడు. (ఈ అనుమతి లభించడం అంత తేలిక కాదు). కొంతకాలం తరువాత, రక్షిత కౌలు రైతుకు భూమిపై పూర్తి హక్కు ఇవ్వబడింది. కౌలు రైతులకు ఇంత మంచిగా ఉపయోగపడే చట్టాన్ని రూపొందించిన శాసనసభ ఆంధ్రప్రాంతం రైతులకు ఎందుకు విస్తరించలేక పోయిందనేది మొదటి ప్రశ్న. తెలంగాణా ప్రాంతంలోనే ఆ తరువాత వచ్చిన రైతులకు, ముఖ్యంగా ఈ తరుణంలో, కౌలు రైతులకు ప్రభుత్వం ఎందుకు రక్షణ కలిపించలేకపోయిందనేది రెండవ ప్రశ్న. ఈ రెండు ప్రశ్నలకు ఒకే సమాధానం. ప్రభుత్వానికి కౌలు రైతులకు రక్షణ, సహాయం అందించాలనే రాజకీయ సంకల్పం లోపించడం, వర్గ ప్రయోజనం మొదటి కారణం. ప్రభుత్వాన్ని ఒప్పించడానికి అవసరమయిన బలంగల ప్రజా ఉద్యమం లేకపోవడం రెండవ కారణంగా చెప్పవచ్చు. కౌలుదార్లకు రక్షణ కల్పించి, సహాయం అందించడంలో పశ్చిమ బెంగాల్ వామపక్ష ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ బర్గా' దేశానికంతకీ మార్గదర్శకంగా నేడు ఉన్నది.

"ఆపరేషన్ బర్గా:

బెంగాలీ భాషలో కౌలుదార్లను 'బర్గాదార్లు"గా పిలుస్తారు (అంటే పాలు దార్లు) 1946-50 మధ్య నడిచిన 'తెభాగా' ఉద్యమం ఫలితంగానే 1950లో 'బర్గాదార్ల' రక్షణపై ప్రత్యేక చట్టం రూపొందించబడింది. ఈ చట్టం క్రింద బర్గాదార్లకు భూమిపై ఏ మాత్రం హక్కులేదు. కేవలం వారసత్వంతో కూడిన సేద్యం చేసే హక్కు బర్గాదార్లకు కలిపించబడింది. ఒకవేళ ఆసామి స్వంత సేద్యానికి బర్గాదారునుండి భూమి తిరిగి పొందాలనుకొంటే, కొన్ని కఠిన షరతులకు లోబడి, అదీ రెవెన్యూ అధికారుల పూర్వానుమతితో, పొందగలడు. 1950 ముందు ఉత్పత్తి ఖర్చు బర్గారైతు పెట్టుకొంటే, పండిన పంటలో 50% ఆసామికి ఇవ్వాల్సి వచ్చేది. బర్గాదారు రక్షణ చట్టం చేసిన తరువాత, ఆసామికి ఇచ్చే కౌలు, క్రమంగా పంటలో

25 శాతానికి తగ్గించబడింది. అయితే, ఇక్కడ కూడా 'బర్గారైతు' పేరు రికార్డులోకి ఎక్కాలి. అప్పుడు అధికారం చేబట్టిన కాంగీ ప్రభుత్వం బర్గాదార్ల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించడానికి ఏ చర్య తీసుకోలేదు. శ్రద్ధ చూపలేదు. రాజకీయ సంకల్పం లేకపోవటమే దానికి ప్రధాన కారణం. తమ పార్టీ వర్గ ప్రయోజనం రెండవ కారణం. వామపక్ష ప్రభుత్వం 1977లో తిరిగి అధికారంలోకి వచ్చేంత వరకు బర్గాదార్ల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించడానికి చేబట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'ఆపరేషన్ బర్గా'

ఈ కార్యక్రమం క్రింద మొదటి 'బర్గాదార్లు' అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. ఇట్టి ప్రాంతాలలో సాయంత్రం బర్గాదార్లు, ఆసాములు మరియు ఇతర గ్రామస్థులతో బర్గాదార్లలో భయాన్ని పోగొట్టాలనే ప్రధాన ఉద్దేశంతో సమావేశాలు జరిపారు. ఈ సమావేశాలలో రెవెన్యూ అధికారులు బర్గాదార్లకు తమ పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకోవడం వల్ల వచ్చే లాభాలను తెలిపారు. తెల్లవారి దీనికై బర్గాదార్లనుండి దరఖాస్తులను కూడా స్వీకరించారు. ఆ తెల్లవారే, రెవెన్యూ అధికార్లు గ్రామంలో విచారణ జరిపి, బర్గాదార్లుగా గుర్తించిన వారికి మూడు రోజుల లోపుల గుర్తింపుకు అనుగుణంగా ఒక సర్టిఫికేటును ఇచ్చారు. ఆ తరువాత, సాధ్యమైనంత త్వరలో రెవెన్యూ రికార్డుల్లో బర్గాదారు పేరు నమోదు చేసి, రికార్డ్ ఆఫ్ రైట్ (భూమి హక్కు రికార్డు) ను ఇచ్చారు. ఇలా వాస్తవంగా సేద్యం చేసే బర్గాదార్లకు రక్షణ కల్పించడం వల్ల, పశ్చిమ బెంగాల్ గ్రామీణ ప్రాంతాలలో సామాజిక ఆర్థిక స్థితిగతుల్లో ఎంతో వేగంగా అభివృద్ధి వీలయింది. 1978-2001 మధ్య ఇలా 10 లక్షలకు పైగా బర్గాదార్లకు రెవెన్యూ రికార్డులో నమోదు చేయగా, 1977-82 మధ్య 5 సంవత్సరాల కాలంలో 7.11 లక్షల మంది, ఆ తరువాత 3 సంవత్సరాల కాలంలో (1983-86 మధ్య) 1.55 లక్షల మంది మరియు 1987-2001 మధ్య (15 సంవత్సరాల కాలం) 1.35 లక్షల మంది బర్గాదార్ల పేర్లు నమోదు చేయబడ్డాయి. అయితే అక్కడి వామపక్ష ఉద్యమం పేద కౌలు రైతుల పక్షాన ఉండి, అధికారిక, గ్రామాల్లో అనధికారంగా ప్రత్యక్షంగా ఎంతో సహాయం అందించినా, ఇంతగా కృషి చేసినా, పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ పంచాయితీ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ, చక్రవర్తి ఇతరుల ద్వారా జరిపిన అధ్యయనం ప్రకారం (ఈ నివేదిక 2003 లో విడుదల అయింది) మొదటి నిర్దేశించిన లక్ష్యంలో, 17.3 శాతం బర్గాదార్లకు ఇంకా రికార్డుల్లో నమోదు చేయలేదు. (నివేదిక పేజి. 120) నమోదు చేసిన బర్గాదార్లలో 25 శాతం పైగా బర్గాదార్లు ఇంకా అభద్రతా భావంతో ఉన్నారని కూడా ఈ అధ్యయనంలో తేలింది. (పేజి.115) ఈ వివరాలు వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ అసంపూర్తి విజయాలను, సమస్య జటిలత్వాన్ని తెలియచేస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో, ఈ చిన్న కమతాల రక్షణకై అవసరమయిన విధాన వ్యూహాన్ని రూపొందించి, అమలు చేయాలి. ఇది వేరే అంశం.

మన రాష్ట్ర పరిస్థితి:

కారణాలేమయినప్పటికి, కౌలు రైతులు మన రాష్ట్రంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్నారు. ఈ విషయంలో లెక్కలు లేవు. అనధికార అంచనాల ప్రకారం క్రిష్ణ, గుంటూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కౌలురైతులు 60 శాతం పైగా భూమిని సేద్యం చేస్తున్నారు. మిగతా జిల్లాల్లో కూడా కౌలు రైతులు వేగంగా విస్తరిస్తున్నారు. రికార్డుల్లో ఎక్కించనప్పుడు, వివరాలు ఎలా ఖచ్చితంగా తెలుస్తాయి? వారందరు అభద్రతతో సేద్యం చేస్తున్నారు. ఎక్కడ భూ ఆసాములు కౌలు భూమిని లాక్కుంటారో అని భయంతో కౌలు రైతులు ఆసాములు పెట్టే అన్నీ షరతులకు ఒప్పుకొంటున్నారు. కౌలు కూడా చాలా అధికంగా ఉన్నది. డెల్టా ప్రాంతాలయిన తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణ జిల్లాలలో రెండు పంటలకు కలిపి అత్యధిక కౌలు ఎకరానికి 35 బస్తాలవరకు ఉన్నది. 28-33 బస్తాల కౌలు ఈ ప్రాంతాలలో సర్వ సామాన్యం. చెరుకు కౌలు ఎకరానికి 22 టన్నుల ప్రాంతంలో ఉన్నది. ప్రత్తి భూముల కౌలు రు.5000-7000 మధ్య ఉంటుంది. జొన్న, కంది లాంటి పైర్ల భూముల కౌలుకు 2000-2500 మధ్య కలదు. తెలంగాణా మాగాణి ప్రాంతాలలో 7-10 బస్తాల మధ్య ధాన్యం కౌలు ఉంటుంది. చట్ట ప్రకారం ఇచ్చే కౌలు పండిన పంటలో 3వ భాగమే. పండే గడ్డి కౌలు రైతుకే పూర్తిగా చేరుకుంటుంది. అందువల్ల, ఇపుడు కౌలు రైతుకు అంతిమంగా మిగిలేది పంట బాగా పండినప్పుడు, చేసిన శ్రమకు కూలి మాత్రమే. పంట దెబ్బ తిన్నప్పుడు, చేసిన శ్రమకు ఫలితం కూడా దక్కకపోవచ్చు. అయినా, మిగిలే గడ్డితో పాడి పశువులను పెంచుకొని కొంత ఆదాయాన్ని కుటుంబ పోషణకు పొందుతున్నాడు. అయితే, బయట వారి సేద్యాన్ని వ్యవసాయ కూలీగా పోయి చేసేదాని కన్నా, స్వంత సేద్యంతోనే పని చేసే కౌలు రైతుకు సాంఘిక గౌరవం, గుర్తింపు అధికంగా ఉంటుంది. అందువల్ల, కౌలు రైతుగా ఆదాయం అంతగా లేకపోయినా, కౌలు రైతు కొనసాగక తప్పని పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణాలో కొత్తగా ఏ కౌలుదారునూ రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించడం లేదు. ఆంధ్రా ప్రాంతంలో కౌలుదార్ల రక్షణకై 1956లోనే చట్టం రూపొందించినా, చట్టంలో ఉద్దేశ పూర్వకంగా ఉంచిన లోపాలవల్ల, ఏ కౌలుదారుకు ఈ చట్టం ఉపయోగపడలేదు. అలాగే, 1971 భూహక్కుల రికార్డుల చట్టాన్ని 'రాష్ట్ర మొత్తానికి వర్తించేలా రూపొందించి, 1980లో సవరించినప్పటికి, ఈ చట్టాలలో 'కౌలుదార్ల పేర్లను' నమోదు చేయాలని నిర్దేశిస్తున్నప్పటికి, కౌలుదార్ల విషయాల్లో

మాత్రం ఏ చట్టం అమలు కావడం లేదు. దీనికి ప్రధాన కారణం ఎన్నికై పాలించిన, పాలించే రాజకీయ పార్టీలకు కౌలుదారులకు రక్షణ కలిపించాలనే లక్ష్యం కాని, ఆ అవసరం కాని లేకపోవడమే. పైగా, తెలుగుదేశ ప్రభుత్వ కాలంలో దేవాలయ భూములను కౌలుదారుల (రక్షణ) చట్టం నుండి తొలగించి, ఎక్కడైనా కొద్దిగా నమోదయి ఉన్న కౌలుదార్లకు ఉన్న రక్షణ తీసి వేసింది. పైగా వాస్తవంగా సేద్యం చేస్తున్న అసలు కౌలుదార్లను రికార్డుల్లో నమోదు చేయకానికి కూడా నిరాకరించింది. కొత్తగా అధికారం చేబట్టిన కాంగ్రెసు, ఈ పార్టీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఏమాత్రం ఉత్సాహం చూపడం లేదు. తెలుగుదేశం పార్టీ దేవాలయ భూములను వేలం ద్వారా అమ్మి వేయడానికి సిద్ధం చేసింది. వామపక్ష ఉద్యమం దీనిని ఆపగలిగింది. వ్యవసాయరంగ కార్పోరేటీకరణలో భాగంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చిన్న కమతాలను కలిపి వేసి పెద్ద కమతాలుగా మారేందుకు వీలుగా లీజు అగ్రిమెంట్లు, కౌలు చట్టాలను సవరిస్తానని ఒక విధాన పత్రాన్నే 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' పేరుతో విడుదల చేసింది. ఈ మార్పుల ఉద్దేశం ప్రస్తుత కౌలుదార్లకు రక్షణ కలిపించి, సహాయం చేయడానికి గాదు. ఈ మార్పులన్నీ 'కంపెనీలకు' సహాయం చేయడానికే ఉద్దేశించినవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తామంటున్న కాంట్రాక్టు సేద్యం కూడా కౌలు రైతుల రక్షణకు దోహద పడదు.

కొత్తగా అధికారం చేబట్టిన కాంగ్ర ప్రభుత్వం దేవాలయ భూముల కౌలు రైతులకు రక్షణ కలిపించలేదు. రికార్డులు వాస్తవంగా సేద్యం చేస్తున్న కౌలు రైతుల పేర్లు నమోదు చేయడానికి అంగీకారం తెలుపలేదు. వేలం పాటలను వాయిదా వేసింది.

కేంద్రీకరించి పని చేయాల్సిన ప్రజాతంత్ర ఉద్యమం:

తెలంగాణా సాయుధపోరాట అనుభవం గాని, పశ్చిమ బెంగాల్ వామపక్ష ప్రభుత్వ అనుభవాలు, ఇంతవరకు మన రాష్ట్ర ప్రభుత్వ అనుభవాలు గమనించి విశ్లేషించితే, సమరశీలమైన వామపక్ష ప్రజాతంత్ర శక్తులు, వారి వారి ఉద్యమం కౌలుదార్లకు రక్షణ కలిగించగలవని భావించవచ్చు. కాని దురదృష్టం, ఈ దిశగా కృషి ఆశించిన మేర, అవసరానికి తగ్గ విధంగా లేదని భావించాల్సి వస్తుంది. భూసంస్కరణల అమలు గురించి ప్రచారం చేసే ఈ శక్తులు కౌలుదార్లకు రక్షణ కలిపించాల్సిన ఆవశ్యకతను అదే ప్రాధాన్యతతో గుర్తిస్తున్నట్లుగా అగుపడటం లేదు. (కనీసం ఈ విషయంలోనైనా) ఈ శక్తులు ఐక్యంగా వ్యవహరించినపుడే భయంతో కౌలుదార్ల ఉద్యమంలో చేరలేని కౌలుదార్లకు ధైర్యం వస్తుంది. ఆమేర కౌలుదార్ల రక్షణ ఉద్యమం బలపడి, పుంజుకొంటుంది. కౌలుదారుల ఉద్యమం బలపడిన మేర, పాలకవర్గాలు కూడా కౌలు రైతులకు సహాయం అందించే విషయం తమ వైఖరిని పునరాలోచించుకోవాల్సిన స్థితి ఏర్పడుతుంది. అపుడే, కౌలుదార్లకు రక్షణ, సహాయం లభిస్తాయి.

✤

(28వ పేజీ తరువాయి)

ఎంతవరకు తోడ్పడుతుందో ఇపుడు పరిశీలించాలి. 1960 దశకంలో 60 శాతం ఆదాయం ఈ రంగంనుండి వస్తే అది ఇప్పుడు 25 శాతానికి పడిపోయింది. గాని ఈ రంగం పై బ్రతికే జనాభా పెద్దగా తగ్గలేదు. అంటే ఎక్కువమంది తగ్గుతూ వస్తున్న ఆదాయాన్ని పంచుకుంటున్నారు. ఇందులో దళితుల పరిస్థితి ఏమిటి? 1960 దశకంలో సుమారు 55 శాతంమంది దళితులు వ్యవసాయ కార్మికులుగావుంటే ఇప్పుడు 85 శాతానికి పెరిగారు. మిగతా కులాలకు సంబంధించి ఈ గణాంకాలు లభించనప్పటికీ ఆంధ్రరాష్ట్రంలోని కోస్తాజిల్లాల్లో జరుగుతున్న మార్పుల గూర్చి మనందరికీ తెలుసు.

ప్రభుత్వం ఇచ్చిన నీరు ఎరువులు తదితర సబ్సిడీల ద్వారా లాభం పొందిన క్రిష్ణా, గోదావరి డెల్టా రైతాంగం ఇప్పుడు భూముల మీద ఆధారపడి లేదన్నది అందరికీ తెలుసు. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 60 వేల ఎకరాలు చేపల చెరువులక్రింద మార్చేశారు. కొంతమంది భూకామందులు, రైతులు భూములను అమ్మేసి వీలున్నచోట్ల కౌలుదార్లను ఏర్పాటు చేసుకొని పట్టణాలకు వలసపోయారు. నూతనంగా వచ్చిన అవకాశాలను, వ్యాపారాలను, పెరుగుతున్న ఆర్థికంగా వెసులుబాటు గల సేవారంగాల్లో స్థిరపడిపోయారు. విద్యకు ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను దళితులకంటే వీరికే ఎక్కువ లాభాన్ని చేకూర్చాయి. తద్వారా పిల్లలను విదేశాలకు పంపించుకోగలిగారు. పండిరాని భూములు, ఉత్పత్తి ఖర్చులు పెరిగి తడిపిమోపిడౌతున్న వ్యవసాయరంగాన్ని ఎలా వదిలించుకొందామా అనే రైతులు ఎంతమంది? ముఖ్యంగా నూతన ఆర్థిక విధానాలు ప్రపంచీకరణ వచ్చిన తరువాత ఆ వ్యవసాయరంగం వైపు ప్రభుత్వం చూడటం మానేసింది. గతంలో వచ్చిన సబ్సిడీలు రాకుండా పోతున్నాయి. ఇప్పుడు భూములెవరికి కావాలి? ఎదుగూ బొదుగూ లేకుండా, ఎటువంటి నైపుణ్యాన్ని చేజిక్కించుకోలేని స్థితిలో నిరక్షరాసులుగా వున్న వృత్తులకు సంబంధించిన జ్ఞానం కొరగాకుండా మిగిలిపోయే దళిత, బడుగు జనాలకు మళ్ళీ తల్లిలా ఆదుకునే వ్యవసాయ రంగమే ఆధారమయింది. ఈ లోపు ప్రైవేట్‌రంగం ముఖ్యంగా బహుళజాతి సంస్థల అధీనంలో నడిచే వ్యవసాయ రంగంవైపు వీరు ఆకర్షింపబడ్డారు. ఇప్పుడు భూసంస్కరణలు తెచ్చి భూమిని దళితులకిచ్చి ఏంచేస్తారు. 110 సంవత్సరాల క్రితం అంటరానివారికి భూమితోబాటు చిన్న నూతులు కూడా ఇవ్వాలనే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకుండే గుణం నేటి నయాం సామ్రాజ్యవాదుల"కుందా? అయితే భూములివ్వండి! వాళ్లేం చేసుకుంటారో చూద్దాం!!

✤

భూ సంస్కరణలను చేపట్టకుంటే చరిత్ర హీనులవుతారు

భూ సంస్కరణల పూర్వాపరాలు

- విద్యాభూషణ్

'ఆరు నుద్దైనా- నూరు ఆరైనా ఆర్థిక సంస్కరణలను అమలు పర్చి తీరుతాం' అని తొడగొట్టి విర్రవీగిన వారిని మొన్నటి ఎన్నికల్లో సప్త సముద్రాలకవతల పారేశారు ఓటర్లు. మిగులు భూములను భూమి లేని నిరుపేదలకు నిరాటంకంగా పంచిపెడతాం, పేదవారి ఇక్కట్లను తీర్చడమే తమ ప్రధాన లక్ష్యం అన్న వారిని అందల మెక్కించారు. పేదల సమస్యలకు పరిష్కారంగా భూసంస్కరణలను అమలుపర్చాల్సిందేనన్న వామపక్షాలు తమ వంతు గౌరవాన్ని కాపాడుకో గలిగారు.

భూసంస్కరణలంటే ఏమిటి? సూక్ష్మంగా సూటిగా చెప్పుకోవాలంటే కౌలుదార్ల, సన్నకారు రైతుల, వ్యవసాయ కూలీల మేలును దృష్టిలో వుంచుకొని భూమిని పునఃపంపకం చేయడమే. దాన్నే ఐక్యరాజ్యసమితి కాస్త విస్తృతపర్చి చెప్పిందేంటంటే.. "భూమి పునఃపంపకం మాత్రమే కాక, కౌలు పరిణామ నిర్ణయం, కౌలుదారుల భద్రత, వ్యవసాయ కూలీల వేతన నిర్మాణం, వ్యవసాయ పరపతి మార్గాల అభివృద్ధి, భూమి పన్నుల విధాన పెరుగుదల, సహకార సంస్థల అభివృద్ధి, వ్యవసాయ విధాన బోధన, వ్యవసాయంలో సాంకేతిక మార్పులు" మొదలైన వన్నీ భూసంస్కరణలుగానే చెప్పి వాటి ఆవశ్యకతను పరిధిని మరింత విస్తృతం చేయడం జరిగింది.

వ్యవసాయరంగం ఆశించిన దిశలో అభివృద్ధి చెందలేకపోవడానికి కారణం వ్యవస్థాగత అంశాలే కీలకం. అందువల్ల నిర్మాణాత్మకంగా భూసంస్కరణలను అమలు పర్చాల్సిందే. భూయాజమాన్యంలో అసమానత, భూకేంద్రీకరణ, లాభసాటిగా లేని కమతాలు, హెచ్చు కౌలు, కౌలుదార్ల అభద్రత, గ్రామీణ రుణ సమస్య లన్నింటికీ, ఈ భూసంస్కరణలే సమాధానం చెప్పగలుగుతాయి.

ఇక మన ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల ఆవశ్యకతను గమనిస్తే, నేటి రాష్ట్రం నాడు రెండు తరహాల భూస్వామ్య వ్యవస్థలో ఇరుక్కొంది. ఒకటి బ్రిటీష్ వారి విధానం, రెండోది నైజాం తీరు. ఈ రెండూ జాగిర్దారీ లేదా జమిందారీ పద్ధతులే. రెండోది రైత్వారీ పద్ధతి. అయితే 1853లో కార్ల్ మార్క్స్ బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన ఈ విధానాలు రెండూ పరస్పర విరుద్ధమైనవని ప్రకటించాడు. ఒకటి పెత్తందారీ వ్యవస్థ రెండోది ప్రజాతంత్ర వ్యవస్థ. ఈ రెండిటి లక్ష్యం మాత్రం భూములపై పన్నులు రూపేణా ప్రభుత్వాలకు ఉపయోగపడే సాధనాలుగా రూపొందించారనీ విశ్లేషించాడు మార్క్స్.

హైదరాబాద్ రాష్ట్రంలో భూస్వామ్య విధానం:

నైజాంకు ప్రత్యేక సేవ చేసిన వారికి ఉచితంగా ఇచ్చేసిన గ్రామాలను జాగీర్లనే వారు. హైదరాబాద్‌లో 6,535 గ్రామాల్లో 40 వేల చదరపు మైళ్ళ విస్తీర్ణం వరకూ వ్యాపించి ఉండేది. 1922లో జాగీర్లసంఖ్య 1,167 వుండగా 1949 నాటికి 1,500 వరకూ పెరిగాయి. ఇవి కాక సంస్థానాలు వుండేవి. చిన్నచిన్న ప్రాంతాలకు అధిపతులుగా చెప్పుకున్న రాజుల హక్కుల నంగీకరించడానికి నైజాంకు ఏటా నిర్ణీత మొత్తాన్ని చెల్లించేవారు. వారికాప్రాంతాల్లో విస్తృతమైన అధికారాలుండేవి కనుక కొల్లగొట్టుకునే వారు. ఈ తరహా 497 గ్రామాలు- 5030 చదరపు మైళ్ళ విస్తీర్ణం. తరువాత రూపం ఇనాందార్లు. కొన్ని సేవల గుర్తింపుకు బహుమానంగా భూములను ధారాదత్తం చేయడం. ఆ భూములనుంచి వచ్చే శిస్తులను పూర్తిగానో పాక్షికంగానో పొందే హక్కు ఈ ఈనాందారుకుండేది. హైదరాబాద్ సంస్థానంలో ఇనాందారుల సంఖ్య 82 వేలుండగా, వీరి ఆధీనంలో 8 లక్షల ఎకరాల భూమి వుండేది. ఇక మిగిలింది 'సర్ఫేఖాస్' అంటే నిజాం వారి స్వంత ఖర్చులకోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. సుమారు 1,374 గ్రామాల్లో 5,682 మైళ్ళ విస్తీర్ణంలో వుండేవి.

హైదరాబాద్ ప్రాంతంలో మొత్తం సేద్యంలో 60 శాతం ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద వుండేది. 1875 నాటి సర్వే సెటిల్‌మెంటుతో వేల ఎకరాలను తమపేరుమీద రాయించుకుని పెద్ద పెద్ద భూస్వాములుగా శిస్తులను వసూళ్ళు చేసే దేశ్‌ముఖ్‌లు అవతరించారు. వీరు అమలు చేసిన 82 రకాల నిర్బంధ వసూళ్ళలో ఉత్పత్తితో సంబంధంలేని భూమిశిస్తు ప్రధానమైంది.

ఆంధ్రప్రాంతంలో భూస్వామ్య పద్ధతులు:

ఈ ప్రాంతంలో కూడా జమిందారీ, ఇనాందారీ రైత్వారీ పద్ధతులుండేవి. జమిందారీ పద్ధతి అంటే 1802లో మద్రాసు రాష్ట్రం జారీచేసిన శాశ్వత శిస్తు విధాన చట్టాన్ని అనుసరించి జమిందార్లకు వంశపారపర్య హక్కును అంటగట్టారు. మద్రాసు ప్రెసిడెన్సీలో వున్న మొత్తం జమిందారీ భూముల్లో 70 శాతం (152 లక్షల ఎకరాలు) మన ఆంధ్రప్రదేశ్ లోనివే. వీరు ప్రభుత్వానికి చెల్లించేదానికన్నా రైతులనుంచి అనేక రెట్లు అధికంగా శిస్తు పేరిట వసూలు చేసేవారు. వ్యవసాయ అభివృద్ధి అనేది మాట మాత్రంగానైనా తలెత్తేదే కాదు అందిన మేరకు దోచుకోవడమే లక్ష్యం.

ఇనాందారీ

హైదరాబాద్ రాష్ట్రంలో లాగే ఇక్కడా పల్లకీమోతలు మోసేవారికి ఇచ్చే బహుమానం.. 2.10 లక్షల ఎకరాలు ఇది ఈనాంల రూపేణా వుండేది.

రైత్వారీ విధానం

భూమిని సాగుచేసే రైతు ప్రత్యక్షంగా చెల్లించాల్సిన శిస్తు 1972లో థామస్ మన్రో ప్రవేశపెట్టాడు. భూసారం, ఉత్పత్తి, వ్యయం దృష్టిలో పెట్టుకొని శిస్తు నిర్ణయం జరిగేది-ఓ పాతిక ముప్పై ఏళ్ళకోసారి. మళ్ళీ ఇక్కడా వర్గ పక్షపాతమే. జమీందార్లు ఎకరానికి నాలుగణాలు అంటే 25 పైసలు చెల్లిస్తే రైతులు మాత్రం ఎకరానికి 2.50 రూపాయలు చెల్లించాలన్నది న్యాయబద్ధంగా వుండేది. ఫలితం ఇప్పటి రైతుల దారుణ పరిస్థితే నాడుకూడా. రుణభారం, అమ్మకాలు, తనఖాలు, వడ్డీవ్యాపారుల ప్రాబల్యం, పెద్ద భూస్వాముల ధనదాహం. సన్న, చిన్నకారు రైతుల భూములు ,పెద్ద భూస్వాముల ఖాతాల్లోకి చేరిపోయాయి, వాగుల్లో నీరంతా సముద్రం పాలయినట్టు. 1931-34 లోనే సుమారు కోటి ఎకరాలు చేతులు మారినట్టు ఒక అంచనా. 1951 నాటి జనాభా లెక్కల ప్రకారమే వ్యవసాయం చేయని యజమానులు 12.5 లక్షల మంది.

ఈ తరహాలో అటు నైజాం, ఇటు ఆంధ్రాప్రాంతంలోనూ భూస్వామ్య విధానాలు అత్యంత నిరోధకంగా మారాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ మధ్యవర్తుల తొలగింపు అత్యంత ఆవశ్యకమైయింది.

దారుణదోపిడీ-"కౌలుదారీ విధానం"

హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం హయాంలో 1354 ఫసలీ (1944)లో అసామీషకీ చట్టం అమలులోకి వచ్చింది. అసామీషకీ అంటే శాశ్వత కౌలుదారు. 12 ఏళ్ళు నిరాటంకంగా ఆ భూమికి కౌలుదారుగా వ్యవహరిస్తేనే శాశ్వత కౌలుదారుగా గుర్తింపు. ఈ ఫ్యూడల్ వ్యవస్థలో 12 ఏళ్ళు కౌలుచేయడం ఒక ఎత్తయితే దాన్ని నిరూపించుకోవడం మరో ఎత్తు. కాగా ఇక అందరూ అసామిషక్మిదారులు (రక్షణలేని కౌలుదార్లే) కౌలుదార్ల చట్టాలను సవరించకుంటే కష్టనష్టాలు తప్పవని యం.యస్.భరూచా 1937లో సూచించగా, 1354 ఫసలీ (1944) అమల్లోకి వచ్చింది.

ఆంధ్రప్రాంతంలో కౌలుదారీ చట్టం:

ఇక్కడ కూడా హైదరాబాద్ రాష్ట్రం మాదిరిగానే రెండు రకాల కౌలుదార్లుండేవారు. పేర్లు తేడా అంతే. భూస్వామి భూమి అమ్మాలనుకొంటే ముందు కౌలుదారుకి అవకాశం ఇవ్వడం వంటి స్వల్ప తేడాలుండేవి. మళ్ళీ కౌలు పరిమాణంలో పెరుగుదల, రక్షణ లేకపోవడం అంతటా ఒక్కటే. ఈ రెండు ప్రాంతాల్లోను కౌలు చెల్లింపులు ఒకే పద్ధతిలో కొనసాగేవి. మూడు ధోరణులు ప్రధానంగా: 1. పంటలో భాగం 2. పండించే పంటలో స్థిరమైన భాగం(ఉత్పత్తితో సంబంధం లేకుండా) 3. స్థిరమైన కౌలు ద్రవ్యరూపంలో.

వీటి అమలు కాలంలోనే భూమిని కౌలుకు తీసుకొనే క్రమంలోనూ, కౌలు పునరుద్ధరణ సమయంలోనూ రైతులు భూస్వాములకు కానుకలు సమర్పించుకునే సంప్రదాయం వుండేది. కాలక్రమేణా భూమిశిస్తు విశేషంగా పెరిగిపోవడం, జమీందార్ల అధికారబలం వలన, భూయాజమాన్యం సామాజిక చిహ్నంగా మారడం వల్ల, భూమి డిమాండు పెరిగి కౌలుదార్లు పెరిగారు. జమీందార్ల దోపిడీ నుండి రక్షణలేని పరిస్థితి వ్యవసాయాన్ని ఉత్సాహవంతంగా చేయలేని పరిస్థితి నెలకొంది. ఆర్థిక సంస్కరణలు పెట్టుబడిని పెంచేసిన కారణంగా నెలకొన్న పరిస్థితి తరహాలోనే. నిస్సారభూమిని ఉద్యానవనంగా మార్చేరైతు, ఏడెనిమిదేళ్ళ సేద్యం తరువాత ఎడారిగా మార్చేసిన పరిస్థితి నెలకొంది. వ్యక్తిగత యాజమాన్యం వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తే, ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుండటం వ్యవసాయాభివృద్ధికి దోహదపడదు. కారణంగా కౌలు సంస్కరణలకు ఆవశ్యకత ఏర్పడింది.

భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం భూవసతి కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమై పోయింది. భూగరిష్టపరిమితిని నిర్ణయించి, అసమానతలు తగ్గించాలనే లక్ష్యానికి బీజం పడింది. తద్వారా వ్యవసాయ రంగంలో స్వయం ఉపాధికి మార్గం సుగమనం అవుతుంది. భూకేంద్రీకరణ పెట్టుబడిదారీ తరహా సేద్యానికి దారితీసి ఉపాధి అవకాశాలను కుదిస్తుంది. నేటి కుప్పం ప్రయోగాలూ దీన్నే సూచిస్తున్నాయి. దీనికి పరిష్కారం చిన్నకమతాలైనా ఎక్కువమందికి యాజమాన్య హక్కుల్ని కల్పిస్తే ఉపాధి లభిస్తుంది. స్వంతభూమి అనే భావన హెచ్చు ఉత్పత్తికి దోహదపడే దాఖలానూ మనం గత చరిత్రనుండి పొందగలం.

పెద్దక్షేత్రాలను చిన్న కమతాలుగా విడగొడితే ఉత్పత్తి తగ్గొచ్చని, విక్రయానికి, మూలధన సేకరణకు విఘాతం కలుగుతుందని, భూస్వాముల నష్ట పరిహార చెల్లింపు ప్రభుత్వానికి భారమౌతుందని, భూమిలేని నిరుపేదలకు భూమినిస్తే పెట్టుబడి కొరత వల్ల సద్వినియోగం కావని, చిన్న సన్నకారు రైతులు తమకవసరమైన తిండి గింజలనే పండించడం వాణిజ్య పంటల కొరతకు దారితీస్తుందని, మిగులు భూములుగా ఎందుకూ పనికిరాని భూముల్నే చూపడంతో అధిక శ్రమా-పెట్టుబడి అవసరమౌతుందనే విమర్శలు మనముందున్నాయి. అయితే చిన్న కమతాలు సేద్యం అధిక దిగుబడికి అవరోధమౌతుందనే వాదనను జపాన్ అనుభవంతో ఆర్థర్ లూయిస్ తిప్పి కొట్టాడు. 1962లో డాక్టర్ మాన్ పంజాబ్‌లో పెద్ద కమతాల్లో కంటే చిన్న కమతాల్లోనే అధిక దిగుబడిని సాధించామని నిరూపించాడు. నష్ట పరిహార సమస్య ప్రభుత్వ ఖజానాకు భారమైనప్పటికీ దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా భరించవలసిందే. చిన్న కమతాల్లో సైతం ఆదాయం గరిష్టంగా వుండే పంటలకే ప్రాధాన్యత నిస్తారు. ఈ విరుద్ధాంశాలన్నీ చైనా, జపాన్, తైవాన్, ఈజిప్టు, అల్జీరియా వంటి దేశాల అనుబావాల ముందు నిలువ లేకుండా తేలిపోయాయి.

మొట్టమొదటి భూసంస్కరణలు(1947-1970)

స్వాతంత్ర్య సముపార్జనలో గ్రామీణ రైతాంగాన్ని భూగస్వామ్యం చేయాలనే గాంధీ యోచన సఫలమైంది. 1917-18లో బీహార్ చంపారన్ రైతు పోరాటం, ఖెడా జిల్లా రైతు విముక్తి పోరాటాలు,

గ్రామీణులను చైతన్యపర్చి, సహాయ నిరాకరణ, పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘనం వంటి ఉద్యమ స్ఫూర్తికి బాసటగానిల్చాయి. దీంతో 1928 నాటికి భూస్వామ్యాన్ని అంతమొందించి, రైతాంగం మీదనే దేశ భవిష్యత్ ఆధారపడి వుందని స్వయాన నెహ్రూయే పిలుపునివ్వడం గమనార్హం. దీని ఫలితంగానే 1931 కరాచీ కాంగ్రెస్ జమిందారీ వ్యవస్థ రద్దుకు తీర్మానించగలిగింది. 1936 ఎన్నికల మేనిఫెస్టోలో భూసమస్యల పరిష్కారం అగ్రభాగాన చోటుచేసుకుంది. ఎన్నికలనంతరం బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో కౌలుదార్ల రక్షణ, పాతబాకీలపై 'మారిటోరియం' అనివార్యమైయింది నేటి పరిస్థితిలాగానే. 1946 ఎన్నికల నాటికి వ్యవసాయ సంస్కరణల కమిటీల ఏర్పాటు, తద్వారా భూసంస్కరణల చట్టాలు పురుడు పోసుకున్నాయి. 1946 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారానికి వచ్చి 1947 నవంబర్ 28న జమిందారీ రద్దు బిల్లు శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగింది. కాలక్రమంలో హెచ్చు జమిందార్లు కాంగ్రెస్‌లో చేరడంతో.. కౌలుదార్ల సమస్యల పరిష్కారానికి 'దున్నేవాడికి భూమి' అనే నినాదం అమలు, భూసంస్కరణలపట్ల అమలుకు కాంగ్రెస్‌లో చిత్తశుద్ధి లోపించింది. కాంగ్రెస్ ఆధ్వర్యంలో అధికార మార్పిడి జరిగిపోయిందిగా. ఏరుదాటి తెప్ప తగలెయ్యడానికిదే అంకురార్పణ.

భూసంస్కరణలకై తపించిన రైతాంగ ఉద్యమాలు:

1832లో ఖోండుల తిరుగుబాటు, 1858లో గోదావరి ఏజెన్సీ, 1864 గంజాం ఏజెన్సీ, 1879 రంపపితూరీ, 1846లో కోయిలకుంట్ల, 1894 కృష్ణాజిల్లా రైతుల నీటి తీరువా పెంపుపై నిరసన మొదలైనవి ముఖ్యమైనవి. 1920 నాటికి జాతీయోద్యమస్ఫూర్తి రైతు సంఘాల ఏర్పాటుకు నాంది పలికింది. 1928లో ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం ఆచార్యరంగా నేతృత్వంలో ఏర్పడింది. 1931లో ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతుసంఘాలు, 1936 కాంగ్రెస్ నాటి (లక్నో) సభలో అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటు జరిగింది. నాటి రైతాంగ పోరాటాలు ఎప్పటిలాగానే ఒకవర్గం వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేదిగా వుంటే మరో వర్గం వారి హక్కులకోసం ఉద్యమించేందుకు దోహదపడ్డాయి.

1930లో ఆర్థిక మాంద్యం దృష్ట్యా రుణాలపై మారిటోరియం ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రాంతంలో అనేక పోరాటాలు జరిగాయి. జమిందారీ ప్రాంతాల్లో నెల్లూరు, వెంకటగిరి, చిత్తూరు, విశాఖ, శ్రీకాకుళం (బొబ్బిలి పర్లాకిమిడి, పలాసా, మందసా) పశ్చిమ గోదావరి (కాశీపట్నం, కలమపల్లి, పెండ్యాల, గోపాలపురం, పోతునూరు) కృష్ణా (చల్లపల్లి, ముక్త్యాల, తిరువూరు, మునగాల) జిల్లాల్లో పోరాటాలు జరిగాయి. వెట్టిచాకిరీ, అధిక శిస్తులనిరసిస్తూ, దౌర్జన్యాలను ఖండిస్తూ, హెచ్చు కూలీ కోసం, జిరాయితీ హక్కులకోసం ఈ పోరాటాలన్నీ కాంగ్రెస్ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. 1940 నుండి వామపక్ష వాదుల సంఖ్య పెరుగుతూ వచ్చి 1945 నాటి ఖమ్మం మహా సభలో నైజాంకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చే స్థాయిని అందుకుంది.

తెలంగాణా సాయుధ పోరాటం

ఈ మహత్తర పోరాటంలో పదివేల గ్రామదళ సభ్యులు రెండువేల గెరిల్లా సభ్యులతో కూడిన శక్తివంత సాయుధ బలగం 3000 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించగలిగింది. జాగీర్‌దార్లను దేశముఖ్‌లను వెళ్ళగొట్టి 10 లక్షల ఎకరాల భూముల్ని పునఃపంపిణీ చేసుకోగలిగారు. వ్యవసాయ కార్మికుల వేతనాలు పెరిగాయి. 12 నుండి 18 నెలల వరకూ మొత్తం గ్రామపాలన గ్రామీణ రైతు కమిటీల ఆధ్వర్యంలో నడిచింది. ఈ పోరాటంలో నాలుగు వేల కమ్యూనిస్టులు బలయ్యారు. పదివేలమందిని బంధించారు. ఈ పోరాటం ధాటికి నిజాం దిగిరాక తప్పలేదు. విప్లవాత్మక భూసంస్కరణ చట్టాలు చేపట్టారు.

1952 ఎన్నికల తర్వాత ప్రణాళికాసంఘ సూచనలమేరకు 1953లో హైదరాబాద్ కౌలు, వ్యవసాయ భూముల సవరణ బిల్లు వచ్చింది. ఈ శాసనంలో భూస్వాములు కౌలుదార్ల నుండి భూమి తీసుకునేందుకు కొన్ని నియమాలు సూచించారు. భూస్వామి తప్పనిసరిగా కౌలుదారుని కుటుంబ భృతి కోసం అవసరమైనంత కమతాన్ని వదిలి, కమతానికి మూడురెట్ల భూమిని తీసుకోవాలి. కౌలుదారు తాను సేద్యం చేసే భూమిని తానే కొనుక్కొనే వెసులుబాటు కలిగింది. భూస్వామికూడా ముందుగా కౌలుదారుకే అవకాశమివ్వాలి. ధర చెల్లింపులు కూడా ఒకేసారి గాని, ఎనిమిది సంవత్సరాల్లో 16 వాయిదాల్లో చెల్లించాలి. దీన్ని హైదరాబాద్ ప్రివెన్షన్ ఆఫ్ ఎవిక్షన్ ఆర్డినెన్స్ (1952) అంటారు. 1968 ఆగష్టు 15 నుండి అన్ని జిల్లాల్లో అమలుకు నిర్ణయించగా, భూస్వాములు కోర్టునాశ్రయించారు. లోపాలను తొలగించడానికి 1973లో నోటిఫికేషన్ జారీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ కౌలుచట్టం 1956 నుంచి అమలయ్యింది. దీని ప్రకారం ఉత్పత్తిలో 1/3 వంతు కౌలుగా, కౌలు ఒడంబడికలు ఆరేళ్ళపాటు అమల్లో వుండొచ్చు. ఆరేళ్ళ తరువాత భూస్వామి తన భూమి తీసుకోవచ్చు.

భూకమతాలపై గరిష్ఠ పరిమితి బిల్లు, చట్టంగా 1961లో వచ్చింది. భూములు చట్టపరిధిలోకి రాకుండా బినామీ పేర్లతో సురక్షితం అయ్యేందుకు వీలు కలిగింది. కుటుంబంలో ఒక్కోవ్యక్తి ఒక్కో యూనిట్‌గా తీసుకోవడడం మరో పచ్చి అవకాశవాదం. దేవాలయ భూములు, చెరుకు పండించే భూములు, కాఫీ, తేయాకు, రబ్బరు తోట పంటలకు సంబంధించిన భూములను చట్ట పరిధిలోకి రాకుండా రక్షించారు. వేలాది ఎకరాలను భూస్వాములు జమిందార్లు రక్షించుకోగలిగారు. ప్రభుత్వం భూస్వామ్య వర్గాలదే అయినందున విప్లవాత్మక నిర్ణయాలకు ప్రభుత్వం ముందంజ వేయలేదు.

ఈ విధంగా భూసంస్కరణలు నీరుగారిపోయిన తరువాత వాటి ఆవశ్యకతను గుర్తించేందుకు మూడు అంశాలు ప్రధాన కారకాలయ్యాయి. హరితవిప్లవ ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన

ఆర్థిక పరమైన మార్పులు. రాజకీయ రంగంలో వచ్చిన మార్పులు రైతాంగ పోరాటాలు. మొదటిరెండు కారణాల కన్నా, 1968-69 లో నక్సల్బరీ-శ్రీకాకుళ గోదావరీ లోయ ప్రాంతాల్లో వెల్లువెత్తిన మిలిటెంటు పోరాటాలు భూసంస్కరణల ఆవశ్యకతను వెలుగులోకి తెచ్చాయి. అధికార కాంగ్రెస్‌లో చీలిక, ఇందిరాగాంధీ ప్రజల్ని ఆకర్షించుకోవడానికి పావుగా 1973లో భూ గరిష్ట పరిమితి చట్టాన్ని తీసుకురావాల్సి వచ్చింది. ఈ చట్టాన్ని అమలు పర్చడం ద్వారా 20 లక్షల ఎకరాలు మిగులు భూములుగా వస్తాయని అంచనాలు వేయగా, ఆచరణలో 5 లక్షల పదివేల ఎకరాలను స్వాధీనం చేసుకుని ఎస్సీ, ఎస్టీలకు పంచామని ప్రభుత్వం చెబుతుంది. 1976లో హైకోర్టు భూస్వాములకు అనుకూలంగా తీర్పునిచ్చింది. రిజిస్టర్ కాకున్నా, తెల్లకాగితాల పై మార్పిడులు పేదల చేతుల్లోనూ మిగిలిపోయాయి. 1982లో హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ భూగరిష్టపరిమితి చట్టాన్ని బలపరుస్తూ 1982 మార్చి 5న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే ఏ రాష్ట్ర ప్రభుత్వమూ దీన్ని పరిగణనలోకి తీసుకోలే.

1985 మే నెలలో కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాల రెవెన్యూ మంత్రులతోనూ సమావేశం ఏర్పటుచేసి భూసంస్కరణల అమలు విషయమై చర్చించింది. 1. భూపరిమితిని మాగాణి (రెండుపంటలు) 5 హెక్టార్లు, ఒక పంట పండేది 12 హెక్టార్లకు తగ్గించాలి. దేవాదాయ ధర్మాదాయ భూములనూ భూగరిష్ట పరిమితిలోకి తీసుకురావాలి. 3. కౌలుదార్లకు పాలికాపులకు కౌలు హక్కులు, భూమి పట్టా హక్కు కల్పించాలి. 4. వట్టాదార్ల భూములను తిరిగి ఎవ్వరూ ఆక్రమించుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలి. 5. పెండింగ్‌లో వున్న భూసంస్కరణ కేసుల సత్వర పరిష్కారం కోసం హైకోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటుచేయాలి. 6. ఈ నిర్ణయా లన్నింటినీ రెండేళ్లలోగా (1987 మే నెల) అమలు పర్చాలి. వీటి అమలు నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే తీరున ఒక్క నిర్ణయమూ అమలుకు నోచుకోలే. అధికారంలోకి వచ్చిన ఏ రాజకీయ పార్టీకి భూ సంస్కరణల పట్ల చిత్తశుద్ధి లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అస్పష్టంగా న్యాయవ్యవస్థ జోక్యం. తాజా సమాచారంతో కూడిన రికార్డులు లభ్యం కాకపోవడం భూస్వామ్యం చేతిలో రాజ్యాధికారం. అధికారులు అమ్ముడు పోవడం వెరసి భూసంస్కరణల వైఫల్యం.

మిగులు భూములు:

ఎ. రెండు లక్షల ఎకరాలకు పైగా మిగులు భూములు కోర్టు పెండింగులో వున్నాయి. ముప్పై ఏళ్ల క్రితం మెట్టగా చూపింది నేడు మాగాణీ అయింది. గరిష్ట పరిమితిని 25 ఎకరాలకు తగ్గించిన 1990-91 గణాంకాల మేరకు మిగులు భూమి 16 లక్షల ఎకరాలకు పై చిలుకే తేలాల్సి వుంది.

దేవాలయ ధర్మాదాయ భూములు:

బి. 5 లక్షల ఎకరాలకు పైగావుంది. 80 శాతం భూమి కౌలు రూపంలో భూస్వాముల చెంతనే వుంది. వాస్తవంగా ఐదు ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్ట కలిగిన వారికి ఈ భూములు కౌలుకు ఇచ్చే వీలులేదు.

తీరప్రాంత భూములు

సి. ఆంధ్రా కోస్తా ప్రాంతాల్లో తీర ప్రాంత భూములు 5 లక్షల ఎకరాలకు పైగా వున్నాయి. మత్స్యకారులు, ఉప్పురైతులు ఈ భూములు వినియోగించుకొంటున్నారు. చట్టరిత్యా ఎవరూ కౌలుదార్లు కాదు. రొయ్యల పెంపకానికి బహుళజాతి సంస్థలు ఈ భూముల న్నాక్రమించుకుని అనుభవిస్తున్నారు. ప్రభుత్వం అనుకూల ఉత్తర్వులను జారీ చేసింది. ప్రజా ఉద్యమ ఫలితంగా అవి చెల్లకుండా పోయినాయి. ఈ భూములపై ఆధారపడే నిజమైన హక్కుదార్లకు వాటిని సంక్రమింప జేయాలి.

బంజరు భూములు:

డి. రాష్ట్రంలో ఇప్పటికే 34 లక్షల బంజరు భూములను పంచినట్టు చెట్టుకుంటున్నా, చాలా భూములు పేదల చేతుల్లో లేవు. ఈ భూములనే కౌలుకు ఇవ్వటం, అమ్ముకోవడం జరుగుతుంది. నిజమైన లబ్ధిదార్లను గుర్తించాలి.

భూధాన భూములు:

ఇ. రాష్ట్రంలో నేటికీ 90 వేల ఎకరాలకు పైగా భూమి పంచకుండా వుంది. అన్యాక్రాంతమైన వీటిని బడుగువర్గాలకు అందజేయాల్సి వుంది. అటవీ బంజర్లుగా ఎనిమిది లక్షల ఎకరాలు సేద్యానికి అనువైన భూమి వుంది. గిరిజనులకు దీన్ని అప్పగించాలి.

గిరిజన భూముల సమస్య:

రాష్ట్రంలో 3 లక్షల ఎకరాల గిరిజన భూములు అన్యాక్రాంత మైనాయి. ఈ భూములపై హక్కుల పరిరక్షణ కనువుగా 1/70 గిరిజన రెగ్యులేషన్ చట్ట అమలుకై చర్యలు తీసుకోవాలి. వివిధ ట్రస్టులకింద, ఫామ్సుకింద, బోగస్ సొసైటీల కింద ఐదు లక్షల ఎకరాల భూమి అక్రమ హక్కుగా కొనసాగుతుంది.

ఈ రకంగా వివిధ రూపాల్లో లక్షలాది ఎకరాలు అన్యాక్రాంతంగా వినియోగింపబడుతుంటే, గ్రామీణ పేదలు దారిద్రంమాటున బతుకులు వెళ్ళతీస్తున్నారు. సాంఘిక అసమానతలు తొలగాలంటే భూసంస్కరణల అమలు తక్షణ కర్తవ్యంగా చేపట్టాల్సి వుంది. మనది వ్యవసాయ దేశం అయినందున భూసంస్కరణల అమలు అనివార్యం.

పేద ప్రజలకు అంకితమైన పార్టీగా, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసీదిగా చెప్పుకుంటున్న ప్రభుత్వం-భూసంస్కరణల ఆవశ్యకతను గుర్తించాల్సి వుంది.

సమూలమైన 'రాజకీయ విప్లవం' లేకుండా సమూల 'వ్యవసాయ సంస్కరణలు' సాధ్యం కావనే గత చరిత్ర మరోసారి పునరావృతం కావాల్సి వుంది. ఆ బాధ్యత ప్రగతిశీల శక్తులదే మరి, ఎందుకంటే 'చిత్తశుద్ధి'ని శంకించగలస్థాయికి ప్రజలెదిగారు.

1-11-1969 నుండి 30-11-2002 వరకు రాష్ట్రంలో వ్యవసాయావసరాలకు భూమిలేని పేదలకు ప్రభుత్వం పంచి పెట్టిన భూమి వివరాలు

(ఎకరాల్లో)

జిల్లా	1-11-1969 నుంచి 30-11-2002 వరకు మొత్తం పంపకం								మొత్తంలబ్ధి పొందినవారు	మొత్తంపంపకం చేసినభూమి	ఇంకాపంచాల్సిన భూమి
	ఎస్సీలు	విస్తీర్ణం	ఎస్టీలు	విస్తీర్ణం	బి.సి	విస్తీర్ణం	ఇతరులు	విస్తీర్ణం			
శ్రీకాకుళం	16826	15591.06	21272	19913.87	15309	14231.17	22556	21051.12	75963	70787.22	0
విజయనగరం	17486	21829.91	22247	27777.66	15897	19846.51	23814	29639.65	79444	99198.87	15.12
విశాఖపట్నం	17735	36570.47	22444	45624.1	16111	33168.38	23717	46414.34	8007	161777.29	2144.18
తూర్పుగోదావరి	11237	12239.29	14294	15558.24	10216	11116.24	15299	16628.18	51046	55541.95	639.8
పశ్చిమగోదావరి	12195	18369.21	10288	23226.44	7367	16486.16	10852	24542.15	40702	82603.96	303.76
కృష్ణా	14536	19242.48	18395	24400.31	13343	17602.07	19763	26185.85	66037	87430.71	73.33
గుంటూరు	15857	15504.73	20168	19722.77	14426	14099.87	21610	21124.83	72061	70452.2	450.87
నెల్లూరు	52272	91892.55	65906	116019.95	47472	83527.09	70397	124060.91	236047	415500.5	2550.9
ప్రకాశం	37603	69959.48	47575	88508.9	34294	63961.77	51010	95385.64	170482	317815.79	1737.22
చిత్తూరు	48361	85044.53	61413	107985.37	44060	77457.56	65676	115396.22	219510	385883.68	0
కడప	19407	49396.46	24405	62283.38	17698	44964.01	26460	67345.86	87970	223989.71	8762.9
అనంతపూర్	45083	135892.64	56529	171396	41065	123821.91	60734	193542.88	203411	624653.43	3536.73
కర్నూలు	8338	24694.34	10580	31344.93	7573	224147	11273	33439.69	37764	111893.66	340.38
ఆదిలాబాద్	15979	47161.17	20337	60023.31	14526	42873.79	21793	64315.01	72635	214373.28	35.77
ఖమ్మం	24494	60570.01	33243	81467.23	22629	54909.81	33129	82862.14	113495	279789.19	0
వరంగల్	38128	38101.03	48527	48492.22	34662	34637.3	51996	51955.95	173313	173186.5	0
కరీంనగర్	25031	23401.59	31785	29721.35	22765	21331.71	34118	31912.4	113699	106367.05	167.92
మహబూబ్‌నగర్	25430	46582.95	32228	59099.4	23176	42410.55	34400	63105.02	115234	211197.92	1135.69
మెదక్	32276	52745.64	41079	67130.82	29342	47950.58	44070	7125.92	146714	239752.96	4579.15
నిజామాబాద్	31998	35976.25	40699	45746.16	29111	32753.05	43603	48990.22	145411	163465.68	195.92
నల్గొండ	52959	63467.2	14409	18639.07	50238	57953.58	15618	17107.19	133224	157167.04	1332.37
రంగారెడ్డి	7896	15082.92	10046	19192.51	7176	13708.93	10766	20563.42	35884	68547.78	418.26
హైదరాబాద్	0	0	0	0	0	0	0	0			
మొత్తం	**571127**	**979315.91**	**667869**	**1183273.99**	**518456**	**1092959.04**	**712654**	**1202694.59**	**2398053**	**4321376.37**	**28420.27**

(వెలుగు పథకం సంస్థ)

చీకటినుంచి చీకట్లోకి...ఓ 'జంగు' కథ

అతనో దగాపడ్డ జీవచ్ఛవం. పేరు జంగు! వయసు తెలీదు. యువకుడే అయివుండవచ్చు కానీ అన్నిరకాల వార్థక్యపు ఛాయలు మీదపడ్డాయి. బతుకు తాలూకు ఎదురుదెబ్బలు తగలవలసిన దానికంటే ఎక్కువే తగిలాయి. తనకెవరైనా సాయం చేస్తారేమోనని దిక్కులు చూసే శక్తి కూడా ఇప్పుడతనికి లేదు. ఇలా తనలాగా దగాపడ్డ గోండ్లు ఇంకా ఎంతమంది వున్నారో జంగూకు తెలియదు. జంగు ఆలోచిస్తున్నాడు. భవిష్యత్తు గురించి కాదు తన గతం గురించి.. అతనికి భవిష్యత్తు లేదు; వున్నదంతా బరువైన గతమే!

అనంతరామ్‌సోము... ఆదిలాబాద్ ప్రాంతంలో పుట్టిన గోండు పటేల్. కొద్దిపాటి భూమిలో బంగారం పండించుకుంటున్న ఈ గిరిజనుడు ఊళ్ళో అందరికీ పెద్ద తలకాయ. ఎవరికేకష్టం వచ్చినా ప్రత్యక్షమయ్యే సోము అంటే గౌరవం కూడా. ఆ ఊళ్ళోకి కొత్త వాళ్ళెవరు వచ్చినా సోము ఇంట్లోనే ఆతిధ్యం! వచ్చటి పొలాలు..చుట్టూ కొండకోనలు. బంగారం పండే ఈ భూముల మీద నిజాం నవాబుల కన్నుపడింది. ఇప్పటి నేషనల్ హైవేకు ఆవతలివునే వున్న సారవంతమైన భూములంటే నవాజంగానే ఇటు తెలంగాణా..అటు మహారాష్ట్ర కామందులకు ఆకలేసింది. ఈ కుట్రలు కుతంత్రాలు తెలియని సోము తన గిరిజనేతర మిత్రులకు ఎప్పటిలాగానే ఆతిధ్యమర్యాదలు చేస్తూనే వున్నాడు. అయితే ఆ ఆతిద్యబంధం ఎక్కువకాలం కొనసాగలేదు. అవి గాంధీజీ ఉప్పుసత్యాగ్రహం చేస్తున్న రోజులు సరిగ్గా అదే సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సోము దగ్గరకొచ్చాడు. ఏవో కాగితాలు చూపించి "ఫలానా వ్యాపారస్తుడి భూమిని నువ్వు దున్నుకొంటున్నావు... వెంటనే ఖాళీ 'చేయాలి' అంటూ తాఖీదు జారీ చేశాడు. తన తాత ముత్తాతల నుంచి ఇదే భూమిని సాగుచేసుకొంటున్నామని సోము ఆ ఇన్‌స్పెక్టర్ కాళ్ళావేళ్ళా పడ్డా అతను కనికరించలేదు. ఎవరి పట్టా భూమిలోనో నువ్వెలా వుంటావంటూ ఖాళీ చేయించాడు.

తరతరాలుగా వున్న సొంత ఊరిని..ఇంటిని వదిలి పెట్టి సోము వెళ్ళిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగి..మైళ్ళకు మైళ్ళు నడిచి, దట్టమైన అడవిలో ఓ చోట (ఇప్పటి ఉట్నూరు) స్థిరపడ్డాడు. వయసు మీద పడ్డా... కొంతమందితో కలిసి ఆ కొండకోనల్లో కాయకష్టం చేసి కొంత భూమిని సాగుచేసుకొంటున్నాడు. సరిగ్గా అదే సమయంలో గుర్రమెక్కి ఓ ముస్లిం అతనున్న చోటుకు వచ్చి.."నువ్వు దున్నుకొంటున్న భూమి నాది" అంటూ నిజాం నవాబు తనపేరిట నాలుగువేల ఎకరాలపై హక్కుపత్రాన్ని చూపించాడు. 'ఇజరాదార్' పేరుతో వున్న సదరు హక్కు పత్రాల గురించి ఏమీ తెలియని సోము లొంగిపోయాడు. తన భూమిలో తానే కౌలుదారుడిగా మారిపోయాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. వాడవాడలా స్వాతంత్ర వేడుకలు ఘనంగా జరుపుకొంటున్నారు. తన సొంతభూమిని రెండుసార్లు వదులుకుని కేవలం ఓ రైతు కూలీగా మారిన సోముకు 'స్వాతంత్రానికి' అర్థం తెలియలేదు. ఇక్కడ చిన్న మలుపు. అక్కడి తాలూకాదారు సోము పేరును కౌలుదారుడిగా నమోదు చేసుకున్నాడు(1951 ప్రొటెక్టెడ్ టెనెంట్) కానీ సోము కథ మళ్ళీ వక్రించింది. దగాపడ్డ సోము పూర్తిగా ఢీలాపడ్డాడు. మంచం పట్టి కొన్నిరోజులకే మరణించాడు. సోము వదలిపెట్టిన అప్పయినా, ఆస్థి అయినా అతని కొడుకు జంగూయే!

తండ్రిపోయిన జంగూకు బతుకుతెరువు కోసం మళ్ళీ ప్రయాణం తప్పలేదు. మైళ్ళు నడిచి దట్టమైన అడవిలో చంద్రపూల్ నుంచి వచ్చిన కొంతమంది మహర్లతో కలిసి సాగుచేసుకోవడం మొదలు పెట్టాడు జంగూ! అటవీప్రాంతాన్నే ఆక్రమించి వ్యవసాయం చేసుకొంటున్నావంటూ మామూళ్ళు దండుకునే అధికారులు జంగూను పీడించుకుని తిన్నారు. ఫారెస్టుగార్డులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల జులుంతో ఇరవైఏళ్ళు గడిచిపోయాయి. అకస్మాత్తుగా ఒకరోజు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసరొచ్చాడు. 'నువ్వు దున్నుతున్న పొలం రిజర్వు ఫారెస్టు పరిధిలోకి వచ్చింది. ఖాళీ చేయాల్సిందే' అంటూ హుకుం జారీ చేశాడు.

జంగుతో పాటు సాగుచేసుకొంటున్న వాళ్ళు గిరిజనులు కాకపోయినా సాగుచేసుకుంటూనే వున్నారు. అదేమని అడిగితే 'వాళ్ళపరిధి వేరే' అంటూ అధికారుల సమాధానం. కాళ్ళా వేళ్లా పడితే.. సెక్షన్ 38ఇ కింద జంగూకు టెనెన్సీ పట్టం కింద పట్టా ఇచ్చాం పొమ్మన్నారు. కానీ కాగితం చేతికి రాలేదు. ఆ భూమికి ఎప్పుడో 'ఇజారాదర్' నుంచి కొనుక్కున్నానని చెప్పుకుంటున్న ఒక మరాఠీ వ్యాపారి దాని హక్కులకోసం రెవెన్యూకోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్ళాడు. అప్పుడప్పుడూ జంగూకు కోర్టు నోటీసు కాగితాలు అందుతూవుంటాయి. తన తండ్రిలానే జంగూకు దానిలో వున్న విషయం తెలియదు.

జంగూ ఇంకా బ్రతికే వున్నాడు. జీవచ్ఛవంలా... జంగూకు ఇల్లులేదు..భూమిలేదు...వున్నదల్లా ఆకలి.

జంగూ నడుస్తున్నాడు...ఏవైపు...తుపాకీల వైపా? జంగూ ఆలోచిస్తున్నాడు.

ఒకవేళ భూసంస్కరణల చట్టాల గురించి విన్నా చదివి అర్థం చేసుకోగలిగినా.. వాటి ప్రయోజనాలు మాత్రం జంగూ వంటి వాళ్ళకు దక్కవు వీటికి కారణాలు ఆలోచించి, అన్వేషించే వాళ్ళెవరు?

Dr.B.R.AMBEDKAR OPEN UNIVERSITY

Prof.G.Ram Reddy Marg,Road.46, Jubilee Hills, HYDERABAD-500 033.(AP)
Telephone Nos:23546271,23546272,23544771,23546616.Fax: 091-040-23544830.
Email: open@braou.ac.in web: www.dr.braou.ac.in

Dr.B.R. Ambedkar Open University, the first of its kind in the country was established by an Act of the A.P. Legislature in 1982, has made higher education accessible to everyone A.P.,irrespective of age, geographical location, domestic or work responsibilities. **"Learning while Earning"** is made possible with the university's motto **"Education at your Doorstep"**. The university has a network of **144** Study Centres including **23** RCCs throughout the State of Andhra Pradesh

PROGRAMMES OFFERED

1. Bachelor of Arts(B.A)-3Years
2. Bachelor of Commerce(B.Com)-3Years
3. Bachelor of Science(B.Sc)-3Years
4. M.A. (History)-2Years
5. M.A. (Economics)-2Years
6. M.A. (Political Science)-2Years
7. M.A. (Public Administration)-2 Years
8. M.A. (Sociology)-2Years
9. M.A. (English)-2Years
10. M.Com. 2Years
11. M.Sc.(Mathematics)-2Years
12. M.Phill.in Development Studies*
13. Ph.D in Development Studies* (*Offered in collaboration with CESS)
14. Ph.D.in Open Distance Education by GRADE, BRAOU-2Years
15. Bachelor's Degree in Public Reastions (BPR)-1year
16. Bachelor's Degree in Library & Information Science (BLISC)-1Year
17. Master's Degree in Library & Information Science (MLISC) -1Year
18. Master's Degree in Business Administration (MBA)-3Years
19. Certificate Programme in Food & Nutrition (CPFN)-6Months
20. Certificate Programme in English Communication (CPEC)-6 Months
21. P.G. Diploma in Marketing Management (PGDMM)-1Year
22. P.G. Diploma in Business Finance (PGDBF)-1 Year
23. P.G. Diploma in Environmental Studies (PGDES)-1Year
24. P.G. Diploma in Writing for Mass Media in Telugu (PGDWMMT)-1Year
25. P.G. Diploma in Human Rights (PGDHR)-1Year
26. P.G. Diploma in Women Studies (PGDWS)-1Year

SPECIAL FEATURES:

* Access to large numbers
* Flexible study options
* Innovative design of curriculum
* Self-instructional materials
* Wide network of learner support systems
* On-going counselling throughout the academic year
* Radio and T.V. Programmes
* Study and Examination at learner's pace
* Live phone-in-radio and Tele-conferencing through DD-8 and Mana TV
* Three mediums of instructon-Telugu, English and Urdu

The University is also offering the following programmes in ollaboration with reputed institutions like **NIIT; Dr.Reddy's Labs:and SETWIN.**

I. **Diploma in Computer Application from NIIt along with University Degree:**
   * The University entered into an agreement with NIIT to offer **"Computer Application"** as one of the three optional subjects.
   * Free Concession is also available.
   * The Subject will have 4 Courses like other Optional subjects.

II. **B.Sc (Special)-Value Added Degree Programme:** The University is offering **B.Sc(Special) Degree Programme in Drug Sciences** in collaboration with Dr. Reddy's Lab (Hyderabad) with the following optional subjects which are compulsory.a) Chemistry, b) Drug Chemistry, c) Drug Technology.

III. **Job-Orented & Self-Employment Programme in collaboration with SETWIN:** The Uinversity & SETWIN (A Govt. of A.P.Society) have signed MoU to offer all the SETWIN Courses with 30% fee concession to BRAOU Students.

Advt. No 180/Dr.BRAOU/PR/2004

Sd/-REGISTRAR I/C

PRINTED BOOK

RNI Regn. No. APTEL 2003 11482 Postal Regn. No. LII RNP H-HD-1029 2004-06

రైతాంగానికి సహాయం... పెరిగిన రుణ సదుపాయం



మన రాష్ట్రంలోని గ్రామీణ, వ్యవసాయ రంగాలు నిలకడగా అభివృద్ధిని సాధించాలంటే సమర్థమైన పరపతి విధానం చాలా అవసరం. ప్రస్తుత సరళీకృత ఆర్థిక విధానాలు మన గ్రామీణ పరపతి సంస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల వీటికి అనుగుణంగా మన విధానంలో మార్పులు తీసుకొని రావాలి. వ్యవసాయ రంగంలోని ఉత్పత్తికీ, పెట్టుబడులకూ, వెన్నుదన్నుగా నిలిచే పరపతి విధానాన్ని రూపొందించుకుని, గ్రామీణ పరపతి సంస్థలను బలోపేతం చేయాలి.

పెరిగిన రుణ సహాయం

రాష్ట్రంలో చిన్నతరహా, మధ్యతరహా రైతులు వ్యవసాయ రుణాల అవసరాలు ఇంకా తీరాల్సి ఉన్నా ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. 2003-2004 ఆర్థిక సంవత్సరంతో సరిపోల్చి చూస్తే 2004-2005 సంవత్సరానికి గాను పంట రుణాలను 41.78 శాతానికి, కాలావధి రుణాల్లో 147.41 శాతానికి పెంచింది. ఈ ఏడాది ఖరీఫ్ కాలానికి కేటాయించిన 7,500 కోట్ల రూపాయలలోని ఆగస్టు 25 నాటికి 5,066 కోట్ల రూపాయలను పంపిణీ చేసింది. గత సంవత్సరంతో సరిపోల్చి చూస్తే ఇది 1161 కోట్ల రూపాయలు ఎక్కువ.

ప్రభుత్వం చేపట్టిన చర్యలు

మన రాష్ట్రంలోని గరిష్ఠ సంఖ్యలోని రైతులను రుణ సహాయం అందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వర ఆదేశాలు జారీచేసింది. అవి సక్రమంగా అమలు జరిగేందుకు వ్యవసాయ శాఖలోని యంత్రాంగం చురుగ్గా వ్యవహరిస్తోంది.

- పట్టాదారు పాసుపుస్తకాలు లేవన్న కారణంతో రుణాలు పొందలేకపోతున్న రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సహాయం అందించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.
- ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ, బ్యాంకులు విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి.
- ఇంతవరకు గ్రామీణ పరపతికి నోచుకోని రైతుల జాబితాను రూపొందించాలని, ఆ జాబితాలోని రైతులకు గ్రామీణ పరపతి సంస్థల ద్వారా రుణాలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రభుత్వ యంత్రాంగం పెద్దఎత్తున కృషి చేస్తోంది. ఇప్పటివరకు 13.56 లక్షల రైతులు ఆ జాబితాలో చోటు చేసుకున్నారు. ఒక్కో బ్యాంకూ ఇప్పుడు ఉన్న సంఖ్యకు అదనంగా నూరుగురు రైతులకు రుణలివ్వాలని ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ ఏడాది కనీసం 4.90 లక్షల మంది అదనపు రైతులకు 1345 కోట్ల రూపాయల రుణాలు బ్యాంకుల ద్వారా అందజేయబడతాయి.
- నాబార్డ్ రూపొందించిన మార్గదర్శక సూత్రాల సహాయంతో విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, కడప, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 6000 రైతు మిత్రా గ్రూపులను రుణ సహాయం కోసం గుర్తించడం జరిగింది. వివిధ బ్యాంకులు, వాటి శాఖలు చిన్నతరహా, మధ్యతరహా రైతులకు రుణాలను పంపిణీ చేస్తున్నాయి.
- అన్ని రకాల పంటలకూ పూర్తిస్థాయి పరపతి లభించేలా జిల్లా కలెక్టర్లు, జేడీయేలు, బ్యాంకు అధికారులు కృషి చేస్తున్నారు.

కరువు బారినపడ్డ రైతులకు బకాయిలపై ఊరట

- ఇంతవరకు రైతులు బకాయిపడ్డ అసలు, వడ్డీలను 2004 మార్చి 31 నాటి అసలు మొత్తంతో కలిపి, దీన్ని ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీ రేట్లలో అయిదు సాంవత్సరిక వాయిదాల్లో రైతులు చెల్లించేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది.
- గతంలో బకాయిలు ఉన్న రైతులకు కొత్త రుణాలు అందేలా నాబార్డ్ మార్గదర్శక సూత్రాలను వెలువరించింది.
- క్షామపీడిత బడుగు రైతులకు తోడ్పడేందుకు స్వల్పకాలిక రుణాలతో అసలు మొత్తాన్ని మధ్యకాలిక రుణాలుగా మార్చడం జరిగింది. చిన్న, మధ్యతరహా రైతులు తమ స్వల్పకాలిక రుణాలపై చెల్లించాల్సిన వడ్డీలను ప్రస్తుతానికి వాయిదావేసి, రాబోయే పంట కాలంలో చెల్లించేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. వీటికి చక్రవడ్డీ వర్తించకపోవడం గమనించాల్సిన విషయం.
- పరపతిని అవసరాలకు అనుగుణంగా పొందేందుకు వీలుగా బ్యాంకులు కిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు అందజేస్తున్నాయి. ప్రస్తుతం 56.6 లక్షల మందికే ఇవి అందుబాటులో ఉన్నాయి. ఇంకా 43.4 లక్షల మంది రైతులకు వీటిని అందించేందుకు బ్యాంకులు కృషి చేస్తున్నాయి.
- 5.85 లక్షల రైతులు చెల్లించాల్సిన 1417 కోట్ల రూపాయల పంట రుణాలను మధ్యకాలిక రుణాలుగా మార్చడం జరిగింది.

జారీచేయువారు : సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్.

Owned, Printed and Published by V.Hanumantha Rao at D.No.8-3-898/22, Road No.3, Nagarjuna Nagar, Hyderabad-5000 073 Ph: 23748672, DTP at Samata Graphics, Hyderabad. Printed at Akruti, Chikkadapalli, Hyderabad. Editor: V.Hanumantha Rao